## నీలగిరి నిత్యపద్యం

**ఆటవెలది**

వయసులోన కలుగు వలపును ప్రేమని
తలచి యువత తప్పు దారిపట్ట
భావి జీవితముకు భంగము కలుగదా?
తెలిసి మసలుకొనుడు తెలివితోడ
మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి


RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దినపత్రిక



**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా
WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.



సంచిక 21 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | సోమవారం | జూలై 20, 2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00


### ఇవాళ నుంచి ఆగస్టు 3 వరకు నేతలు

# గాంధీభవన్‌కు రావొద్దు

**- పార్టీ ముఖ్యనేతలకు పలు కీలక సూచనలు చేసిన సీఎం రేవంత్ రెడ్డి**



**హైదరాబాద్ :** ఛైర్మన్, ఇతర పదవుల కోసం గాంధీభవన్ చుట్టూ తిరిగే నాయకులకు ఇకపై అపాయింట్‌మెంట్లు ఇవ్వొద్దని, సోమవారం నుంచి ఆగస్టు 3తేదీ వరకు ఎవ్వరూ గాంధీభవన్‌కు రావొద్దని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఎస్?ఐఆర్? అంశంపై కాంగ్రెస్? పార్టీ నాయకులతో నిర్వహించిన జూమ్? సమావేశంలో పార్టీ నాయకత్వానికి ఎస్?ఐఆర్?పై సీఎం రేవంత్ రెడ్డి స్పష్టమైన దిశానిర్దేశం చేశారు.నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవు : సోమవారం నుంచి పది మంది ఇన్‌ఛార్జి మంత్రులు అన్ని జిల్లాల్లో ఎస్ఐఆర్‌పై సమీక్షా సమావేశాలు నిర్వహిస్తారని, పార్లమెంట్ సమావేశాల్లో ఉన్న ఎంపీలు కూడా ఎప్పటికప్పుడు సమీక్షలు కొనసాగించాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. ఇన్‌ఛార్జీలుగా ఉన్న చోట ఎంపీలు నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్ఐఆర్ గడువును ఆగస్టు 3వ తేదీ వరకు పొడిగించడం కాంగ్రెస్ పార్టీకి వచ్చిన కీలక అవకాశమని, ప్రతి నాయకుడు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇప్పటికే 489 సమావేశాలు నిర్వహించినప్పటికీ, వెనుకబడిన నియోజకవర్గాల్లో ఇప్పటికైనా చురుకుదనం చూపించాలని రేవంత్ రెడ్డి ఆదేశించారు.పరస్పర సమన్వయంతో ముందుకెళ్లాలి : పార్టీ పరంగా ఎస్ఐఆర్ ఇన్‌ఛార్జీలుగా పనిచేస్తున్న నాయకులు పరస్పర సమన్వయంతో ముందుకెళ్లాలని, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జీలు, ఛైర్మన్లు బీఎల్‌ఓల నివేదికల కంటే బీఎల్‌ఏల నివేదికలకు ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం ఆదేశించారు. కేవలం బీఎల్‌ఓల నివేదికలపైనే ఆధారపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పార్టీ తరఫున పనిచేస్తున్న బీఎల్‌ఏలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని, నాయకులంతా పూర్తిగా క్షేత్రస్థాయిలో ఉండాలని, హైదరాబాద్‌లోనే ఉంటే పనులు సాగవని స్పష్టం చేశారు. వచ్చే పది రోజులు ఎన్నికల ప్రచారం తరహాలో ప్రతి నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించాలని మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జీలు, కార్పొరేషన్ ఛైర్మన్లు, పార్టీ ప్రతినిధులకు ఆదేశాలు జారీ చేశారు.ఎస్ఐఆర్‌పై ఇన్‌ఛార్జి మంత్రులదే బాధ్యత : గాంధీభవన్ బృందం ఎప్పటికప్పుడు బీఎల్ఏ, బీఎల్ఓ నివేదికలను పరిశీలించాలని, ఎస్ఐఆర్ ప్రక్రియపై ఇన్‌ఛార్జి మంత్రులే పూర్తి బాధ్యత తీసుకోవాలని సీఎం రేవంత్ సూచించారుఈ నెల 30వ తేదీన మరోసారి పూర్తి స్థాయి సమీక్ష నిర్వహించి, అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా నివేదికలు పరిశీలిస్తామని తెలిపారు..

### రైతులు ఆరుతడి పంటలకే

# మొగ్గు చూపాలి



**కరీంనగర్, జులై 19:** తెలంగాణ రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంపై వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు ఎల్‌నినో ప్రభావంపై కీలక వ్యాఖ్యలు చేశారు. కరీంనగర్ జిల్లాలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉండే అవకాశం ఉందని, దాని ప్రభావంతో రాష్ట్రంలో వర్షపాతం తగ్గే పరిస్థితులు ఏర్పడవచ్చని ఆయన తెలిపారు. కేవలం సాగునీటికే కాకుండా తాగునీటి అవసరాలు తీర్చడంలో కూడా ఇబ్బందులు ఎదురయ్యే అవకాశము ందని హెచ్చరించారు. ప్రస్తుతం ప్రాజెక్టుల్లో ఉన్న నీటి నిల్వలను దృష్టిలో ఉంచుకుంటే సాగునీటిని యథేచ్ఛగా విడుదల చేసే పరిస్థితి లేదని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో రైతులు పరిస్థితులను ముందుగానే అర్థం చేసుకుని తక్కువ నీటితో సాగయ్యే ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని సూచి ంచారు. నీటి లభ్యతను బట్టి పంటల ఎంపిక చేసుకుంటే నష్టాలను గణనీ యంగా తగ్గించుకోవచ్చని రైతులకు మంత్రి సూచించారు.అధికార యం త్రాంగం కూడా అప్రమత్తంగా ఉం డాలని మంత్రి తుమ్మల నాగేశ్వరావు ఆదేశించారు. వ్యవసాయం, నీటిపారుదల, గ్రామీణాభివృద్ధి, తాగునీటి సరఫరా సహా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ముందస్తు ప్రణాళికతో పనిచేస్తేనే ప్రజలు, రైతులు ఇబ్బందులు పడకుండా కాపాడగలమని పేర్కొన్నారు. వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు మంత్రి వెల్లడించారు.

### యువతను రెచ్చగొట్టడం

# మానుకోవాలి



**కరీంనగర్, జులై 19:** రాష్ట్రంలో నిరుద్యోగ నిరసనలపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కౌంటర్ ఇచ్చారు. కరీంనగర్‌లో శనివారం మీడియాతో మాట్లాడిన ఆయన.. నిరుద్యోగ యువతను కేటీఆర్ రాజకీయ ప్రయోజనాల కోసం రెచ్చగొడుతున్నారని మండిపడ్డారు. గత పదేళ్ల బీఆర్ఎస్ హయాంలో గ్రూప్-1 పరీక్షలను ఎందుకు సక్రమంగా నిర్వహించలేక పోయారో కేటీఆర్ సమాధానం చెప్పాలన్నారు. నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడినందుకు ముందుగా బీఆర్ఎస్ నేతలే యువతకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.రాష్ట్రం లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే ఉద్యోగ నియామకాలు వేగవంతం అయ్యాయని మంత్రి స్పష్టం చేశారు. తాము ఇచ్చిన మాట ప్రకారం రెండు లక్షల ఉద్యోగాల భర్తీని పూర్తి చేసి తీరుతామని పునరుద్ఘాటించారు. 'మీ పదేళ్ల పాలనలో ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో శ్వేతపత్రం విడుదల చేయగలరా?' అని నిలదీశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడూ నిరుద్యోగుల పక్షానే ఉంటుందని, ప్రతిపక్షాల ట్రాప్‌లో పడి యువత తమ భవిష్యత్తును పాడు చేసుకోవద్దనిమంత్రి శ్రీధర్ బాబు సూచించారు.

### పార్లమెంట్ సమావేశాలకు

# సర్వం సిద్ధం



**న్యూ ఢిల్లీ :**పార్లమెంటు వర్షాకాల సమావేశాలు సోమవారం నుంచి జరగనున్నాయి. ఆగస్టు 13 వరకు కొనసాగనున్న ఈ సమావేశాల్లో ప్రవేశపెట్టేందుకు కేంద్రం 8 బిల్లులను సిద్ధం చేసింది. ముఖ్యంగా సోమవారమే పార్లమెంట్ ముందుకు రెండు కీలక బిల్లులు రానున్నాయి. సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్య 33 నుంచి 37 కు పెంచుతూ రూపొందించిన బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టనుంది. వందేమాతరం గేయానికి జాతీయగీతం హోదా కల్పిస్తూ రూపొందించిన బిల్లును కేంద్ర హోంమంత్రి అమిత్ షా రాజ్యసభలో ప్రవేశపెట్టనున్నారు. ఈ క్రమంలోనే సమావేశాలు సజావుగా సాగేందుకు అన్ని పార్టీలు సహకరించాలని కేంద్రం కోరింది. మరోవైపు అయోధ్య రామమందిరం విరాళాల దుర్వినియోగం, నీట్ పేపర్ లీకేజీ సహా పలు కీలక అంశాలపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని విపక్షాలు ప్రకటించాయి.

### రాజకీయాలపై కార్టూన్లు చూపే ప్రభావం

# ఎంతో గొప్పది




**హైదరాబాద్ :**రాజకీయ జీవితంలో ప్రతిరోజూ విమర్శలు, ప్రతి విమర్శల మధ్య గడుపుతున్న తమకు ఇలాంటి ఆహ్లాదకరమైన సాహిత్య, కళా వేదికల్లో పాల్గొనడం ఎంతో ఆనందాన్ని కలిగిస్తుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కళాకారులు, రచయితలు, కవులు, చిత్రకారులతో మమేకమయ్యే అవకాశాలు అరుదుగా వస్తాయని, అలాంటి సందర్భాలు పాత జ్ఞాపకాలను, ఉద్యమ స్ఫూర్తిని గుర్తు చేస్తాయని చెప్పారు.ప్రముఖ కార్టూనిస్ట్ శేఖర్ స్మారకార్థం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన కార్టూనిస్ట్ శేఖర్ మెమోరియల్ అవార్డ్స్ 2026 ప్రదానోత్సవ సభ ఆదివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు పురస్కారాలు అందజేశారు. కార్టూన్ విభాగంలో కార్టూనిస్ట్ ఎం. నారు, ఆర్టిస్టు విభాగంలో చిత్రకారుడు కూరెళ్ల శ్రీనివాస్ అవార్డులు అందుకున్నారు.ఈ సందర్భంగా కార్టూనిస్టుల పాత్రపై మాట్లాడిన కేటీఆర్.. 'ఒక చిత్రం వెయ్యి పదాలతో సమానం' అనే సూక్తిని ప్రస్తావిస్తూ, సమాజం, రాజకీయాలపై కార్టూన్లు చూపే ప్రభావం ఎంతో గొప్పదని అన్నారు. భారతదేశంలో ఆర్.కే. లక్ష్మణ్ వంటి మహోన్నత కార్టూనిస్టులు చూపిన మార్గం చిరస్మరణీయమని, అంతర్జాతీయంగా బిల్ వాటర్సన్ సృష్టించిన క్యాల్విన్ అండ్ హాబ్స్ తనకు ఎంతో ఇష్టమని చెప్పారు. తెలుగులో ఈనాడు శ్రీధర్, సాక్షి శంకర్ వంటి కార్టూనిస్టుల ప్రతిభను ప్రశంసించారు.ప్రస్తుత పరిస్థితుల్లో మహాత్మా గాంధీ విలువలు, ఆయన చూపిన సిద్ధాంతాల అవసరం దేశానికి మరింత పెరిగిందని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. మత విశ్వాసాలు ప్రతి వ్యక్తికి వ్యక్తిగతమైనవేనని, పరస్పర గౌరవంతో ముందుకు సాగడం సమాజానికి అవసరమని పేర్కొన్నారు. జీవితంలో గెలుపు, ఓటములు సహజమని, అధికారంలో ఉన్నా లేకపోయినా ప్రజలకు మేలు చేయడమే ప్రజాప్రతినిధుల కర్తవ్యమని కేటీఆర్ అన్నారు. కళను ప్రోత్సహించేందుకు ఇలాంటి అవార్డులు తప్పనిసరి అని పేర్కొంటూ, ప్రతిభావంతులైన యువ కళాకారులను గుర్తించి ప్రోత్సహించడం సమాజ బాధ్యత అని చెప్పారు.

### జమ్ముకశ్మీర్‌లో వరద బీభత్సం

# 17 మంది మృతి



**జమ్ముకశ్మీర్:**జమ్ముకశ్మీర్‌లోని సరిహద్దు జిల్లాలైన పూంచ్, రాజౌరిలో ఆదివారం కురిసిన భారీ వర్షాలు తీవ్ర విషాదాన్ని మిగిల్చాయి. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడటంతో కనీసం 17 మంది ప్రాణాలు కోల్పోగా, మరికొందరు గల్లంతైనట్లు అధికారులు వెల్లడించారు. రహదారులు దెబ్బతినడం, వాగులు ఉప్పొంగడంతో సహాయక చర్యలకు ఆటంకాలు ఎదురవుతున్నప్పటికీ, పలు ప్రభుత్వ శాఖలు సంయుక్తంగా సహాయక చర్యలను కొనసాగిస్తున్నాయి. మరోవైపు ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా తన దిల్లీ పర్యటనను మధ్యలోనే ముగించుకుని జమ్ముకు తిరిగి వెళ్లాలని నిర్ణయించుకున్నారు. పరిస్థితిని సమీక్షిస్తున్నట్లు తెలిపారు.పూంచ్? జిల్లాలోని సురన్?కోట్ తహసీల్ అత్యంత తీవ్రంగా ప్రభావితమైంది. లోయర్? ముర్రా గ్రామంలో భారీ వర్షాల కారణంగా కొండచరియలు విరిగిపడి ఓ ఇంటిపై పడింది. ఆ సమయంలో ఇంట్లో ఉన్న ఎనిమిది మంది శిథిలాల కింద చిక్కుకున్నారు. రెస్క్యూ సిబ్బంది ఐదుగురి మృతదేహాలను వెలికి తీశాయి. వీరిలో రెండేళ్ల చిన్నారి కూడా ఉంది. అదే తహసీల్‌లోని సంగ్లా గ్రామంలో ఆకస్మిక వరదల ధాటికి మరో ఇల్లు పూర్తిగా కొట్టుకుపోయింది. ఈ ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు గల్లంతయ్యారు. సంగ్లా గ్రామంలో ఆకస్మిక వరదల ధాటికి మరో ఇల్లు పూర్తిగా కొట్టుకుపోయింది.

# రంగారెడ్డి వైద్యశాఖలో కలకలం

**- డీఎంహెచ్‌వో పై మంత్రికి వైద్య సిబ్బంది ఫిర్యాదులు**
**- హెల్త్ సెక్రటరీకి ఫోన్ చేసిన దామోదర రాజనర్సింహ..**
**సమగ్ర నివేదికకు ఆదేశాలు**





**హైదరాబాద్, జూలై 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో నెలకొన్న పరిస్థితులపై వైద్య సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తూ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి డా. దామోదర రాజనర్సింహను ఆశ్రయించారు. హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో ఆదివారం టీఎన్‌జీవో సెంట్రల్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు జగదీశ్వర్ ఆధ్వర్యంలో డిప్యూటీ డీఎంహెచ్‌వోలు, వైద్యులు, ఇతర ఉద్యోగులు మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు.జిల్లా డీఎంహెచ్‌వో డా. స్వర్ణకుమారి బాధ్యతలు చేపట్టిన తర్వాత కార్యాలయ పరిపాలనలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని, సిబ్బందితో వ్యవహరించే తీరు కారణంగా ఉద్యోగుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని వినతిపత్రంలో పేర్కొన్నారు. పలువురు వైద్యులు మానసిక ఒత్తిడికి గురయ్యారని, కొందరు రాజీనామా చేయగా, మరికొందరు దీర్ఘకాలిక సెలవులకు వెళ్లిన పరిస్థితులు ఏర్పడ్డాయని ప్రతినిధులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. డీపీఎంయూ సిబ్బంది విధుల నిర్వహణలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కూడా వివరించారు.
జాతీయ ఆరోగ్య మిషన్ పరిధిలోని పలు కార్యక్రమాల అమలు ప్రభావితమవుతోందని, బస్తీ దవాఖానా సిబ్బంది వేతనాలు, ఈసీ-ఏఎన్ఎంల జీతాలు, ఆశా కార్యకర్తల హానరేరియం, టీబీ రోగుల నిక్షయ్ పోషణ డీబీటీ, ఆర్‌బీఎస్‌కే సేవలు, పల్స్ పోలి యో బిల్లుల చెల్లింపులు ఆలస్యమవుతున్నాయని వినతిపత్రంలో పేర్కొన్నారు. కొండాపూర్ ల్యాబ్ సేవల నిర్వహణపైనా ఆందోళన వ్యక్తం చేశారు.వినతిపత్రాన్ని పరిశీలించిన మంత్రి డా. దామోదర రాజనర్సింహ వెంటనే హెల్త్ సెక్రటరీ క్రిస్టినా చొంగ్‌తో ఫోన్‌లో మాట్లాడి, ఫిర్యాదులపై సమగ్ర విచారణ నిర్వహించి నివేదిక సమర్పించాలని ఆదేశించినట్లు సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులు తెలిపారు. ప్రజారోగ్య సేవలకు అంతరాయం కలిగించే అంశాలను ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తుందని, వాస్తవాలను నిర్ధారించి తగిన చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించినట్లు వెల్లడించారు.తమ సమస్యలను వెంటనే పరిశీలించి స్పందించిన మంత్రికి జిల్లా వైద్య సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు. ఫిర్యాదులపై నిష్పాక్షిక విచారణ జరిపి, జిల్లా వైద్య సేవలు సజావుగా కొనసాగేందుకు అవసరమైన పరిపాలనా చర్యలు చేపట్టాలని, వినతిపత్రంలో ప్రస్తావించిన అంశాలను అత్యవసరంగా పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు.

సోమవారం, జూలై 20, 2026
నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక
RNI - TELTEL/2023/87644



# రాష్ట్ర వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా సమీక్షా సమావేశం

**కరీంనగర్, జూలై 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు కరీంనగర్ కలెక్టరేట్‌లో రాష్ట్ర వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా సమీక్షా సమావేశం జరిగింది.కరీంనగర్ జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ పంటల మార్పిడి విధానం, ఆరుతడి పంటల సాగుపై రైతు వేదికల ద్వారా గ్రామ గ్రామాన అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. వరికి బదులుగా తక్కువ నీటితో సాగయ్యే పంటలను ప్రోత్సహిస్తూ కరీంనగర్ జిల్లాను రాష్ట్రానికి ఆదర్శంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేశామని చెప్పారు.రాజన్న సిరిసిల్ల కలెక్టర్ గరీమా అగర్వాల్ ప్రత్యేక యాక్షన్ ప్లాన్ రూపొందించి అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశామని, తక్కువ వర్షపాతం పరిస్థితులపై రైతులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నామని తెలిపారు. జగిత్యాల కలెక్టర్ సత్యప్రసాద్ రైతులకు ప్రత్యామ్నాయ పంటల వైపు



మళ్లేలా చైతన్యం కల్పిస్తున్నామని చెప్పారు. పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీహర్ష కంది, నువ్వులు, వేరుశనగ, మొక్కజొన్న వంటి ఆరుతడి పంటల సాగును ప్రోత్సహిస్తున్నామని, ఆయిల్‌పామ్ సాగుపై కూడా ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని వివరించారు. ఉమ్మడి జిల్లా స్పెషల్ ఆఫీసర్, స్పెషల్ సీఎస్ మహేశ్ దత్ ఎక్కా మాట్లాడుతూ ఎల్‌నినోను ఎదుర్కొనే పోరాటానికి కరీంనగర్ నాంది కావాలని, అధికారులు క్షేత్రస్థాయిలోకి దిగి రైతులను చైతన్యపరచాలని ఆదేశించారు. వరికి బదులుగా ఆరుతడి పంటలను ప్రోత్సహిస్తూ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ప్రతి గ్రామానికి చేరవేయాలని సూచించారు.రాష్ట్ర వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి సురేంద్ర మోహన్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా గ్రామసభల ద్వారా రైతులను చైతన్యవంతం చేస్తూ, ప్రతి మంగళవారం 1,600 రైతు వేదికల్లో "రైతు నేస్తం" కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎల్‌నినో ప్రభావాన్ని తగ్గించి రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని పేర్కొన్నారు.ఈ సమావేశంలో కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, పోలీస్ కమిషనర్, వ్యవసాయ, ఇరిగేషన్, విద్యుత్, భూగర్భ జలాల శాఖ అధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, నిపుణులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# అల్ఫోర్స్ హై స్కూల్ పదో తరగతి విద్యార్థుల అద్భుత ఫలితాలు



**కరీంనగర్, జూలై 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాల సీబీఎస్ఈ విద్యార్థులు పదో తరగతి సెకండ్ బోర్డు పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించి జిల్లాస్థాయిలో అగ్రస్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా విద్యా సంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదువుకుని ఉపాధ్యాయులు బోధించిన విషయాలను సాధన చేస్తేనే అగ్రగాములుగా నిలుస్తారని పేర్కొన్నారు. అల్ఫోర్స్ విద్యా సంస్థలు ప్రారంభం నుండి అత్యుత్తమ ఫలితాలు సాధిస్తూ విజయ పరంపరను కొనసాగిస్తున్నాయని తెలిపారు.తాజాగా ప్రకటించిన ఫలితాల్లో కె.ఓం కార్తికేయ 500 మార్కుల్లో 495 సాధించి జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచాడు. ఎం. శ్రీహిత 494, ఏ. స్వర విస్తృతి 492 మార్కులు సాధించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 495 అత్యుత్తమ స్కోరుగా నిలవడం పాఠశాల గర్వకారణమని ఆయన అన్నారు.అద్భుత ఫలితాలు సాధించిన విద్యార్థులకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. బోధనా సిబ్బంది, బోధనేతర సిబ్బంది, తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# వైభవంగా పోచమ్మ అమ్మవారి బోనాల పండుగ

**కరీంనగర్, జూలై 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నగరంలోని 39వ డివిజన్ పరిధిలో వరసిద్ధి వినాయక నగర్, వరసిద్ధి కాలనీ, పార్వతి నగర్ ప్రజలు ఎంతో భక్తిశ్రద్ధలతో శ్రీ పోచమ్మ అమ్మవారి ఆషాఢ మాస బోనాల పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో 39వ డివిజన్ బీజేపీ కార్పొరేటర్ మాసం గణేష్ ముఖ్య అతిథిగా పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలతో కలిసి బోనాల సంబరాల్లో పాలుపంచుకున్న ఆయన మాట్లాడుతూ ఆషాఢ మాస బోనాలు మన సంస్కృతికి ప్రతిరూపమని, పోచమ్మ అమ్మవారి ఆశీస్సులు డివిజన్ ప్రజలతో పాటు నగర ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించారు.



# రైతు బిడ్డకు దక్కిన గౌరవం

**– ఎలిగేడు మండల పిఎసిఎస్ చైర్మన్‌గా సామా రాజేశ్వర్ రెడ్డి**

**ఎలిగేడు, జూలై 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నిస్వార్థ సేవ, అకుంఠిత దీక్షతో ప్రజల పక్షాన నిలిచిన రైతు బిడ్డకు నేడు సముచిత గౌరవం లభించింది. ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల చైర్మన్ పదవుల్లో, ఎలిగేడు మండల పిఎసిఎస్ చైర్మన్‌గా లాలపల్లె గ్రామానికి చెందిన సామా రాజేశ్వర్ రెడ్డి నియమితులయ్యారు.ఆయన నియామకం పట్ల మండల పరిధిలోని గ్రామాల్లో రైతులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మృదుస్వభావి, నిస్వార్థపరుడైన ఆయన ఏనాడు పదవులు ఆశించలేదు. రాజకీయ అధికార పదవిలో లేకున్నా, రైతులకు, ప్రజలకు ఎదురైన సమస్యలను తానే ముందుండి పరిష్కరించిన సందర్భాలు అనేకం ఉన్నాయి.ముగ్గురు పిల్లల నిబంధన కారణంగా ఎన్నికల్లో పోటీ చేయలేకపోయినా, ఆయన నిరుత్సాహపడకుండా ప్రజాసేవలో తనదైన శైలిలో ముందుకు సాగారు. లాలపల్లె గ్రామంలో సర్పంచ్ ఎన్నికలు జరిగినప్పుడల్లా ఆయన మద్దతు తెలిపిన అభ్యర్థి గెలుపే లక్ష్యంగా వ్యూహాలు రచించి ప్రత్యర్థులను ఓటమి వైపు నడిపించారు.స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చింతకుంట



సామ రాజేశ్వర్ రెడ్డిని సన్మానిస్తున్న ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే విజయ రమణారావు

సుదీర్ఘకాలం ఎలాంటి అధికారిక పదవిలో లేకుండా ప్రజలకు సేవ చేస్తూ, అందరినీ కలుపుకొని ముందుకు నడిపిన నాయకుడిగా మంచి పేరును సంపాదించారు.రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబంలో పుట్టిన ఆయన భవిష్యత్తులో మరిన్ని పదవులను అధిరోహించి ప్రజలకు మరింత సేవలు అందించాలని మండల ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.



సామ రాజేశ్వర్ రెడ్డి

# బహుజనులంతా సంఘటితం కావాలి

**– తగరం శంకర్ లాల్**



**పెద్దపల్లి, జూలై 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణలోని బహుజన వర్గాలంతా సంఘటితం కావాలని బహుజన సేన రాష్ట్ర ఉపాధ్యక్షుడు తగరం శంకర్ లాల్ పిలుపునిచ్చారు. పెద్దపల్లి ప్రెస్ క్లబ్‌లో ఆదివారం మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడుతూ 1902లోనే ఛత్రపతి సాహు మహారాజ్ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు 50 శాతం రిజర్వేషన్లు అమలు చేశారని గుర్తు చేశారు.నేటి పాలకులు 80 శాతం పైగా ఉన్న బహుజన వర్గాలకు రిజర్వేషన్లు సరిగా అందకుండా వారిని దేశ సంపదకు దూరం చేస్తున్నారని ఆయన విమర్శించారు. ఛత్రపతి సాహు మహారాజ్, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ స్ఫూర్తితో అణగారిన వర్గాలకు న్యాయం జరిగేలా ఉద్యమానికి మద్దతుగా నిలవాలని ప్రజలను కోరారు.ఈనెల 26న హైదారాబాద్ బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బహుజన సేన ఆధ్వర్యంలో సాహు మహారాజ్ జయంతి సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజాస్వామిక వాదులు, బహుజన సంఘాల నాయకులు, యువకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా సదస్సు కరపత్రాలను ఆవిష్కరించారు. సమావేశంలో వివిధ సంఘాల నాయకులు నోమూరి శ్రీధర్, నూనె కుమార్, ఆసం తిరుపతి, కట్కూరి సందీప్, గద్దల శంకర్, సంకెనపల్లి లక్ష్మణ్, బి. లక్ష్మణ్, లింగంపల్లి శంకర్, రాగమల్ల మధుకర్, దొడ్ల రమేష్, కోల శ్రీనివాస్, నల్లవెల్లి శంకర్, కంకటి లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియకు ప్రజల సహకారం అవసరం

**– మాజీ కౌన్సిలర్ దేవిడి గీత వేణుగోపాల్ రెడ్డి**

**ఇబ్రహీంపట్నం, జూలై 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమానికి ప్రజలంతా పూర్తి స్థాయిలో సహకరించాలని పెద్ద అంబర్పేట్ మున్సిపల్ మాజీ కౌన్సిలర్ దేవిడి గీత వేణుగోపాల్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.ఆదివారం ఒక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, "ఎస్ఐఆర్ ప్రక్రియ విజయవంతంగా అమలు కావాలంటే క్షేత్రస్థాయి ప్రయత్నాలు మరింత ముమ్మరం కావాలి. బీఎల్వోలు ప్రతి ఇంటిని సందర్శించి, ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా నమోదు చేయాలి. అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా చూడాలి. అనర్హుల పేర్లు తొలగించే సమయంలో ఎన్నికల



సంఘం నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి" అని సూచించారు.ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటు హక్కే పునాది అని, ప్రతి ఓటు విలువైనదని ఆయన పేర్కొన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ తమ పేరు ఓటరు జాబితాలో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. బీఎల్వోలు పంపిణీ చేసే ఎన్యూమరేషన్ ఫారాలను సక్రమంగా పూరించి తిరిగి అందజేయాలని ఓటర్లను కోరారు.అదే సమయంలో "ఎస్ఐఆర్ పేరుతో సైబర్ నేరగాళ్లు మోసాలు చేస్తున్నారని ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ ఓటీపీలు లేదా బ్యాంకింగ్ వివరాలను పంచుకోవద్దు" అని హెచ్చరిం చారు. ప్రజాస్వామ్య బలోపేతానికి ప్రతి ఓటరు బాధ్యతగా వ్యవహరించాలని, కేంద్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులోగా ఎస్ఐఆర్ ప్రక్రియలో విధిగా పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

# 108 సిబ్బంది సేవలకు గ్రామస్తుల ప్రశంసలు

**రాజన్న సిరిసిల్ల, జూలై 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** గంభీరావుపేట మండలం భీముని మల్లారెడ్డిపేట గ్రామానికి చెందిన లక్ష్మీ నరసవ్వ (60) వరి నాట్లు వేస్తున్న సమయంలో పొలం గట్టు పై నుంచి జారి పడడంతో కాలుకు తీవ్ర గాయమై ఫ్రాక్చర్ అయింది. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని రహదారి సౌకర్యం లేకపోవడంతో స్కూప్ స్ట్రెచర్ సహాయంతో బాధితురాలిని పొలం గట్లపై నుంచి అర కిలోమీటర్ మేర మోసుకెళ్లి అంబులెన్స్ వద్దకు తీసుకువచ్చారు.తరువాత ప్రథమ చికిత్స అందించి సురక్షితంగా సిద్ధిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. క్లిష్ట పరిస్థితుల్లోనూ సమయానికి స్పందించి అంకితభావంతో సేవలందించిన 108 సిబ్బందిని గ్రామస్తులు అభినందించారు. ప్రజల ప్రాణాలను కాపాడటంలో 108 అత్యవసర అంబులెన్స్ సేవలు ఎల్లప్పుడూ ముందుంటాయని వారు పేర్కొన్నారు.



# నేర ప్రవృత్తికి స్వస్తి పలికితేనే గౌరవం

**– నంద్యాల ఎస్పీ సునీల్ షోరాణ్**

**నందికొట్కూరు, జూలై 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** సమాజంలో ప్రతి పౌరుడు నేర ప్రవృత్తికి స్వస్తి పలికి మానవతా భావంతో మెలిగి ప్రశాంతమైన వాతావరణంలో కుటుంబ జీవితం గడిపినప్పుడే గౌరవం లభిస్తుందని నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్, ఐపీఎస్ పేర్కొన్నారు.జిల్లాలో నేర నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ఆయన ఆదేశాల మేరకు నందికొట్కూరు పట్టణ సీఐ అశోక్ కుమార్ ఆధ్వర్యంలో ఎస్సై చంద్రశేఖర్,



పార్లమెంట్ సీఐ ఆధ్వర్యంలో గడివేముల ఎస్సై నాగార్జున రెడ్డి కౌన్సెలింగ్ కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా పోలీసు అధికారులు తమ పరిధిలో నివసిస్తున్న రౌడీషీటర్లు, నేరచరిత్ర గలవారు, చెడు నడత కలిగిన వ్యక్తులకు సత్ప్రవర్తనతో జీవించాలని, నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు.అనంతరం వారి జీవనోపాధి, ప్రస్తుతం వారు చేస్తున్న వృత్తులపై ఆరా తీశారు. "మీపై నిరంతరం నిఘా ఉంటుంది. పోలీసుల మాటలను వినకుండా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే పీడీ యాక్ట్, బైండోవర్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటాం" అని అధికారులు హెచ్చరించారు.

# అల్ఫోర్స్ ఎక్సెల్ క్యాంపస్లో నయా దౌర్ వేడుకలు



**కరీంనగర్, జూలై 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఎక్సెల్ బాలుర రెసిడెన్షియల్ కళాశాలలో "నయా దౌర్" పేరుతో ఫ్రెషర్స్ పార్టీ సాంస్కృతిక వేడుకలు అట్టహాసంగా జరిగాయి.విద్యా సంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై సరస్వతి మాత విగ్రహానికి పూజ చేసి జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులు లక్ష్యాలను ఏర్పరుచుకుని కష్టపడి చదువుకుంటే సమాజంలో అగ్రస్థానంలో నిలవగలరని ఆయన సూచించారు. అల్ఫోర్స్ విద్యాసంస్థలు ప్రారంభం నుండి ప్రతిభ ఆధారిత విద్యను అందిస్తూ అగ్రస్థానంలో నిలుస్తున్నాయని, 2025--26 విద్యా సంవత్సరంలో కూడా అత్యుత్తమ ఫలితాలు సాధించాయని తెలిపారు.వేడుకల్లో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు ఆకట్టుకున్నాయి. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అధికారుల సమర్ధవంతమైన సేవలతో ప్రజలకు న్యాయం

**నంద్యాల, జూలై 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లా ప్రజల సమస్యలను సత్వరంగా పరిష్కరించి, ప్రభుత్వ సేవలను మరింత సమర్థవంతంగా అందించాలనే లక్ష్యంతో ఈ నెల 20వ తేదీ (సోమవారం) "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ కార్యక్రమం జిల్లా కలెక్టరేట్‌తో పాటు అన్ని రెవెన్యూ డివిజన్ కార్యాలయాలు, మండల పరిషత్ కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాల్లో ఒకేసారి నిర్వహించబడనుంది. ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం వరకు ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన వినతిపత్రాలను నేరుగా అధికారులకు సమర్పించవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు.
అలాగే అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో ఫిర్యాదులు



నమోదు చేసుకునే అవకాశం కల్పించబడిందని, సమర్పించిన అర్జీల పరిష్కార స్థితిని అదే వెబ్‌సైట్‌లో లేదా టోల్ ఫ్రీ నంబర్ 1100 ద్వారా తెలుసుకోవచ్చని తెలిపారు.అర్జీదారులు ముందుగా మండల, డివిజన్ లేదా మున్సిపల్ స్థాయి కార్యాలయాల్లో వినతులు సమర్పించి, అక్కడ పరిష్కారం కాని అంశాలను మాత్రమే జిల్లా స్థాయి వేదికకు తీసుకురావాలని సూచించారు.జిల్లా కేంద్రంలో ఉదయం
9:30 గంటలకు ప్రారం భమయ్యే ఈ కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా స్థాయి అధికా రులు తప్పనిసరిగా హాజరై ప్రజల వినతులను స్వీకరించి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్
ఆదేశించారు.

నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక
సోమవారం,
జూలై 20, 2026



## జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బాధ్యతలను స్వీకరించిన జువ్వాడి అమరేందర్ రావు



**కరీంనగర్, జూలై 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా జువ్వాడి అమరేందర్ రావు నియమితులయ్యారు. ఈ సందర్భంగా చొప్పదండి ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు డాక్టర్ మెడికల్ సత్యం నియామక పత్రాన్ని అందజేశారు. పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేయాలని, ప్రజా సమస్యలపై క్షేత్రస్థాయిలో పోరాడాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి చేరవేయాలని ఆయన సూచించారు. పార్టీ సిద్ధాంతాలను బలంగా ముందుకు తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషించాలని ఆదేశించారు. నియామకం పట్ల స్పందించిన అమరేందర్ రావు పార్టీ నాయకత్వం తనపై ఉంచిన నమ్మకానికి కృతజ్ఞతలు తెలుపుతూ, విధేయతతో పనిచేస్తానని, గ్రామస్థాయి నుండి కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బైరిశెట్టి సంపత్, వెల్మ కృష్ణ రెడ్డి, రాజా నరసింగా రావు, కోల ప్రభాకర్, కర్ర కార్తీక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జువ్వాడి చొక్కారావు జయంతి వేడుకలు



**కరీంనగర్, జూలై 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** దివంగత మాజీ మంత్రి, మాజీ పార్లమెంట్ సభ్యుడు జువ్వాడి చొక్కారావు జయంతి సందర్భంగా నగరంలో కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఐటి మరియు పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు, కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్, సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలు పాల్గొన్నారు. చొక్కారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఆయన రాజకీయాల్లో పారదర్శకత, నిజాయితీకి మారు పేరు అని, వారి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప్పుల అంజని ప్రసాద్, తాజ్ ఆకారపు భాస్కర్ రెడ్డి, మల్లికార్జున, రాజేందర్, మడుపు మోహన్, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, పడిశెట్టి భూమయ్య, బోనాల శ్రీనివాస్, నిహాల్ అహ్మద్, వంగల విద్యాసాగర్, కామ్రెడ్డి రాంరెడ్డి, మాదాసు శ్రీనివాస్, కంకణాల అనిల్ కుమార్, కుంభాల రాజు కుమార్, తోట అంజయ్య, కొట్టే ప్రభాకర్, పెద్ది తిరుపతి, సాయిని తిరుపతి, షబాన మహమ్మద్ ఖలీల్, నాగుల సతీష్, ముక్క భాస్కర్, స్వప్న శ్రీ, బసవరాజ్, శంకర్, పెంట శేఖర్, రాచర్ల పద్మ, కుర్ర పోచయ్య, నెల్లి నరేష్, గుండారపు శ్రీనివాస్, వీర దేవేందర్, మార్కరాజు, బత్తిని చంద్రయ్య, సుంకరి గణపతి తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ప్రధాన కార్యదర్శి బాధ్యతలను స్వీకరించిన శ్యాంసుందర్ గౌడ్



**హుస్నాబాద్, జూలై 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** గౌడ జన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ సిద్ధిపేట జిల్లా ప్రధాన కార్యదర్శిగా హుస్నాబాద్ మండలం పొట్లపల్లి గ్రామానికి చెందిన పాకాల శ్యాంసుందర్ గౌడ్ నియమితులయ్యారు. జిల్లా, మండల, గ్రామ కమిటీల పునర్వ్యవస్థీకరణలో భాగంగా రాష్ట్ర కమిటీ ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర నాయకత్వం మాట్లాడుతూ గౌడ గీత కార్మికుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం సంస్థ చేపడుతున్న ఉద్యమాలను జిల్లాలో మరింత బలోపేతం చేయడంలో శ్యాంసుందర్ గౌడ్ కీలక పాత్ర పోషిస్తారని ఆశాభావం వ్యక్తం చేసింది. నియామకంపై స్పందించిన శ్యాంసుందర్ గౌడ్ తనపై ఉంచిన విశ్వాసానికి రాష్ట్ర అధ్యక్షుడు అమరవేణి నర్స గౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగుల సిద్ది రాములు గౌడ్‌తో పాటు నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. గౌడ గీత కార్మికుల సమస్యల పరిష్కారం, హక్కుల పరిరక్షణ, సంక్షేమ కార్య క్రమాల అమలుకు అంకితభావంతో పనిచే స్తానని, జిల్లాలో సంస్థను మరింత బలోపేతం చేసి రాష్ట్ర కమిటీ ఆశయాల సాధనకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

## ఓటరు జాబితా సవరణ ఎస్ఐఆర్ అంశంపై ఎంపీజే సమావేశం



**ఖానాపూర్, జూలై 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** న్యాయ, సామాజిక సేవలతో పాటు ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ఎస్ఐఆర్ అంశంపై ఆదివారం మూవ్‌మెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ (ఎంపీజే) ఖానాపూర్ యూనిట్ ఆధ్వర్యంలో స్థానిక ముహమ్మదియా మసీదులో సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఎంపీజే రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ మజీద్ షోయబ్ ముఖ్య అతిథిగా హాజరై, న్యాయ, సామాజిక సేవల ద్వారా నిరుపేదలకు సహాయం అందించడమే సంస్థ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై విస్తృతంగా చర్చించి, ప్రజలకు అవసరమైన న్యాయపరమైన సూచనలు, సహాయం అందిస్తామని చెప్పారు. ఎంపీజే ప్రజా సంక్షేమ ఉద్యమమని, రాష్ట్ర విభాగం గత ఆరు నెలలుగా వివిధ జిల్లాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తోందని ఆయన పేర్కొన్నారు. ప్రజలు తమ హక్కులు, విధానాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీజే ఖానాపూర్ ఉపాధ్యక్షుడు అబ్దుల్ వాసే ఖాన్, సభ్యులు అబ్దుల్ ఘనీ, షేక్ నయీమ్, అతీక్ ఉద్దీన్ ఫైజ్, షాహిద్ అలీ, అబ్దుల్ రహీమ్ తదితరులు పాల్గొన్నారు. నిర్వాహకులు ప్రజలకు అవసరమైన న్యాయ, సామాజిక సహాయాన్ని సమన్వయంతో అందిస్తూ సమస్యల పరిష్కారానికి ఎంపీజే నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు.

## అంగరంగ వైభవంగా ముత్యాల పోచమ్మ బోనాలు



**ఖానాపూర్, జూలై 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఖానాపూర్ మండల కేంద్రంలోని ఊరి పోచమ్మ ముత్యాల పోచమ్మ బోనాలు బెస్త సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రతి కుటుంబం నుండి మహిళలు బోనాలు తీసుకుని గ్రామంలోని ప్రధాన వీధుల్లో ఊరేగింపుగా వెళ్లి ఆలయంలో సమర్పించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు గంగాధర్ మాట్లాడుతూ వర్షాలు సకాలంలో కురవాలని, పాడిపంటలు బాగుండాలని, ప్రజలకు అధిక దిగుబడులు రావాలని మొక్కుకున్నట్టు తెలిపారు. అనంతరం సంఘ సభ్యులు అమ్మవారికి కట్నకానుకలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

## టిజెఎ 12వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని జర్నలిస్టుల సేవా కార్యక్రమం



**హుస్నాబాద్, జూలై 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ జర్నలిస్టు అసోసియేషన్ (టిజెఎ) 12వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని హుస్నాబాద్ ప్రభుత్వ 50 పడకల ఆసపత్రిలో ఆదివారం రోగులకు, బాలింతలకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. జర్నలిస్టులు మాట్లాడుతూ సమాజానికి నిరంతరం సేవలందించే పాత్రికేయులు సామాజిక బాధ్యతలో భాగంగా ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. రోగులు త్వరగా ఆరోగ్యం పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రాణహిత పత్రిక ఎడిటర్ కె. సత్యనారాయణ, నీ మేలుకొలుపు పత్రిక ఎడిటర్ బి. లింగమూర్తి, సిద్దిపేట జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సభ్యుడు వంగ రాజు, సీనియర్ జర్నలిస్టులు ఎస్. ఆంజనేయులు, వి. ప్రశాంత్, జి. శ్రీనివాస్, ఎం. మనోజ్, భరత్ ఎస్. శంకర్, హాస్పిటల్ ఇంచార్జ్ రమేష్ రెడ్డి, డ్యూటీ డాక్టర్ శివ మరియుసిబ్బంది పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే విజయరమణరావును మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపిన సింగిల్ విండో నూతన పాలకవర్గం



**సుల్తానాబాద్, జూలై 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** సుల్తానాబాద్ మండలం చిన్నకల్వల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (సింగిల్ విండో) నూతన చైర్మన్ తన పాలకవర్గ సభ్యులతో కలిసి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావును శివపల్లిలోని ఆయన నివాసంలో మర్యాదపూ ర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. సింగిల్ విండో చైర్మన్‌గా అవకాశం కల్పించి సహకరించినందుకు ఎమ్మెల్యేకు పాలకవర్గ సభ్యుల తరపున కృతజ్ఞతలు తెలిపారు. సంఘ అభివృద్ధికి కృషి చేస్తూ రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు కట్టుబడి ఉంటామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాశ్‌రావు, కనుకుల సింగిల్ విండో చైర్మన్ చిలుక సతీష్, సీఈవో రమేష్, సర్పంచ్ రమేష్, పాలకవర్గ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

## దుర్గాభవానీ అమ్మవారికి వంకాయ మాలల అలంకరణ



**కరీంనగర్ రూరల్, జూలై 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ నగునూర్‌లోని శ్రీదుర్గాభవానీ ఆలయంలో ఆషాడమాసం శాకంబరీ ఉత్సవాల భాగంగా ఐదో రోజు అమ్మవారిని వంకాయ మాలలతో అలంకరించారు. ఆలయ ప్రధానార్చకుడు పవనకృష్ణ శర్మ విశేష హారతులు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ తిరుమల సేవా ట్రస్ట్ అధ్యక్షురాలు అటికేటి సుప్రియ ఆధ్వర్యంలో తీగలగుట్టపల్లి నుండి డప్పు చప్పుళ్లతో, డిజే సౌండ్‌తో కొలాటాలు ఆడుతూ మహిళలు శోభాయాత్రగా చీరే, సారేలను తీసుకొచ్చి అమ్మవారికి సమర్పిం చారు. ఈ పూజల్లో ఆలయ ఫౌండర్ చైర్మన్ వంగల లక్ష్మన్, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శిం చుకున్నారు.

## మానసిక దృఢత్వాన్ని పెంచే క్రీడ చెస్




**- ఎమ్మెల్యే గంగుల కమలాకర్**

**కరీంనగర్, జూలై 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జీనియస్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన 4వ జాతీయ జూనియర్ చెస్ పోటీలు కరీంనగర్‌లో ఘనంగా ముగిశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్ విజేతలకు ట్రోఫీలు, నగదు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సెల్‌ఫోన్లకు బానిసలు కాకుండా మేధోశక్తి, మానసిక దృఢత్వాన్ని పెంచే చెస్ వంటి క్రీడల వైపు తల్లిదండ్రులు ప్రోత్సహించడం అభినందనీయ మని అన్నారు. చెస్ ఆటకు, జీవిత గమనానికి అవినాభావ సంబంధం ఉందని, చదరంగంలో ఒక తప్పు కదలిక ఆటను ఓడిపోవడానికి దారితీసినట్లే జీవితంలో ఒక తప్పు నిర్ణయం భవిష్యత్తును ప్రభావితం చేస్తుందని విద్యార్థులకు హితవు పలికారు. కార్యక్రమంలో మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్, బీఆర్ఎస్ నాయకులు మైకేల్ శ్రీనివాస్, చెస్ అకాడమీ నిర్వాహ కులు అనూప్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పోటీల నిర్వహణకు సహకరించిన స్పాన్సర్లను నిర్వాహకులు సన్మానించారు.

## యాంటీ డ్రగ్స్ పై అవగాహన కల్పించేందుకు క్రికెట్ టోర్నమెంట్ నిర్వహణ



**పెద్దపల్లి, జూలై 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** హనుమంతునిపేట గ్రామంలో యాంటీ డ్రగ్స్ పై అవగాహన కల్పించేందుకు హెచ్చిఎల్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఆరు గ్రామాల యువకులు పాల్గొన్న ఈ పోటీల్లో ఐదు జట్లు పోటీపడ్డాయి. ఫైనల్ మ్యాచ్‌లో వాసు రైజర్స్, నరేష్ వారియర్స్ జట్లు తలపడ్డాయి. నరేష్ వారియర్స్ విజయం సాధించగా, మొదటి బహుమతిగా రూ.20 వేల నగదు కొలిపాక సంపత్ అందజేశారు. రెండో బహుమతిగా రూ.10 వేల నగదు మేకల కుమార్ అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పెద్దపల్లి రూరల్ ఎస్ఐ మధుకర్, ఎస్ఐ శ్వేత, ఉపసర్పంచ్ మేకల కుమార్, కాంగ్రెస్ నాయకులు తిరుపతిరావు, కంది సదానందం, గుర్రాల వాసు, కాంపెల్లి సాగర్, చలిగంటి శ్రీనివాస్, తీగల సతీష్, ఆరెపల్లి రఘు, పడాల దీప్చంద్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా కట్టమైసమ్మ బోనాల జాతర



**కరీంనగర్, జూలై 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కట్టరాంపూర్‌లోని లేక్ పోలీస్ స్టేషన్ సమీపంలో ఎల్ఎండీ జలవిహార్ స్విమ్మర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కట్టమైసమ్మ బోనాల జాతర భక్తిశ్రద్ధల నడుమ ఘనంగా జరిగింది. ఎల్లమ్మ ఆలయం నుంచి శివసత్తుల పూనకాలతో డప్పు చప్పుళ్ల మధ్య భక్తులు భారీ ర్యాలీగా కట్టమైసమ్మ ఆలయానికి చేరుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కరీంనగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న బోనం ఎత్తుకొని జలవిహార్ స్విమ్మర్స్ అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి అమ్మవారిని ప్రార్థించారు. రాష్ట్రంలో సకాల ంలో వర్షాలు కురిసి రైతులు, ప్రజలు సుభిక్షంగా ఉండాలని కోరారు. జాతరలో 11వ డివిజన్ కార్పొరేటర్ నర్మదా నర్సన్న, జలవిహార్ అసోసియేషన్ అధ్యక్షుడు పాశం రాజిరెడ్డి, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కలర్ సత్తన్న, వైస్ ప్రెసిడెంట్ లక్ష్మణ్, జనరల్ సెక్రటరీ గంగ తిరుపతి పటేల్ తదితరులు పాల్గొన్నారు.

## ఆపిల్ క్లినిక్ ఉచిత ఫిజియోథెరపీ శిబిరానికి విశేష స్పందన





**హుస్నాబాద్, జూలై 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** హుస్నాబాద్ పట్టణంలోని ఆపిల్ క్లినిక్‌లో నిర్వహించిన ఉచిత ఫిజియోథెరపీ వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. దీర్ఘకాలిక వ్యాధులు, జీవనశైలిలో మార్పుల వల్ల వచ్చే నొప్పులను తగ్గించుకోవడం, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యులు అవగాహన కల్పించారు. శిబిరాన్ని మున్సిపల్ చైర్మన్ దండి లక్ష్మీ, స్ఫూర్తి స్వచ్ఛంద సంస్థ చైర్మన్ పందిళ్ల శంకర్, వైద్యులు రాజన్న, సప్త ఋషి, శ్రీనివాస్ ప్రారంభించారు. పక్షవాతం, మెడ నొప్పి, నడుము నొప్పి, మోకాళ్ల నొప్పి, ఫ్రాక్చర్ కేసులు, రుమటాయిడ్ సమస్యలు, లిగమెంట్ గాయాలు, కండరాలు, నరాలు, ఎముకలకు సంబంధించిన సమస్యలకు ఫిజియోథెరపీ సేవలు అందించారు. వైద్య సదుపాయాలు అందించిన డా. రాకేష్, డా. స్వప్నతో పాటు వారి బృందం పాల్గొన్నారు. రానున్న రోజుల్లో అవసరమైన మేరకు అవగాహన కార్యక్రమాలు, ఉచిత ఫిజియోథెరపీ శిబిరాలు ఏర్పాటు చేస్తామని నిర్వహకుడు డా. అక్కు శ్రీనివాస్ తెలిపారు.

## తాగునీటి భద్రత, రైతు నష్టపరిహారంపై మేయర్,డిప్యూటీ మేయర్ వినతి



**కరీంనగర్, జూలై 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఎల్-నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులపై కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో రాష్ట్ర వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జిల్లా సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, కరీంనగర్ డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు పాల్గొని పలు కీలక అంశాలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు. ఎల్ఎమ్‌డీ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 5.5 టీఎంసీల నీరు మాత్రమే ఉందని, అందులో డెడ్ స్టోరేజ్ పోను కేవలం 2 టీఎంసీలు అందుబాటులో ఉన్నాయని ఆయన తెలిపారు. జూన్ వరకు వర్షాలు కురిసే అవకాశం లేకపోవడంతో కరీంనగర్ నగరంలోని లక్ష గృహాలకు, మిషన్ భగీరథ కింద ఇతర ప్రాంతాలకు ఏడాది పాటు తాగునీటి ఇబ్బందులు రాకుండా చూడాలని కోరారు. నీటి ఎద్దడి నివారణకు ఎస్ఆర్ఎస్‌పీ నుంచి కాకతీయ కెనాల్ ద్వారా 2 టీఎంసీల నీటిని తక్షణమే ఎల్ఎమ్‌డీకి తరలించాలని డిమాండ్ చేశారు. అలాగే వర్షాభావం కారణంగా పంట వేయలేని, పంట వేసి నష్టపోయిన రైతులకు ఎకరాకు ?10 వేల చొప్పున తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు.

## లక్క పురుగుల నివారణ చర్యలు, అమృత్ పైప్‌లైన్ పనులు వేగవంతం



**సుల్తానాబాద్, జూలై 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** సుల్తానాబాద్ మున్సిపాలిటీ 7వ వార్డు గొల్లపల్లి ప్రాంతంలో లక్క పురుగుల బెడద, రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ లోడ్ సమస్యలను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు దృష్టికి మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ తీసుకెళ్లారు. గోదాముల యాజమాన్యంతో మాట్లాడి లక్క పురుగుల నివారణకు తక్షణ చర్యలు చేపట్టాలని కోరగా అధికారులు సమస్య పరిష్కారానికి హామీ ఇచ్చారు. రైతుల విద్యుత్ లోడ్ సమస్యలను కూడా త్వరితగతిన పరిష్కరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా మున్సిపాలిటీ 4వ వార్డులో అమృత్ మంచినీటి పైప్‌లైన్ పనులను పరిశీలించిన చైర్మన్ బిరుదు రాధాకృష్ణ, కాంట్రాక్టర్‌తో మాట్లాడి పనులను ఆలస్యం చేయకుండా వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజలకు తాగునీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా నిర్ణీత గడువులో పనులు పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో 7వ వార్డు కౌన్సిలర్ ఉట్ల వరప్రదీప్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## రేణుక ఎల్లమ్మ దర్శనం చేసుకున్న బుర్ర ఆంజనేయులు



**ఎలిగేడు, జూలై 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ మీడియా అడ్వైజర్ కమిటీ సభ్యుడు బుర్ర ఆంజనేయులు గౌడ్ ఆదివారం ఎలిగేడు మండల కేంద్రంలోని శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయాన్ని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆయన మాట్లాడుతూ, "అమ్మవారి దయతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి. సకాలంలో వర్షాలు సమృద్ధిగా కురిసి రైతులు, ప్రజలు పాడిపంటలతో ఆనందంగా జీవించాలి" అని ప్రార్థించారు.

# ఘనంగా బిసి జేఏసీ చైర్మన్ దాసరి ఉష జన్మదిన వేడుకలు



**పెద్దపల్లి, జూలై 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పెద్దపల్లి పట్టణంలోని శాంతినగరలో బిసి జేఏసీ చైర్మన్ దాసరి ఉష జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేసి సుమారు 30 మంది యువకులు రక్తదానంలో పాల్గొన్నారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు.దాసరి ఉష మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని, పంటలు ఎండిపోతున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం కాళేశ్వరం బాహుబలి మోటర్ల ద్వారా కన్నెపల్లి పంప్ హౌస్ నుండి ఎల్లంపల్లి, మిడ్ మానేరు, లోయర్ మానేరు జలాశయాలను నింపి కాలువల ద్వారా సాగునీటిని అందించాలని కోరారు. మేము మా జన్మదిన సందర్భంగా యువకులు రక్తదానం చేశారు, ఇకనైనా ప్రభుత్వం నీటిని అందించి రైతులను ఆదుకోవాలి అని విజ్ఞప్తి చేశారు.ఈ వేడుకలో కార్యకర్తలు, అభిమానులు, బంధుమిత్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆరుట్లలో సిసి రోడ్డు పనులను పరిశీలించిన కాంగ్రెస్ నాయకులు



**ఇబ్రహింపట్నం, జూలై 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ప్రారంభానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వచ్చిన సందర్భంగా ప్రత్యేక నిధుల ద్వారా ఇబ్రహింపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సహకారంతో మంజూరైన నిధులతో జరుగుతున్న సిసి రోడ్డు పనులను ఆరుట్ల కాంగ్రెస్ పార్టీ నాయకులు పరిశీలించారు.గ్రామ ప్రధాన కార్యదర్శి చిందం శ్రీశైలం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఇబ్రహింపట్నం మార్కెట్ కమిటీ డైరెక్టర్ సాతిరి ఎల్లేష్, మాజీ ఎంపిటిసి లాలగారి శ్రీకాంత్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు మార సురేష్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు బుట్టి కృష్ణ, కంబాలపల్లి బుగ్గరాములు, కోరె బాబు, కాంగ్రెస్ నాయకులు లచ్చగారి జంగారెడ్డి, పంబాల కిషోర్, ఎండి అశ్రఫ్, ఆర్ల బీరుమల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# వాసవి క్లబ్ ఆధ్వర్యంలో పేద విద్యార్థికి ఆర్థిక సహాయం




**నాగర్‌కర్నూల్, జూలై 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**వాసవి క్లబ్ నాగర్‌కర్నూల్ ఆధ్వర్యంలో జోన్ చైర్మన్ సాయి కృష్ణ గారి విజిట్ సందర్భంగా పేద వైశ్య విద్యార్థి సాయి లక్ష్మికి ఇంటర్ చదువుకోడానికి రూ.35,000 ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఇప్పటివరకు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించామని, రాబోయే రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలకు ప్రోత్సాహం అందిస్తామని తెలిపారు.ఆర్థిక సహకారం అందించిన దాతలు ఇరువెంటి ధర్మయ్య, ఇరువెంటి స్వామి, చెరుకు యాదయ్య, వాస రాఘవేందర్, కందూరి లక్ష్మణ స్వామి, సంబు శ్రీనివాసులు, గార్లపాటి విజయ్ కుమార్, బిజెపి టౌన్ అధ్యక్షుడు చెవ్వ ప్రమోద్ కుమార్. ఈ కార్యక్రమంలో కొౖట బాలాజీ, ఆకుతోట మధుమోహన్, చిగుళ్లపల్లి రమణ, రవి ప్రకాష్, కందూరి బాలరాజు, బీసం రాఘవేందర్, రఘు, వాస లక్ష్మి, కందూరి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. అనంతరం సన్మాన కార్యక్రమం కూడా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ అధ్యక్షుడు సంబు శ్రీనివాసులు, కార్యదర్శి పాండు, కోశాధికారి నాగరాజు పాల్గొన్నారు.

# మల్కిజ్‌గూడ భజన మండలి కళాబృందానికి ఘన సన్మానం



**ఇబ్రహింపట్నం, జూలై 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**యాచారం మండలం మల్కిజ్‌గూడ హనుమాన్ దేవాలయం భజన బృంద సభ్యులను గ్రామ సర్పంచ్ దేరం గుల శంకర్, ఉపసర్పంచ్ రెడ్డమోని శిరీష వెంకటేష్ యాదవ్ ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, "భగవన్నామ స్మరణతో సమాజంలో భక్తి భావాన్ని పెంపొందిస్తున్న మల్కిజ్‌గూడ భజన మండలి సభ్యులు నిజంగా అభినందనీయులు. గోల్కొండ బోనాల సందర్భంగా భక్తులను భజన పాటలతో మైమరిపించారు. తమ పనులను పక్కన పెట్టి, అంచెలంచెలుగా ఎదుగుతూ హిందూ సంస్కృతి, సంప్రదాయాలను పాటిస్తూ గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు మల్కిజ్‌గూడకు మంచి పేరు తీసుకువచ్చారు" అని పేర్కొన్నారు.కళలను, కళాకారులను ప్రోత్సహించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని వారు స్పష్టం చేశారు. భజన కళాబృందానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, భక్తులు బోడ అబ్బయ్య, ఆలూరు మల్లయ్య, మలిగ యాదయ్య, గుండెల్ని రామకృష్ణ, తే రోజు జంగా చారి, పల్లపు దర్శన్, వరిపుకుప్పల జంగయ్య, దేరంగుల యాదయ్య, వరిపుకుప్పల సత్యనారాయణ, గడల అంజయ్య, నానికపేట పరమేశ తదితరులు పాల్గొన్నారు.

# నా రాజకీయ గాడ్‌ఫాదర్ మండ్రా ఎమ్మెల్యే గిత్త



**నందికొట్కూరు, జూలై 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**నంద్యాల జిల్లా పార్లమెంట్ ఇన్‌చార్జి మాండ్రా శివానందరెడ్డి జన్మదిన వేడుకలు ఆదివారం అల్లూరు గ్రామంలోని ఆయన నివాసంలో ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య ఆధ్వర్యం వహించారు. కార్యక్రమంలో మాండ్రా శివానందరెడ్డి దంపతుల సమక్షంలో కేక్ కటింగ్ జరిగింది. అనంతరం ఎమ్మెల్యే గిత్త జయసూర్య, నియోజకవర్గ టిడిపి శ్రేణులతో కలిసి తమ రాజకీయ గాడ్‌ఫాదర్ శివానందరెడ్డికి పుష్ప గుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకలో నందికొట్కూరు, మిడు తూరు, జూపాడు బంగ్లా, పాము లపాడు, కొత్తపల్లి, పగిడ్యాల మండలాలకు చెందిన పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొని తమ నాయకుడు మాండ్రాకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

# మహబూబాబాద్ అర్చకులకు రాష్ట్ర కమిటీలో కీలక పదవులు



**మహబూబాబాద్, జూలై 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**ధూపదీప నైవేద్య అర్చక సంఘం (తెలంగాణ రాష్ట్రం) విస్తరణలో భాగంగా మహబూబాబాద్ జిల్లాకు చెందిన పలువురు అర్చకులకు రాష్ట్ర కమిటీలో కీలక బాధ్యతలు లభించాయి.అనంతాద్రి దేవాలయ ప్రధాన అర్చకులు గొడవర్తి చక్రధరాచార్యులు రాష్ట్ర కన్వీనర్‌గా నియమితులయ్యారు. అలాగే లింగోజు వేంకటేశ్వరాచార్యులు రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, కె. వేణుగోపాలాచార్యులు, మట్టపల్లి విజయ్ కుమార్ ఆచార్యులు, పోలంపల్లి రమణ శర్మ సహాయ కార్యదర్శులుగా నియమి తులయ్యారు. హరిదాస్యం సుదర్శన ఆచార్యులు, విస్సంపల్లి సాయి చారి రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా స్థానం పొందారు.ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన నాయకులు మాట్లాడుతూ, "అర్చకుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ, దేవాలయ సేవల అభివృద్ధి కోసం రాష్ట్రవ్యాప్తంగా కృషి చేస్తాం" అని తెలిపారు.రాష్ట్ర కమిటీలో అవకాశం కల్పించిన సంఘం రాష్ట్ర అధ్యక్షులు దౌల్తాబాద్ వాసుదేవ శర్మ, ప్రధాన కార్యదర్శి అమరేశ్వర్ శర్మ, కోశాధికారి హరి కిషన్ శర్మలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# తూర్పు ప్రాతకోటలో కార్డన్ అండ్ సెర్చ్



**నందికొట్కూరు, జూలై 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్, ఐపీఎస్ ఆదేశాల మేరకు, ఆత్మకూరు డీఎస్పీ ఆర్.ఆర్. నాయక్, రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం సూచనలతో ముచ్చుమర్రి పోలీస్ స్టేషన్ ఎస్సై నరేంద్ర ఆధ్వర్యంలో తూర్పు ప్రాతకోట గ్రామంలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు.ఈ తనిఖీల్లో గ్రామానికి చెందిన శ్రీనివాసులు వద్ద నుంచి 20 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. అనంతరం గ్రామ ప్రజలతో సమావేశం నిర్వహించి సైబర్ నేరాల నివారణ, బాల్య వివాహాల నిరోధం, శక్తి యాప్ వినియోగం, రోడ్డు భద్రత, హెల్మెట్ ధరించడం ప్రాముఖ్యత వంటి అంశాలపై అవగాహన కల్పించారు.ఎస్సై నరేంద్ర మాట్లాడుతూ, "ప్రజలు చట్టాలను పాటిస్తూ శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులకు సహకరించాలి. అనుమానాస్పద లేదా చట్టవిరుద్ధ కార్యకలాపాలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి" అని విజ్ఞప్తి చేశారు.

# ఓబీసీ కమిటీ ఆత్మీయ సన్మాన సభలో పాల్గొన్న ఈగ మల్లేశం



**వర్ధన్నపేట, జులై 19(నీలగిరి ఎక్స్ ప్రెస్):** ఓబీసీ కమిటీ ఆత్మీయ సన్మాన సభలో కేంద్ర ఖాదీ, చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం ముఖ్యఅతిగా పాల్గొన్నారు. హన్మకొండ పట్టణంలోని మాస్టర్ జీ డిగ్రీ కళాశాలలో కుడా మాజీ చైర్మన్ మరియు ఓబీసీ చైర్మన్ ఎస్ సుందర్ రాజ్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఆత్మీయ సన్మాన సభ జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా కేంద్ర ఖాదీ, చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఈగ మల్లేశం మాట్లాడుతూ సమాజ అభివృద్ధిలో ఓబీసీల పాత్రను కొనియాడారు. అనంతరం ప్రతిష్టాత్మక పదవుల్లో నియ మితులైన తెలుగు అకాడమీ చైర్మన్ కూరపాటి వెంకట నారాయణ, మరియు మేర సహకార సంఘాల కార్పొరేషన్ చైర్మన్ సంగ వెంకట రాజం ను శాలువాతో ఘనంగా సత్కరించి, సన్మానించారు. ఈ కార్యక్రమ ంలో ఓబీసీ సంఘాల నాయకులు, తది తరులు పాల్గొన్నారు.

# విరాట పర్వం పఠించిన మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు



**నందికొట్కూరు, జూలై 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**స్థానిక శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ఆదివారం సాయంత్రం మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు మహాభారతంలోని విరాట పర్వంను పఠించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "విరాట పర్వానికి మహాభారతంలో విశిష్ట స్థానం ఉంది. దీనిని పఠిం చడం ద్వారా సమృద్ధిగా వర్షాలు కురిసి, పంటలు బాగా పండుతాయని విశ్వాసం ఉంది. దేశ, రాష్ట్ర ప్రజలంతా సుఖసంతోషాలతో ఉం డాలని, రైతులకు పుష్కల వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని 'సమస్త లోకాః సుఖినో భవంతు' అనే సంకల్పంతో విరాట పర్వం పఠించాను" అని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆలయ భక్తులు, గ్రామ పెద్దలు, స్థానిక ప్రజలు పాల్గొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

# ధ్యానం ప్రాముఖ్యతను చాటిన పత్రీజీ సినిమా



**రాజన్న సిరిసిల్ల, జూలై 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** బ్రహ్మశ్రీ పత్రీజీ నటించిన ధ్యానం ప్రాముఖ్యతను తెలియజేసే ఆధ్యాత్మిక చిత్రం రాజన్న సిరిసిల్లలోని నటరాజ్ టాకీస్‌లో ప్రదర్శించబడింది. తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ జిల్లా శాఖ సభ్యులు ఈ చిత్రాన్ని వీక్షించారు.ధ్యానం చేయడం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని, ముఖ్యంగా సీనియర్ సిటిజన్స్ ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం ధ్యానం చేయాలని చిత్రంలో ఇచ్చిన సందేశం అభినందనీయమని వారు పేర్కొన్నారు. సినిమా వీక్షణకు ఆహ్వానించిన నటరాజ్ టాకీస్ మేనేజర్ కె. వెంకయ్యను సీనియర్ సిటిజన్స్ కార్యవర్గం ఘనంగా సన్మానించింది. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు చేపూరి బుచ్చయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జనపాల శంకరయ్య, రాష్ట్ర ఈసీ సభ్యుడు అంకారపు జ్ఞానోబా, జిల్లా ఉపాధ్యక్షుడు ఏనుగుల ఎల్లయ్య, కార్యదర్శి గౌరిశెట్టి ఆనందం, కోశాధికారి దొంత దేవదాసు తదితరులు పాల్గొన్నారు.సభ్యులు మాట్లాడుతూ ఇలాంటి ఆధ్యాత్మిక విలువలతో కూడిన చిత్రాలను ప్రోత్సహించడం సమాజానికి ఎంతో ఉపయోగకరమని అభిప్రాయపడ్డారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన నటరాజ్ టాకీస్ యాజమాన్యానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# కుమ్మర సంఘం ఆధ్వర్యంలో ఘనంగా తాతమ్మ వేడుకలు



**ఖానాపూర్, జూలై 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఖానాపూర్ మండలంలోని రంగపేట గ్రామంలో కుమ్మర సంఘం ఆధ్వర్యంలో ఆదివారం తాతమ్మ వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ ఉత్సవాలకు రంగపేట, బీర్ నంది, ఏరువ చింతల్ గ్రామాలకు చెందిన కుమ్మర సంఘం ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు రాజన్న మాట్లాడుతూ వర్షాలు సకాలంలో కురవాలని, పాడిపంటలు బాగుండాలని, దిగుబడులు అధికంగా రావాలని, ప్రజలు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని కోరారు.

# ఎస్‌టీయూటీఎస్ 80వ ఆవిర్భావ వసంతోత్సవాలపై రాష్ట్రస్థాయి సమీక్ష సమావేశం





**ఖానాపూర్, జూలై 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఉపాధ్యాయ సమస్యల సాధనకై ఏర్పడిన ఎస్‌టీయూటీఎస్ 80 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆగస్టులో జిల్లాల వారీగా నిర్వహించబోయే వసంతోత్సవాల సన్నాహక ఏర్పాట్లపై రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం సమావేశం జరిగింది.రాష్ట్ర అధ్యక్షుడు జి. సదానందం గౌడ్, ప్రధాన కార్యదర్శి జుట్టు గజేందర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో నిర్మల్ జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి జె. లక్ష్మణ్ మాట్లాడుతూ వసంతోత్సవాలను ఘనంగా నిర్వహించాలని కోరారు. రాష్ట్ర శాఖ సూచించిన మేరకు జిల్లాస్థాయిలో ఉత్సవాలను విజయవంతంగా నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

# బీర్ నంది మార్గంలో రోడ్డు ప్రమాదం ఇద్దరికి తీవ్ర గాయాలు



**ఖానాపూర్, జూలై 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఖానాపూర్ మండలంలోని బీర్ నంది రహదారిలో ఆదివారం రోడ్డు ప్రమాదం జరిగింది. కులంగూడకు వెళ్లే మార్గంలో మోటార్ బైక్, కంకరాతో వెళుతున్న టిప్పర్ వాహనాన్ని ఢీకొట్టడంతో ప్రమాదం చోటుచేసుకుంది. బైక్‌పై ఉన్న కొడాలి రాజేశ్వర్, భార్య రాజమానికి తీవ్ర గాయాలు అయ్యాయి. టిప్పర్ టైరు వెళ్లడంతో వారి రెండు కాళ్లు నుజ్జునుజ్జయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది మురళి, వసంత్ తక్షణమే స్పందించి బాధితులను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.పరిస్థితి విషమించడంతో ప్రథమ చికిత్స అనంతరం నిర్మల్ ఆసుపత్రికి తరలించారు.

# రోడ్లను చిత్తడిగా మార్చిన వర్షం



**ఖానాపూర్, జూలై 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** శనివారం సాయంత్రం ఖానాపూర్ మండల కేంద్రంలో కురిసిన వర్షానికి రోడ్లు జలమయమై మట్టితో చిత్తడిగా మారాయి. రాత్రి వాహనాలు, పాదాచారులు నడవలేని స్థితి ఏర్పడింది.వర్షాలు లేక బెంబేలాడుతున్న ప్రజలకు, రైతులకు ఈ జడివాన ఉపశమనం కలిగించింది. ఇప్పటికే విత్తనాలు వేసిన రైతులు మొలకలు వస్తాయని ఆశాభావంతో ఉన్నారు. విత్తనాలు వేయని రైతులు ఆదివారం దుక్కి పనుల్లో నిమగ్నమయ్యారు.వర్షం కారణంగా వేడి తగ్గి ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.

# హాస్టళ్లలో మెనూ ప్రకారం భోజనం అందించాలని యుఎస్ఎఫ్ఐ డిమాండ్




**అమ్రాబాద్, జూలై 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అచ్చంపేట పట్టణంలోని ఎస్సీ బాలుర కళాశాల వసతి గృహం, ఎస్సీ బాలికల పాఠశాల వసతి గృహాలను యుఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో తనిఖీ చేశారు.ఈ సందర్భంగా యుఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎండి సయ్యద్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సరిపడా భోజనం లేక విద్యార్థులు ఆకలితో పడుకోవాల్సి వస్తోందని, శాలిచాలని భోజనాలు పెడుతున్నారని విద్యార్థులు ఫిర్యాదు చేశారని తెలిపారు.ప్రభుత్వం ఇచ్చిన మెనూ ప్రకారమే ప్రతిరోజు భోజనం అందించాలని ఆయన డిమాండ్ చేశారు. ఇకనైనా నాణ్యమైన భోజనం అందించకపోతే యుఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో యుఎస్ఎఫ్ఐ అచ్చంపేట తాలూకా కమిటీ సభ్యులు ప్రసాద్, శ్రీకాంత్, మహేశ్వరి, లలితతో పాటు వసతి గృహ విద్యార్థులు పాల్గొన్నారు.

నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక
RNI - TELTEL/2023/87644
సోమవారం, జూలై 20, 2026



# స్వతంత్రం వచ్చినా దళితులకు స్మశానాలు లేవు

**– ఆవేదన వ్యక్తం చేసిన వ్యవసాయ కార్మిక సంఘం**



**నందికొట్కూరు, జూలై 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** స్వతంత్రం వచ్చి 78 ఏళ్లు గడిచినా దళితులకు స్మశానాలు, భూములు, గృహాలు లేకపోవడం విచారకరమని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం. నాగేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం నందికొట్కూరు మండలం నాగటూరు గ్రామంలోని దళితపేటలో ఆయనతో పాటు సిఐటియు అధ్యక్షుడు ఎస్. ఉస్మాన్ భాష, మండల నాయకులు కొంగర వెంకటేశ్వర్లు, లక్ష్మన్న, సునీల్ కలిసి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ, "నాగటూరు గ్రామంలో మాదిగపేటలో 120 కుటుంబాలు, మాలపేటలో 150 కుటుంబాలు నివసిస్తున్నాయి. వీరికి పూర్వం నుండి ఉన్న 5 ఎకరాల స్మశాన స్థలాన్ని శేషగిరిరావు అనే వ్యక్తి రాజకీయ అండతో కబ్జా చేసి నాలుగున్నర ఎకరాలను అమ్మేశాడు. ప్రస్తుతం మాలపేట దళితులు 10 సెంట్లలో, మాదిగపేట దళితులు 50 సెంట్లలో దహన సంస్కారాలు చేసుకోవాల్సి వస్తోంది. స్థలాభావం వల్ల తీసిన గుంతల్లోనే అంత్యక్రియలు జరగడం మూలంగా దుర్వాసన వ్యాపిస్తోంది" అని తెలిపారు. అలాగే, 90 శాతం దళిత కుటుంబాలకు సొంత భూములు లేవని, రెక్కల కష్టంతోనే జీవనం సాగిస్తున్నారని, పక్కా గృహాలు మంజూరు కాకపోవడం వల్ల ఒకే ఇంట్లో రెండు మూడు కుటుంబాలు నివసిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా ఉందని, సంక్షేమ పథకాలు దళితులకు సక్రమంగా అందడం లేదని ఆరోపించారు. "ఎస్సీ కార్పొరేషన్, సబ్ ప్లాన్ చట్టం, భూసంస్కరణ చట్టం, 1235 స్మశాన వాటిక జీవో ఉన్నప్పటికీ దళితులకు పూర్తిస్థాయిలో ప్రయోజనం అందడం లేదు. పాలకవర్గాలు దళితులను ఓటు బ్యాంకుగా మాత్రమే ఉపయోగిస్తున్నాయి. ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు కల్పించాలి" అని ఆయన డిమాండ్ చేశారు. తదనంతరం గ్రామంలో 9 మంది సభ్యులతో పోరాట కమిటీ ఏర్పాటు చేశారు. చిన్న పుల్లయ్య, రాజు, చిన్న వెంకటేశ్వర్లు, స్వాములు, రమేష్, ఎస్. వెంకటేశ్వర్లు, శంకర్, ఏసేపు, దేవవరం కమిటీలో సభ్యులుగా ఉన్నారు. అనంతరం గ్రామంలో స్మశాన స్థలాన్ని, డ్రైనేజీ కాలువలను, రోడ్లను పరిశీలించారు.

# పాఠశాలల్లోనే ఆధార్ సేవలు



**మహబూబాబాద్, జూలై 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** విద్యార్థులకు ఆధార్ నమోదు, అప్డేట్ సేవలను మరింత సులభతరం చేయడానికి మహబూబాబాద్ జిల్లాలో విద్యాశాఖ ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించింది. జిల్లా విద్యాశాఖ అధికారుల సమన్వయంతో బాట్రానిక్స్ సంస్థ సహకారంతో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లోనే ఉచిత ఆధార్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. చిన్నతనంలో నమోదు చేసిన ఆధార్ కార్డుల్లో వేలిముద్రలు, కంటి ఐరిస్ వివరాలు సరిపోక విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ఈ కార్యక్రమం చేపట్టారు. ముఖ్యంగా స్కాలర్‌షిప్‌లు, విద్యాసంస్థల్లో ప్రవేశాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందేందుకు ఆధార్ వివరాలు సక్రమంగా ఉండటం అవసరమవడంతో విద్యాశాఖ అధికారులు విస్తృతంగా చర్యలు తీసుకున్నారు. జిల్లాలోని అన్ని మండలాలకు 45 ఆధార్ కిట్లు కేటాయించారు. ప్రత్యేక శిక్షణ పొందిన సిబ్బంది పాఠశాలలను సందర్శించి విద్యార్థుల ఫోటోలు తీసి, కంటి ఐరిస్, వేలిముద్రల స్కానింగ్ నిర్వహించి ఆధార్ వివరాలను నవీకరిస్తున్నారు. ప్రతి బృందం రోజుకు 20--30 మంది విద్యార్థులకు సేవలు అందిస్తోంది. ముందుగా రూపొందించిన షెడ్యూల్ ప్రకారం ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఈ ప్రక్రియ కొనసాగుతోంది. దీంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆధార్ నమోదు లేదా అప్డేట్ కోసం మీసేవ కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా పాఠశాలల్లోనే ఉచితంగా సేవలు పొందుతున్నారు. ఈ కార్యక్రమం వల్ల సమయం, ప్రయాణ వ్యయం ఆదా కావడంతో పాటు ఆధార్ సేవలు వేగంగా, సులభంగా అందుతున్నాయని అధికారులు తెలిపారు. విద్యాశాఖ చొరవతో పాఠశాలలకే ఆధార్ సేవలు చేరుకోవడం వల్ల జిల్లాలోని వేలాది మంది విద్యార్థులు నేరుగా లబ్ధి పొందనున్నారని పేర్కొన్నారు.

# నందికొట్కూరులో "జగన్ 2.0 సూపర్ యాప్" ఆవిష్కరణ



**నందికొట్కూరు, జూలై 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రారంభించిన "జగన్ 2.0 సూపర్ యాప్" ను నందికొట్కూరు నియోజకవర్గ వైఎస్ఆర్సీపీ పార్టీ కార్యాలయంలో పార్టీ సమన్వయకర్త డా. సుదీర్ దారా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి మాట్లాడుతూ, "నియోజకవర్గంలో ప్రజాసేవ కొనసాగిస్తూ, కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం చేయాలి. ఈ యాప్ ద్వారా పార్టీ సిద్ధాంతాలు, కార్యక్రమాలు ప్రజలకు వేగంగా చేరతాయి" అని అన్నారు. డా. సుదీర్ దారా మాట్లాడుతూ, "కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు అవుతున్నా రాష్ట్రంలో ఎక్కడా అభివృద్ధి కనిపించడం లేదు. అమరావతి పేరుతో కోట్ల రూపాయల అవినీతికి చంద్రబాబు పాల్పడుతున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజల అభ్యున్నతి కోసం అనుసరిస్తున్న సిద్ధాంతాలను, కార్యక్రమాలను ప్రజలకు నేరుగా చేరవేయడంలో ఈ యాప్ కీలక పాత్ర పోషిస్తుంది. ప్రతి కార్యకర్త చేతిలో ఉండాల్సిన డిజిటల్ ఆయుధమే 'జగన్ 2.0 సూపర్ యాప్'. ఇది నాయకత్వం--కార్యకర్తల మధ్య వారధిగా పనిచేస్తుంది" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నందికొట్కూరు నియోజకవర్గ వైసీపీ శ్రేణులు, బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి అభిమానులు, కార్యకర్తలు, వైఎస్ జగన్ అభిమానులు పాల్గొన్నారు.

# ఆమనగల్లు ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులోకి తీసుకొస్తాం"

**– ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**



**ఆమనగల్లు, జూలై 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆమనగల్లు పట్టణంలో రూ. 17.50 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న 50 పడకల ఆధునిక ప్రభుత్వ ఆస్పత్రి నిర్మాణ పనులను ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆమనగల్లు నియోజకవర్గ ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. అందులో భాగంగానే రూ. 17.50 కోట్లతో అన్ని సౌకర్యాలతో 50 పడకల ప్రభుత్వ ఆస్పత్రిని నిర్మిస్తున్నట్లు తెలిపారు. నిర్మాణ పనులను నాణ్యతతో పాటు వేగంగా పూర్తి చేసి వీలైనంత త్వరగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. నిర్మాణంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా ప్రభుత్వ ప్రమాణాలకు అనుగుణంగా పనులు చేపట్టాలని సూచించారు. ఆస్పత్రి ప్రారంభమైతే ఆమనగల్లు పట్టణంతో పాటు పరిసర గ్రామాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు స్థానికంగానే అందుబాటులోకి వస్తాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజలు వైద్యం కోసం హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గుతుందని, ప్రభుత్వం ఆరోగ్య రంగ అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పత్యనాయక్, మండల అధ్యక్షుడు కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు అవ్వారి శివలింగం, మార్కెట్ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి, సీనియర్ నాయకులు వస్పుల జంగయ్య, కో ఆప్షన్ సభ్యుడు అబ్దుల్ ఖాదర్, ఎంగలి ప్రసాద్, విజయ్ నాయక్, ఒగ్గు మహేష్, ఎన్ఎస్ఈయుఐ రాష్ట్ర కార్యదర్శి ఎండి ఫరీద్, మెకానిక్ బాబా, ఇమ్రాన్ బాబా, సురేష్ నాయక్, కొండల్ రెడ్డి, కుమార్ గౌడ్, శివ, కరీం తదితరులు పాల్గొన్నారు.

# ఆకుతోటపల్లిలో జ్ఞాన విప్లవానికి శ్రీకారం

**– గ్రంథాలయ ప్రారంభోత్సవంలో ప్రజాప్రతినిధుల పిలుపు.. చదువుతోనే సమాజాభివృద్ధి**



**ఆమనగల్, జూలై 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** గ్రామీణ ప్రాంతాల్లో విద్యాభివృద్ధి, పఠన సంస్కృతి పెంపొందించడమే లక్ష్యంగా ఆమనగల్ మండలంలోని ఆకుతోటపల్లి గ్రామంలో నూతన గ్రంథాలయాన్ని శనివారం ఘనంగా ప్రారంభించారు. స్థానిక సర్పంచ్ న్యాలపట్ల నరేందర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పత్య నాయక్‌తో కలిసి గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ ఎ. మధుసూదన్ రెడ్డి గ్రంథాలయాన్ని ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎ. మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో గ్రంథాలయాల ఏర్పాటు జ్ఞాన సమాజ నిర్మాణానికి బలమైన పునాదిగా నిలుస్తుందని అన్నారు. విద్యార్థులు, యువత పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకొని పోటీ పరీక్షలు, ఉన్నత విద్యలో రాణించాలని సూచించారు. గ్రంథాలయాలు కేవలం పుస్తకాల నిలయం మాత్రమే కాకుండా విజ్ఞానం, వ్యక్తిత్వ వికాసానికి కేంద్రాలుగా నిలుస్తాయని పేర్కొన్నారు. సర్పంచ్ న్యాలపట్ల నరేందర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పత్య నాయక్ మాట్లాడుతూ గ్రామ ప్రజలు ముఖ్యంగా యువత గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకొని తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని కోరారు. గ్రామాభివృద్ధిలో విద్యకు అత్యంత ప్రాధాన్యత ఉంటుందని, ప్రజోపయోగ కార్యక్రమాలకు ఎల్లప్పుడూ సహకరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా కార్యదర్శి రాణి, ఉప సర్పంచ్ శ్రీనివాస్, మండల పార్టీ అధ్యక్షుడు కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు అవ్వారి శివలింగం, అండేకార్ రాజశేఖర్, గ్రామ పంచాయతీ సభ్యులు సాజిద్, నర్సింహా, విజయ్, స్వరూప, కొమురమ్మ, ఫీల్డ్ అసిస్టెంట్ ఈధమయ్య, బాలరాజు, మాజీ సర్పంచ్, రామచంద్రయ్య, కృష్ణారెడ్డి, దేవరశెట్టి మహేష్, సురేష్ నాయక్, కొండల్ రెడ్డి గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కెశ్య తండా అభివృద్ధికి సర్పంచ్ రాములు హామీ



**ఆమనగల్లు, జూలై 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** శంకర్‌కొండ గ్రామపంచాయతీ పరిధిలోని కెశ్య తండా అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతుల కల్పనకు సర్పంచ్ రాములు ప్రత్యేక చొరవ చూపుతున్నారు. తండాలోని చౌరస్తా నుంచి సిత్ల వరకు నాలుగు విద్యుత్ స్తంభాలు, ఎల్ఈడీ వీధి దీపాలు ఏర్పాటు చేయాలని ఆదివారం గ్రామ యువకులు, ప్రజాప్రతినిధులు సర్పంచ్ రాములుకు వినతిపత్రం అందజేశారు. రాత్రి వేళల్లో చీకటి కారణంగా మహిళలు, విద్యార్థులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. వినతిని స్వీకరించిన సర్పంచ్ రాములు సమస్యను సానుకూలంగా పరిశీలించి సంబంధిత అధికారులతో చర్చించి వీలైనంత త్వరగా విద్యుత్ స్తంభాలు, వీధి దీపాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గ్రామ ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రతి తండాలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని, ప్రజల సహకారంతో అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగవంతం చేస్తామని తెలిపారు. సర్పంచ్ స్పందనపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తూ సమస్య పరిష్కారానికి చొరవ చూపినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లచ్చు నాయక్, వార్డు సభ్యురాలు జ్యోతి అంజ్య, జైపాల్, మహిపాల్, హంతు, రాజ్య, లచ్చతో పాటు తండా యువకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# ఆపదలో అండగా పాపిశెట్టి రాము

**– పక్షవాతంతో బాధపడుతున్న జంగయ్యకు వైద్య ఖర్చుల కోసం ఆర్థిక సాయం**



**ఆమనగల్, జూలై 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** సమాజ సేవలో ముందుండే ప్రముఖ సంఘ సేవకులు, ఆర్యవైశ్య రాష్ట్ర నాయకులు, కౌన్సిలర్ పాపిశెట్టి రాము మరోసారి తన సేవా దృక్పథాన్ని చాటుకున్నారు. మాడుగుల మండలం నల్లవారిపల్లి గ్రామానికి చెందిన పులకరం జంగయ్య పక్షవాతంతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలుగమల్ల యాదగిరి ద్వారా తెలుసుకున్న పాపిశెట్టి రాము ఆదివారం ఆయనను పరామర్శించి వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా జంగయ్య కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ, అధైర్యపడవద్దని, అవసరమైన సమయంలో ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఆయన సేవా కార్యక్రమాన్ని స్థానికులు అభినందించారు. ఈ కార్యక్రమంలో రామన్న మిత్రమండలి సభ్యులు శ్రీను నాయక్, ఎల్లయ్య, మార్పాకుల వెంకటనారి, దార్ల కిష్టయ్య, కృష్ణయ్య, కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# పేదల బియ్యంతో దందా.. భారీగా పీడీఎస్ బియ్యం పట్టివేత

**– 212 బస్తాలు, ఆటో స్వాధీనం..**
**– నిందితుడిపై కేసు నమోదు**



**ఆమనగల్, జూలై 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పేదలకు పంపిణీ చేయాల్సిన ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేసి విక్రయిస్తున్న ముఠాపై స్పెషల్ బ్రాంచ్, పౌర సరఫరాల శాఖ, ఆమనగల్ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన దాడుల్లో భారీగా బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. స్పెషల్ బ్రాంచ్ పోలీసులకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు పౌర సరఫరాల శాఖ డిప్యూటీ తహసీల్దార్ వై. రామకృష్ణ ఆధ్వర్యంలో మేడిగడ్డ తండాలో తనిఖీలు చేపట్టగా, అక్రమంగా నిల్వ చేసిన లి107.90 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం (212 బస్తాలు)లితో పాటు ఝా07ఖఖీ2980 నంబర్ గల ఆటోను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ. 3.50 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు. విచారణలో నిందితుడు నేనావత్ మణిపాల్ ప్రజల నుంచి తక్కువ ధరకు పీడీఎస్ బియ్యాన్ని కొనుగోలు చేసి అధిక ధరకు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. అనంతరం స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని సంబంధిత ఎంఎల్ఎస్ పాయింట్‌కు అప్పగించగా, ఆటోను ఆమనగల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. నిందితుడిపై సంబంధిత చట్టాల ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

# తాళ్ల రవీందర్ కుటుంబ వేడుకలో ఎమ్మెల్యే కసిరెడ్డి

**– చిన్నారులను ఆశీర్వదించి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు**



**ఆమనగల్, జూలై 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆమనగల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ తాళ్ల రవీందర్ కుమారుడు, కుమార్తెల నూతన వస్త్రాలంకరణ కార్యక్రమం ఆదివారం ఆమనగల్ పట్టణంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై చిన్నారులను ఆశీర్వదించి, కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. చిన్నారులు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఎదిగి కుటుంబానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం తాళ్ల రవీందర్ కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు అవ్వారి శివలింగం, మార్కెట్ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి, ఎంగలి ప్రసాద్, విజయ్ నాయక్, కొండల్ రెడ్డి, కుమార్ గౌడ్, ఇమ్రాన్ బాబా, శివ తదితరులు ఉన్నారు.

# డాక్టర్ కోడూరి శ్రీవాణికి ఘన సన్మానం



**ఎలిగేడు, జూలై 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ శాతవాహన యూనివర్శిటీలో ఆర్థికశాస్త్ర విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఎలిగేడు గ్రామానికి చెందిన డాక్టర్ కోడూరి శ్రీవాణికి ఆదివారం కరీంనగర్‌లోని కెమిస్ట్రీ భవనంలో ఘన సన్మానం జరిగింది. అమ్మ ఫౌండేషన్ తరఫున వ్యవస్థాపకుడు గ్యాజంగి భాస్కర్ ఆమెకు జ్ఞాపికను అందించి సత్కరించారు. ఇటీవలే డాక్టర్ శ్రీవాణి ఇండియన్ ఎకనామిక్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యురాలిగా తెలంగాణ రాష్ట్రం నుంచి ఏకైక ప్రతినిధిగా ఎంపిక కావడం విశిష్ట ఘనతగా నిలిచింది. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ, "ఉన్నత విద్యావంతులైన శ్రీవాణి మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తున్నాం" అని అన్నారు. అలాగే రిటైర్డు ప్రిన్సిపాల్ బూర్ల దక్షిణామూర్తితో పాటు పలువురు వక్తలు ఆమె కృషిని కొనియాడారు.

## తపాలా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

**- కేంద్ర ఖాదీ,చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం**




**హన్మకొండ, జులై 19(నీలగిరి ఎక్స్ ప్రెస్):** తపాలా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కేంద్ర ఖాదీ,చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం అన్నారు.
హన్మకొండ పట్టణంలోని జిల్లా పరిషత్ కాన్ఫరెన్స్ హాల్ లో జరిగిన ఆల్ ఇండియా గ్రామీణ తపాల ఉద్యోగుల సంఘం 7వ ద్వైవార్షిక మహాసభకు ముఖ్య అతిథిగా కేంద్ర ఖాదీ, చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం హాజరయ్యారు. అఖిల భారత గ్రామీణ తపాల ఉద్యోగుల సంఘం 2వ సారి జాతీయ అధ్యక్షులుగా బొద్దున వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా బొద్దున వెంకటేశ్వర్లు కు ఈగ మల్లేశం శాలువాలతో సత్కరించి సన్మానించి వారికి అభినందనలు తెలియజేశారు.అనంతరం వారు మాట్లాడుతూ తపాలా ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు కీలక సమస్యలను సమగ్రంగా పరిశీలించి ఉద్యోగ భద్రత, వేతనాల మెరుగుదల, పదోన్నతుల అవకాశాలు, పని పరిస్థితులు, సంక్షేమ పథకాల అమలు విషయంలో కృషి చేయాలని వారిని కోరారు. అలాగే తపాల ఉద్యోగులకు నా వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. ఈ సందర్భంగా ఈగ మల్లేశం ను జాతీయ అధ్యక్షులు బొద్దున వెంకటేశ్వర్లు తో పాటు తపాల ఉద్యోగుల సంఘం సభ్యులు గజమాలతో ఘనంగా సత్కరించి, మెమొంటోను బహూకరించారు. ఈ కార్యక్రమంలో తపాల
ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## యాచారం మైసయ్యకు నివాళి




**ఇబ్రహీంపట్నం, జూలై 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**యాచారం మండలం తాడిపర్తి గ్రామ వార్డు సభ్యుడు యాచారం మహేష్ తండ్రి మైసయ్య మృతి చెందగా, ఆయన అంత్యక్రియలకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మోటే శ్రీశైలం హాజరై పూలమాల వేసి ఘన నివాళు లర్పించారు.కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేసిన శ్రీశైలం, మైసయ్య సేవలను గుర్తుచేసుకున్నారు.ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పోలమోని రామకృష్ణ యాదవ్, గ్రామ మాజీ సర్పంచ్ దూస రమేష్, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు పాశం జయప్రకాష్, మదర్ డైరీ డైరెక్టర్ మండలి జంగయ్య, గ్రామ శాఖ అధ్యక్షుడు నీలం రాములు, యువజన కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు బైకని వినోద్, బన్నే జంగయ్య, ఆడాల శ్రీకాంత్, దశరథ, బుల్లెట్ శ్రీకాంత్, యూసుఫ్ పటాన్, నీలం పాండు, మండలి యాదగిరి, కొప్పు శివ తదితరులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ నిరుపేదలకు వరం : శ్రీశైలం

**యాచారం , జులై 19 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ ) :** ముఖ్యమంత్రి సహాయనిధి నిరుపేదలకు ఒక వరం అని యాచారం మండల కాంగ్రెస్ అధ్యక్షులు మోటె శ్రీశైలం అన్నారు.ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సహకారంతో యాచారం మం డలం మాల్ గ్రామానికి చెందిన మందడి జంగారెడ్డి , తండ్రి: లింగారెడ్డి, 60,000/- , యెస్కుల్ల రాములయ్య తండ్రి: మైసయ్య 38,000/- ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ 98,000/- విలువైన చెక్కులను యాచారం మండల కాంగ్రెస్ అధ్యక్షులు మోటె శ్రీశైలం , మాల్ గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు దొంతమోని శ్రీకాంత్ గౌడ్ తో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా శ్రీశైలం మాట్లాడుతూ...సీఎం సహాయ నిధి రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తూ నిరుపేదలకు ఆసరాగా నిలుస్తుందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. పార్టీలకు అతీతంగా సీఎంఆర్ఎఫ్



ఇవ్వడం హర్షించదగ్గ విషయం అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కవిత శేఖర్, మాజీ సర్పంచ్ పద్మ జంగీర్, సీనియర్ నాయకులు లిక్కీ రాజా రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ గెణమోని గోపాల్, రంగారెడ్డి జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పొలమోని రామకృష్ణ యాదవ్, యాచారం మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు జయప్రకాష్ (జగన్), మాల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు దేరంగుల రమేష్, గిరి గాలయ్య ,మాస బాలరాజ్, మాజీ 4వ వార్డు సభ్యులు దేరంగుల్లా కృష్ణ, అండేకర్ రవి, షెల్లీ దేవధర్, గుండంట్ల కృష్ణ, దేరంగుల్లా ఈశ్వర్, గ్రామ పెద్దలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# భారాస "యువ సంగ్రామ సదస్సు" నిరుద్యోగ యువతను మోసం చేసే రాజకీయ నాటకం

**: జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి మదన్ మోహన్ తీవ్ర విమర్శలు**



**బాలానగర్ జులై 20**
హైదరాబాద్‌లో భారాస పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన "యువ సంగ్రామ సదస్సు" పూర్తిగా డబ్బుతో నిర్వహించిన రాజకీయ ప్రదర్శన మాత్రమేనని, నిరుద్యోగ యువతను మరోసారి మభ్యపెట్టేందుకు చేసిన ప్రయత్నమని మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధి మదన్ మోహన్ ఆరోపించారు. పదేళ్లపాటు అధికారంలో ఉండి తెలంగాణ యువతకు న్యాయం చేయని కేసీఆర్, కేటీఆర్‌లు ఇప్పుడు యువత పేరుతో సభలు నిర్వహించడం ప్రజలను మోసం చేయడమేనని ఆయన విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటికొక ఉద్యోగం" అంటూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని భారాస ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని పేర్కొన్నారు. నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి పదేళ్లలో ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని, లక్షలాది మంది యువత ఆశలను అణచివేసిందని ఆరోపించారు.

**-- పేపర్ లీకేజీలతో యువత భవిష్యత్తు నాశనం....**
భారాస పాలనలో టీఎస్‌పీఎస్సీ, గ్రూప్-1, గ్రూప్-2, ఎస్ఐ తదితర పరీక్షల ప్రశ్నాపత్రాలు లీక్ కావడం వల్ల లక్షలాది మంది నిరుద్యోగ యువత తీవ్ర నష్టపోయారని మదన్ మోహన్ పేర్కొన్నారు. యువత జీవితాలతో చెలగాటం ఆడిన కారణంగానే టీఎస్‌పీఎస్సీ వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర వివాదానికి దారితీసిందని గుర్తు చేశారు.అలాగే రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తామని ప్రకటించి, అందులో కనీసం 30 వేల ఉద్యోగాలు కూడా పూర్తి స్థాయిలో భర్తీ చేయలేదని విమర్శించారు. మిగతా నియామకాలన్నీ కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ విధానాలకే పరిమితమయ్యాయని ఆరోపించారు.

**-- 18 నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న చర్యలు...**
రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 18 నెలల వ్యవధిలోనే రెండు లక్షల ఉద్యోగాల క్యాలెండర్ ప్రకటించి, ఇప్పటికే సుమారు 65 వేల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు విడుదల చేసిందని మదన్ మోహన్ తెలిపారు.
టీఎస్‌పీఎస్సీ వ్యవస్థను ప్రక్షాళన చేసి పారదర్శక నియామకాల దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, యువతలో విశ్వాసాన్ని పెంపొందించే విధంగా పరీక్షల నిర్వహణ జరుగుతోందని పేర్కొన్నారు.

అలాగే భారాస పాలనలో విశ్వవిద్యాలయాలకు సరైన నిధులు లేక విద్యా వ్యవస్థ నిర్లక్ష్యానికి గురైందని, హాస్టళ్లలో విద్యార్థులు కనీస సౌకర్యాలు కూడా లేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఆరోపించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం "యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్" వంటి కార్యక్రమాల ద్వారా విద్యారంగంలో మార్పులు తీసుకొస్తోందని చెప్పారు.

**-- "యువ సంగ్రామ సదస్సు"పై తీవ్ర విమర్శలు**
భారాస నిర్వహించిన యువ సంగ్రామ సదస్సులో పాల్గొన్న వారిలో నిజమైన నిరుద్యోగ యువత కంటే పార్టీ కార్యకర్తలే అధికంగా ఉన్నారని, వారిని బస్సుల్లో తరలించి సభను విజయవంతమైనట్లు చూపించే ప్రయత్నం చేశారని మదన్ మోహన్ ఆరోపించారు.కేటీఆర్ ఉద్యోగాల గురించి మాట్లాడే ముందు, భారాస పాలనలో నిరాశతో ఆత్మహత్యలు చేసుకున్న నిరుద్యోగ యువత కుటుంబాలకు క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

**-- భారాసకు కాంగ్రెస్ పార్టీ సవాల్.....**
భారాస నాయకులు యువత ముందు బహిరంగ చర్చకు రావాలని కాంగ్రెస్ పార్టీ సవాల్ విసిరింది. పదేళ్లలో ఎన్ని ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చారు? ఎన్ని పరీక్షల ప్రశ్నాపత్రాలు లీక్ అయ్యాయి? నిరుద్యోగ భృతి ఎందుకు ఇవ్వలేదు? అనే అంశాలపై ప్రజలకు స్పష్టమైన సమాధానాలు చెప్పాలని మదన్ మోహన్ డిమాండ్ చేశారు.

**-- యువతకు కాంగ్రెస్ భరోసా...**
యువతను రెచ్చగొట్టి మళ్లీ అధికారంలోకి రావాలనే భారాస ప్రయత్నాలను తెలంగాణ యువత తిప్పికొడుతుందని మదన్ మోహన్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేస్తూ యువతకు ఉద్యోగ అవకాశాలు, మెరుగైన భవిష్యత్తు కల్పించేందుకు కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

# రామప్పను సందర్శించిన ఐపీఎస్ అధికారి







**(రామప్ప)ములుగు జిల్లా ప్రతినిధి జూలై 19**
మండలంలోని పాలంపేట గ్రామంలో గల రామప్ప దేవాలయాన్ని ఆదివారం ఏఎస్పి సాయి శివైన్ ఐపీఎస్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు హరీశ్ శర్మ, ఉమాశంకర్ లు వారికి స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ చరిత్ర, శిల్పకళ ప్రాముఖ్యత గురించి టూరిజం గైడ్ గోరంట్ల విజయ్ కుమార్ వారికి వివరించారు. అనంతరం రామప్ప చెరువును సందర్శించి బోటింగ్ చేశారు. వారి వెంట ఏస్సై చల్ల రాజు, టూరిస్ట్ పోలీసులు బద్రు, శ్రీకాంత్, దశరథ్ దేవాదాయ, పురావస్తు, టూరిజం శాఖల సిబ్బంది ఉన్నారు

# కాంగ్రెస్ గెలుపే లక్ష్యం.. సైనికుడిలా కృషి చేస్తాం: తుంగతుర్తి రవి

**- మేడిపల్లి డివిజన్‌లో కాంగ్రెస్ ముఖ్య నాయకుల సమావేశం**



**మేడిపల్లి : జూలై 19** రానున్న మున్సిపల్ ఎన్నికల్లో మేడిపల్లి డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ విజయమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని మేడిపల్లి డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుంగతుర్తి రవి పిలుపునిచ్చారు. డీసీసీ అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్ ఆదేశాల మేరకు తుంగతుర్తి రవి ఆధ్వర్యంలో ఆదివారం మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 9వ డివిజన్ (మేడిపల్లి)లో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి డీసీసీ ప్రధాన కార్యదర్శి జలేందర్ రెడ్డి, పోచారం డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కర్రె రాజేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ చేర్చే బాధ్యత కాంగ్రెస్ కార్యకర్తలపై ఉందన్నారు. పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేసే ప్రతి కార్యకర్తను అధిష్ఠానం తప్పకుండా గుర్తిస్తుందని తెలిపారు. పాత, కొత్త అనే తేడా లేకుండా అందరూ సమిష్టిగా పనిచేసి కాంగ్రెస్ విజయానికి కృషి చేయాలని సూచించారు. మేడిపల్లి డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుంగతుర్తి రవి మాట్లాడుతూ గత పదేళ్లుగా కాంగ్రెస్ పార్టీ జెండాను ఎప్పుడూ దించకుండా పార్టీ కోసం నిరంతరం పోరాడామని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో అక్రమ కేసులు, అవమానాలు ఎదురైనా వెనుకడుగు వేయకుండా కాంగ్రెస్ విజయానికి ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేశారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వివిధ పార్టీల నుంచి పెద్దఎత్తున నాయకులు చేరడంతో పార్టీ మరింత బలోపేతం అవుతుందని భావించామని, అయితే కొందరు నాయకులు పార్టీ ఆదేశాలను పట్టించుకోకుండా కేవలం పదవుల కోసం మాత్రమే పనిచేయడం బాధాకరమని వ్యాఖ్యానించారు. తనలో ఏవైనా లోపాలు ఉంటే నిర్భయంగా చెప్పాలని, వాటిని సరిదిద్దుకునేందుకు తాను ఎప్పుడూ సిద్ధంగా ఉంటానని తుంగతుర్తి రవి స్పష్టం చేశారు. పార్టీ అంటే ఒక పెద్ద కుటుంబమని, అందరూ కలిసి పనిచేసినప్పుడే విజయం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. తమపై ఎలాంటి కుట్రలు జరిగినా సహించబోమని, పార్టీ క్రమశిక్షణను దెబ్బతీసే చర్యలను ఉపేక్షించబోమని హెచ్చరించారు. బూత్ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేసేందుకు త్వరలోనే డివిజన్ స్థాయి పూర్తి కమిటీని ఏర్పాటు చేస్తామని తెలిపారు. పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసే ప్రతి కార్యకర్త వివరాలను పార్టీ అధిష్ఠానానికి పంపిస్తామని చెప్పారు. పార్టీ నిర్ణయించిన అభ్యర్థుల విజయానికి అందరూ ఐక్యంగా కృషి చేసి మేడిపల్లి డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీని ఘన మెజార్టీతో గెలిపించడమే తమ లక్ష్యమని తుంగతుర్తి రవి అన్నారు. ఈ సమావేశంలో కంటెస్టెడ్ కార్పొరేటర్లు, డివిజన్ ఇన్‌చార్జ్‌లు, బీసీ సెల్, ఎస్సీ సెల్, ఎస్టీ సెల్, ఓబీసీ సెల్, మైనార్టీ సెల్, యూత్ కాంగ్రెస్, సేవాదళ్, ఎన్ఎస్‌యూఐ, మహిళా విభాగం నాయకులు, పార్టీ కార్యకర్తలు, యువత, కమిటీ సభ్యులు, మహిళలు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సీటు వదలరు - సిన్సియర్‌గా డ్యూటీ చేయరు కార్పొరేషన్లలో అవినీతి కొండలు

**హైదరాబాద్ :** ప్రధాన కార్పొరేషన్లలో కొందరు అధికారులు అక్రమార్జన కోసం బరితెగిస్తున్నారు. బినామీ కాంట్రాక్టర్ల కోసం పనుల వ్యయాల అంచ నాలను రెట్టింపు చేస్తూ, ప్రజా ధనాన్ని దండు కుంటున్న ఇంజినీర్లు మొదలుకొని, రెవెన్యూ ట్యాక్స్‌ను మదింపు చేయాలంటూ సామాన్య ప్రజలను పీడిస్తున్న సహాయ మున్సిపల్ కమిషర్ల వరకు అక్రమంగా సంపాదించేందుకు దేనికైనా సిద్ధమవుతున్నారు. ఉన్నతాధికారులకు ప్రజా సంక్షేమం, ప్రజాధనంపై పట్టింపు లేకపోవడం వల్ల అక్రమార్కుల ఆగడాలకు అడ్డూ అదుపు ఉండటం లేదు. దీనికి తోడు సిబ్బంది కొరత కారణంగా పలువురు కమిషనర్లు అవినీతి పరులకే పదవులు అప్పగించడం, పదవీ విరమణ అయినవారి సర్వీసులను పొడిగించడం ద్వారా వారి ఉదాసీన వైఖరి తేటతెల్లమవుతోంది.క్రీడా వసతులకు రూ.8 కోట్ల అంచనాలు : సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శేరిలింగంపల్లి జోన్?లో ఓ ఇంజినీరింగ్ ఉన్నతాధికారి భారీగా అవినీతికి పాల్పడుతున్నారని తెలిసింది. ఈయన ఇటీవలే ఓ ఫ్లైఓవర్ కింద క్రీడా వసతులు సమకూర్చేందుకు రూ.8 కోట్లతో అంచనాలు వేసి బినామీ కాంట్రాక్టరుకు పనులు అప్పగించారు. సంవత్సరాల పాటుగా అదే జోన్?లో విధుల్లో ఉంటూ కోట్ల రూపాయలు కొల్లగొట్టారని, సొంతూరు పరిసర ప్రాంతాల్లో పదుల ఎకరాల మేర భూములు కొనుగోలు చేశారని సమాచారం.టెండర్?కు ముందే కమీషన్ అందాలి : మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్‌లో రోడ్లు వేయడం, ప్రధాన కాలువలు, కుంటల్లో పూడికతీసే పనులను ఓ ఇంజినీరింగ్ ఉన్నతాధికారి బినామీ గుత్తేదారులకే అప్పగిస్తుంటారు. సాధారణంగా కాంట్రాక్టర్లు 1 నుంచి 5 శాతం దాకా అధికారులకు కమీషన్ ఇస్తుంటారు. కానీ, ఈ ఇంజినీర్ అధికారికి మాత్రం టెండర్? ప్రకటనకు ముందే పని విలువలో 10 నుంచి 20 శాతం చేతిలో పెట్టాల్సి ఉంటుంది. ఆ సొమ్ముతో నగరంలో ఓ హాస్పిటల్, శ్రీశైలం హైవేలో సాగు భూములు, పలు ప్రాంతాల్లో భవనాలు కొనుగోలు చేశారు.రూ.10 లక్షలు ఇస్తేనే సంతకం : రాజేంద్రనగర్, చార్మినార్? జోన్ల ఇంజినీరింగ్ ఉన్నతాధికారులు కూడా బినామీ కాంట్రాక్టర్లతో కలిసే దందా సాగిస్తున్నారు. వీరిలో ఒకరు బామ్మర్దికి, మరొకరు చుట్టాలు, గ్రామస్థులకు పనులు అప్పగిస్తున్నారు. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ)లో నిర్మాణ అనుమతి దరఖాస్తుకు టౌన్‌ప్లానింగ్ ఉన్నతాధికారి నుంచి ఆమోదం పొందాలంటే మధ్యవర్తి ఉండాల్సిందే. కనీసం రూ.10 లక్షలు అందనిదే ఆయన సంతకం చేయరు. కమిషనర్ హెచ్చరిస్తున్నా ఆయన తీరు మార్చుకోవడం లేదని తోటి అధికారులు అంటున్నారు.పన్ను పెంచుతామని బెదిరింపులు : ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ సర్కిళ్లలోని ఉపకమిషనర్లు కొలువులో చేరిన నాటి నుంచే కుర్చీలాట ఆడుతున్నారు. 15 ఏళ్లుగా అక్కడే పాతుకుపోయారు. వాణిజ్య భవనాలు, అనుమతి లేని నిర్మాణాలు యజమా నులు వీరికి ఏటా మామూళ్లు కట్టాల్సిందే. పలు ప్రముఖ హాస్పిటళ్ల నిర్వాహకులను భయపెట్టి రూ.2 లక్షల చొప్పున దండుకున్నారు. వీరి ఆస్తులు మార్కెట్ విలువ ప్రకారం రూ.100 కోట్లు ఉండొచ్చని అంచనా.అనిశా దాడులతో బయటపడుతున్నా యి : ఉన్నతాధికారులు విధి నిర్వహణలో అవినీతికి పాల్పడుతూ అడ్డగోలుగా పోగు చేసిన అక్రమ సంపాదనలతో శంకర్‌పల్లి, శంషాబాద్, గండిపేట్ మండలాల్లో విల్లాలు, వ్యవసాయ భూములు, బహుళ అంతస్తుల్లో ఫ్లాట్లు కొనుగోలు చేస్తున్నారు. హైదరాబాద్ కేంద్రంగా పలు ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వహిస్తున్న అవినీతి అధికారులపై ఏసీబీ అధికారులు ఇటీవల సోదాలు చేసి వారి స్థిర, చరాస్థులను పరిశీలించగా ఈ వ్యవహారం బయటకొచ్చింది.ఈ మూడు మండలాల్లోనే ప్రధానంగా ఆస్తులు : శంషాబాద్, శంకర్‌పల్లి, గండిపేట్ మండలాల్లో ఓఆర్ఆర్ ఉండటం వల్ల భవిష్యత్తులో రీజినల్ రింగురోడ్డుకు అనుసంధానించే అవకాశాలున్నాయి. ఈ కారణంగానే ఆయా ప్రాంతాల్లోనే అక్రమార్కులు ఆస్తులు కొంటున్నారు. ఇటీవల హెచ్?ఎండీఏ చీఫ్ ఇంజినీర్ బుచ్చు రవీందర్, భీమ్‌రెడ్డి, డిప్యూటీ కలెక్టర్ మద్రి వంశీమోహన్, సర్వేల్యాండ్స్ అధికారి సుంకరి నరహరిరావు ఇళ్లలో ఏసీబీ అధికారులు సోదాలు చేశారు. రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్? జిల్లాల్లో వీరికి ఎకరాల మేర భూములున్నప్పటికీ, ఖరీదైన స్థిరాస్తులు మాత్రం పై మూడు మండలాల్లోనే ఉన్నాయి. భీమ్?రెడ్డికి మణికొండలో 3వేల గజాల ప్లాటు, శంషాబాద్ మండలం ముచ్చింతల్?లో 4.2 ఎకరాల భూమి, ల్యాంకోహిల్స్?లో 500 గజాల ప్లాటు ఉంది.

# ఒక్క మేయర్ సీట్‌లో సగం స్థానాలు గెలిచి చూపించండి.



**హైదరాబాద్:** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పాలకమండలి ఐదేళ్ల గడువు ఈ ఏడాది ఫిబ్రవరిలో ముగియడంతో గ్రేటర్ ప్రత్యేక అధికారుల పాలనలోకి వెళ్లిందని తెలిసిందే. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం జీహెచ్‌ఎంసీని మూడు కార్పొరేషన్లుగా విభజించింది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్‌ఎంసీ) , సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్‌గా విభజిస్తూ ఉత్తర్వులు కూడా జారీ చేసింది.జీహెచ్‌ఎంసీకి ఈ ఏడాది చివరలో ఎన్నికలు నిర్వహించేందుకు ప్లాన్ చేస్తున్నట్టు ఇప్పటికే వార్తలు కూడా వచ్చాయి. కాగా జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో మేయర్ పీఠాలు గెలుపుపై ఆ పార్టీ ఇస్తున్న స్టేట్‌మెంట్స్‌పై బీజేపీ బహిష్కృత నేత రాజాసింగ్ చేసిన కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి.మీడియాలో కానీ, మీటింగ్‌లో కానీ, పేపర్‌లో కానీ జీహెచ్‌ఎంసీలో మూడు మేయర్ సీట్లు గెలుస్తామని బీజేపీ స్టేట్‌మెంట్స్‌లు అయితే బాగా వస్తున్నయ్. మూడు కాదు.. ఒక్కటి కూడా కాదు.. ఆ ఒక్క మేయర్ సీట్‌లో సగం స్థానాలు గెలిచి చూపించండి అని రాజాసింగ్ సవాలు విసిరారు. ఈ కామెంట్స్ ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతున్నాయి. మరి దీనిపై బీజేపీ నేతలు ఎలా స్పందిస్తారనేది చూడాలి.

# ఎంత సెన్స్ ఆఫ్ హ్యూమర్.. నా అభిమాన పొలిటికల్ లీడర్ కేటీఆర్




**హైదరాబాద్ :** కార్టూనిస్ట్ శేఖర్ మెమోరియల్ అవార్డు -2026 ప్రదానోత్సవ సభ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గురించి కార్టూనిస్ట్ శంకర్ చేసిన వ్యాఖ్యలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. కార్టూనిస్ట్ శంకర్ మాట్లాడుతూ.. నాకు కూడా ఇప్పటికి ఒక అభిమాన లీడర్ కేటీఆర్. ఒక కార్టూనిస్టుగా అది నేను గర్వంగా చెప్పగలుగుతానన్నారు.ఆ రోజు నేను కేటీఆర్ వస్తే తనను ఆహ్వానించేందుకు ముందు వచ్చిన. కేటీఆర్ కారు దిగి వస్తున్నడు. నా బ్యాగు సంకలో వేసుకుని మెట్లు ఎక్కుతున్నా.. కేటీఆర్ వెనకనే ఉన్నారు. అన్నా నువ్వు ఈ బ్యాగు లేకుంటే బ్యాలెన్స్ తప్పుతవా అన్నరు. నైట్ కూడా అది వేసుకుని పడుకుంటవా అని కూడా అన్నరు. ఎంత సెన్స్ ఆఫ్ హ్యూమర్. ఇంత పెద్ద పొలిటికల్ లీడర్ స్విచాఫ్, స్విచాన్ లాగా.. ఇంట్లోకి పోతే భర్తలాగా.. తండ్రి తగ్గ కొడుకులాగా ఇది ఎట్లా సాధ్యం..? కేటీఆర్ మీద నాకు అభిమానం కూడా పెరిగిందని చెప్పుకొచ్చారు. కేటీఆర్ వ్యక్తిత్వం గురించి కార్టూనిస్ట్ శంకర్ చేసిన ఈ కామెంట్స్ అందరినీ ఆకర్షిస్తున్నాయి.

# రెండో విడతలో అదనంగా 4,347 బీటెక్ సీట్లు

**హైదరాబాద్ :**ఇంజినీరింగ్ కౌన్సెలింగ్ రెండో విడతలో మరో 4,347 బీటెక్? సీట్లు కలిశాయి. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతించడంతో వాటిని కౌన్సెలింగ్‌లో చేర్చారు. కన్వీనర్, యాజమాన్య కోటా కలిపితే 6,210 సీట్లు కొత్తగా పెరిగాయి. వాటిలో 70 శాతం సీట్లను కన్వీనర్ కోటా కింద భర్తీ చేస్తారు. మొత్తం 54 కళాశాలల్లో కొత్తగా సీట్లు పెరిగాయి. మరో రెండు కళాశాలలకు సర్కారు అనుమతిచ్చింది. కూకట్?పల్లి విలేజ్ లో ఓ కళాశాల ప్రారంభమైంది. చేవెళ్లలో గతం లో ఉన్న కళాశాల మూతపడగా దానికి మళ్లీ తరగతుల నిర్వహణకు అనుమతి ఇచ్చింది. ఈ రెండింట్లో 240 సీట్లు చొప్పున అందుబాటులోకి వచ్చాయి.మొత్తం 32,834 సీట్లు అందుబాటులో : తొలివిడత కౌన్సెలింగ్? తర్వాత మిగిలినవి 27,487 సీట్లుండగా రెండో విడత కౌన్సెలింగ్?కు మొత్తం 31,834 సీట్లు అందుబాటులోకి రానున్నాయి. ఈ నెల 17న రెండో విడత మొదలవ్వగా కొత్తగా 2,622 మంది సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరయ్యారు. శనివారం ఉదయం వెబ్? ఆప్షన్ల ప్రక్రియ మొదలవ్వగా తొలిరోజే 27,197 మంది ఆప్షన్లు ఇచ్చుకున్నారు. వెబ్ ఆప్షన్ల గడువు ఇవాళ అర్ధరాత్రి 12 గంటలకు ముగియనుంది.



కొత్తగా వచ్చిన సీట్లకు 10 శాతం ఈడబ్ల్యూఎస్ కోటా అదనంగా కేటాయించారు. అంటే మరో 430 సీట్లు పెరగనున్నాయి.17 బ్రాంచీల్లో కొత్త సీట్లు - వివరాలు ఇలా : కొత్తగా వచ్చిన 4,347 సీట్లు 17 రకాల బ్రాంచీలకు సంబంధించినవని ప్రవేశాల కన్వీనర్ శ్రీదేవసేన తెలిపారు. వాటిల్లో అత్యధికంగా సీఎస్ఈలో 1,008, ఈసీఈలో 819, సీఎస్ఈలో 672, సీఎస్ఈ (డేటా సైన్స్)లో 378 కొత్తగా చేరాయి. ఇతర కోర్సుల వారీగా సీట్లు ఏఐ అండ్ డేటా సైన్స్(63), ఏఐ అండ్ ఎంఎల్(84), సీఎస్ఈ సైబం సెక్యూరిటీ (126), కంప్యూటర్ సైన్స్ అండ్? ఐటీ(126), సీఎస్ఈ ఐఓటీ (42), ఐటీ (84), బయోటెక్నాలజీ(84), సివిల్ (189), ఈసీఈ-వీఎల్ఎస్ఐ డిజైన్ అండ్ టెక్నాలజీ(42), ఈఈఈ(168), అండ్ టెక్నాలజీ(231), మెకానికల్(147), ఫార్మాస్యూటికల్ ఇంజినీరింగ్84 సీట్లు కొత్తగా కౌన్సెలింగ్‌లో చేరాయి.ఏటా చివరి నిమిషంలో అదనపు సీట్లు : రాష్ట్రంలో బీటెక్? కొత్త సీట్లపై అటు విద్యార్థులు ఇటు కళాశాల యాజమాన్యాల్లో ఉత్కంఠ నెలకొనగా మరోవైపు విద్యాశాఖ అధికారులు నేరుగా ఎప్‌సెట్ ప్రవేశాల కౌన్సెలింగ్‌వెబ్‌సైట్లో పెట్టనున్నారు. మరోవైపు విద్యాశాఖ అధికారులు నేరుగా ఎప్‌సెట్ ప్రవేశాల కౌన్సెలింగ్ వెబ్‌సైట్లో పెట్టనున్నారు. ప్రతి ఏడాదిలో అదనపు సీట్లను చివరి నిమిషంలో ఖరారు చేస్తుండటంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో అయోమయంలో పడుతున్నారు. కొత్తగా సీట్లకు అనుమతి ఇస్తున్న విద్యాశాఖ ఏ కళాశాలలలో ఏ కోర్సు అదనంగా వచ్చింది? ఏ బ్రాంచిలో సీట్లు పెరిగాయన్న వివరాలు ఇవ్వకుండా ఇప్పటికే ఉన్న సీట్లకు కలిపి కౌన్సెలింగ్?లో చేరుస్తున్నారు. దానివల్ల విద్యార్థులు గందరగోళానికి గురవుతున్నారు. ఎలాంటి జీవో జారీ చేయకుండానే? : నిబంధనల ప్రకారం కొత్త సీట్లు మంజూరు చేస్తే ప్రభుత్వం కళాశాలలవారీగా సీట్లు పేర్కొంటూ జీవో జారీ చేయాలి. ఆ తర్వాత వర్సిటీలు నిర్వహించి ఆమోదించిన తర్వాతే కౌన్సెలింగ్?లో చేర్చాలి. దానికి భిన్నంగా ముందు కౌన్సెలింగ్?లోకి చేర్చి తర్వాత అంతర్గత ఉత్తర్వులు ఇస్తున్నారన్న విమర్శలు 2-3 ఏళ్ల నుంచి ఉన్నాయి. మరోవైపు అదనపు సీట్లు ఇవ్వాలంటే కళాశాలలను తనిఖీ చేయాల్సి ఉండటంతో విద్యాశాఖ ఆదేశాలతో జేఎన్?టీయూహెచ్?, ఓయూలు శుక్రవారం తనిఖీలు నిర్వహించాయి. ఓయూలో 6 కళాశాలలకు మూడు బృందాలను పంపినట్లు సమాచారం. జేఎన్?టీయూ హెచ్?లో పదుల సంఖ్యలో కళాశాలలున్నాయి.

# మున్నూరు కాపుల అభివృద్ధికి ఐక్యంగా కృషి చేయాలి

**మంచిర్యాల అర్బన్ :** రాజకీయాలకు అతీతంగా మున్నూరు కాపు సామాజిక వర్గం అభివృద్ధికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సర్దార్ పుట్టం పురుషోత్తం రావు పటేల్ పిలుపునిచ్చారు. ఆదివారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని నార్తిఇన్ హోటల్లో నిర్వహించిన మున్నూరు కాపు సంక్షేమ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు.రాష్ట్రంలో మున్నూరు కాపుల జనాభా గణనీయంగా ఉన్నప్పటికీ, వారికి తగిన రాజకీయ, సామాజిక, ఆర్థిక అవకాశాలు మరింత పెరగాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం



ఏర్పాటు చేసిన మున్నూరు కాపు కార్పొరేషన్ ద్వారా విద్య, ఉపాధి, స్వయం ఉపాధి, సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలు కావాలని కోరారు. సంఘం బలోపేతానికి ప్రతి ఒక్కరూ ఐక్యంగా పనిచేయాలని, పార్టీలు, వ్యక్తిగత విభేదాలకు అతీతంగా సమాజ అభివృద్ధినే ప్రధాన లక్ష్యంగా పెట్టుకోవాలని సూచించారు.రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన జనగణన సర్వే లో మున్నూరు కాపుల సంఖ్యను తక్కువ చూపెట్టారని రాష్ట్ర స్థాయి నుంచి జిల్లా, పట్టణ, గ్రామ స్థాయిలో ప్రత్యేక సర్వే నిర్వహించి మున్నూరు కాపుల సంఖ్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు. మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి పటేల్ మాట్లాడుతూ ప్రతి జిల్లాలో మున్నూరు కాపుల కోసం ఆత్మగౌరవ భవనాలు నిర్మించాలని, హైదరాబాద్‌లో రాష్ట్ర స్థాయి భవనం ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో మంచిర్యాల మేయర్ ధరణి మధుకర్, రాష్ట్ర కార్యదర్శి, ఆసిఫాబాద్ జిల్లా ఇన్‌చార్జి గాదె సత్యం, జిల్లా ఇన్‌చార్జి ఇందురి తిరుపతి, జిల్లా అధ్యక్షుడు చిట్ల సత్యనారాయణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబులపు శ్రీనివాస్, నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్ తూముల నరేష్, కరీంనగర్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సొత్తు మల్లేశ్, రాష్ట్ర కార్యనిర్వాహక తదితరులు పాల్గొన్నారు.

# పెట్రోల్ దాడిలో గాయపడిన కాంగ్రెస్ కార్యకర్త మృతి



**హైదరాబాద్ :** వరంగల్ జిల్లాలో గత రాత్రి పత్తి కుమార్ అనే రౌడీషీటర్ చేసిన పెట్రోల్ దాడిలో తీవ్రంగా గాయపడ్డ కాంగ్రెస్ కార్యకర్త ఆడెపు మహేష్ ఎంజీఎం దవాఖానలో చికిత్స అందిస్తూ మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ నిమ్స్ హాస్పిటల్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే..వరంగల్ నగరంలోని 14వ డివిజన్ ఎన్‌టీఆర్ నగర్ ప్రాంతానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా రాష్ట్ర మాజీ కోఆర్డినేటర్, మాజీ డివిజన్ అధ్యక్షుడు అడుప మహేశ్‌పై గుర్తుతెలియని వ్యక్తులు పెట్రోల్ పోసి నిప్పటించగా తీవ్ర కాలిన గాయాలయ్యాయి.మహేశ్ బైక్‌పై ఎస్ఆర్ నగర్ నుంచి కోటి లింగాలగుడి మీదుగా ఎన్‌టీఆర్ నగర్‌కు శనివారం రాత్రి 11.30 గంటలకు బయల్దేరాడు. కోటిలింగాల దేవాలయం సమీపంలోకి రాగా గుర్తుతెలియని వ్యక్తులు అతడిపై పెట్రోల్ పోసి నిప్పంటించారు. దీంతో అతడు అదే వాహనంపై ఎన్‌టీఆర్ నగర్‌కు చేరుకొని కేకలు వేశాడు. వెంటనే కాలనీ వాసులు వచ్చి కాపాడేందుకు ప్రయత్నించారు. తనను కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులే పెట్రోల్ పోసి కాల్చారని చెప్పాడు. వెంటనే అతడిని వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించారు.

# భూత్పూర్‌లోని పౌల్ట్రీఫారంపై ఈగల్ ఫోర్స్ దాడి.

**హైదరాబాద్, జులై 19:** మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్‌లోని పౌల్ట్రీ ఫారంపై ఈగల్ ఫోర్స్, నార్కోటిక్స్ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన దాడుల్లో అక్రమంగా తయారు చేస్తున్న కిలోకు పైగా అల్ప్రాజోలంను స్వాధీనం చేసుకున్నారు. అందుకు సంబంధించి మొత్తం 35 మందిని గుర్తించారు. వారిలో 12 మందిని అరెస్ట్ చేశారు. మరో 23 మంది పరారీలో ఉన్నారు. వారి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. హైదరాబాద్ నార్కోటిక్స్ పోలీస్ స్టేషన్‌లో వారిపై క్రైమ్ నెం.20/2026 కేసు నమోదు చేశారు.ఈ కేసులో ప్రధాన నిందితుడు మలేలా జయప్రకాశ్ గౌడ్‌ను ఈగల్ ఫోర్స్ గుర్తించింది. 2025లో ఇదే కేసులో అతడు అరెస్టయ్యాడు. ఆరు నెలల పాటు జైలు శిక్ష అనుభవించారు. అనంతరం బెయిల్‌పై విడుదలై.. మళ్లీ డ్రగ్స్ తయారు చేయడం ప్రారంభించినట్లు ఈగల్ ఫోర్స్ గుర్తించింది. అలాగే ఇదే కేసులో కృష్ణయ్య గౌడ్ కీలక నిందితుడుగా ఉన్నారని తెలిపింది. అతడు కూడా పరారీలో ఉన్నాడని పేర్కొంది. అతడు పలుమార్లు ముందస్తు బెయిల్ కోసం కోర్టును ఆశ్రయించాడని వెల్లడించింది.తాటి కల్లులో కల్తీ కోసం ఈ అల్ప్రాజోలం తయారు చేస్తున్నట్లు ఈ దర్యాప్తులో నిందితులు వెల్లడించారని ఈగల ఫోర్స్ తెలిపింది. పౌల్ట్రీ పారంలో ఈ అల్ప్రాజోలం తయారీ యూనిట్‌ను ధ్వంసం చేసింది. ఇక పరారీలో ఉన్న వారిలో రసాయనాల సరఫరాదారులు, వ్యాపారులు కూడా ఉన్నట్లు గుర్తించింది. జీడిమెట్ల, ప్రశాంత్‌నగర్, ఫతేనగర్, బాలానగర్ ప్రాంతాల నుంచి ఈ రసాయనాల సరఫరా చేసినట్లు కనుగొంది. డ్రగ్స్ తయారీకి అవసరమైన రసాయనాలు సరఫరా చేసిన వారిపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని ఈగల్ ఫోర్స్ వివరించింది.

# తరగతుల వారిగా ట్యూషన్ ఫీజు వివరాలను వెబ్‌సైట్‌లో పొందుపరచాలి

**హైదరాబాద్ :**రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులను నియంత్రించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చట్టం చేసే పనిలో ఉంది. ఈ నేపథ్యంలో పాంశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ ఒక ఆదేశం జారీ చేశారు. దీని ప్రకారం పాఠశాలలు ప్రస్తుత విద్యా సంవత్సరానికి (2026-27) సంబంధించిన తరగతుల వారీగా వసూలు చేసే ట్యూషన్ ఫీజు వివరాలను తమ నోటీసు బోర్డులు, వెబ్‌సైట్‌లలో తప్పనిసరిగా ప్రదర్శించాలి. అలాగే 2023-24, 2024-25 విద్యా సంవత్సరాలకు సంబంధించిన వార్షిక పరిపాలనా నివేదికలు చార్టర్డ్ అకౌంటెంట్ ధృవీకరించిన ఆడిట్ నివేదికలను, ఈ నెల 30వ తేదీలోపు పాఠశాల విద్యాశాఖ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని ఆయన ఆదేశించారు.సమర్పించకపోతే షోకాజ్ నోటీసులు :




ఉమ్మడి రాష్ట్రంలో 1994 జనవరి 1న జారీ చేసిన జీవో నం.1 ప్రకారం పాఠశా లలు ఏటా విద్యాశాఖకు ఆడిట్ నివేదికలను సమర్పించాల్సి ఉంటుంది. అయితే ఇన్ని సంవత్సరాలు విద్యాశాఖ వాటిని అడగలేదు. అలాగే పాఠశాలలు కూడా సమర్పించలేదు. ఇప్పుడు వాటిని సమర్పించాలంటూ అధికారిక ఆదేశాలు జారీ కావడం గమనార్హం. గడువులోగా నివేదికలు సమర్పించకపోతే సంబంధిత పాఠశాలలకు షోకాజ్ నోటీసులు జారీ చేసి, చర్యలు తీసుకోవాలని నవీన్ నికోలస్ ప్రాంతీయ సంయుక్త డైరెక్టర్లు, జిల్లా విద్యాశాఖ అధికారులకు స్పష్టం చేశారు.ఇప్పుడే ఎందుకు? : రాష్ట్రవ్యాప్తంగా 12,000 ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో చాలా పాఠశాలలు ఏటా ఇష్టానుసారంగా ఫీజులను పెంచుతున్నాయని, తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనివల్ల ఈ ఫీజులను నియంత్రించేందుకు చట్టం తీసుకురావాలని ప్రభుత్వం రెండేళ్ల క్రితమే నిర్ణయించింది. రెండేళ్లకు ఒకసారి 8 శాతం ఫీజు పెంపును ప్రతిపాదిస్తూ ఏడాదిన్నర క్రితమే ముసాయిదా బిల్లును సిద్ధం చేశారు. ప్రజల నుంచి సూచనలు, అభిప్రాయాలను స్వీకరించేందుకు ఈ ముసాయిదాను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత ఫిబ్రవరిలో ఆదేశించారు. కానీ అది ఇంకా కార్యరూపం దాల్చలేదు.2027-28 నాటికి ఫీజు నియంత్రణ చట్టం : ఇటీవల ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి ఎన్ శ్రీధర్ అధికారులతో ఫీజు నియంత్రణపై చర్చించి ప్రస్తుత ఫీజు వివరాలతోపాటు ఇతర సంబంధిత సమాచారాన్ని సేకరించాలని ఆదేశించినట్లు సమాచారం. అదేవిధంగా తరగతుల వారీగా ఫీజు వివరాలను ప్రదర్శించాలని ఆడిట్ నివేదికలను సమర్పించాలని పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. మరోవైపు ముసాయిదా బిల్లుపై ప్రజల అభిప్రాయాలను సేకరించి మంత్రివర్గంలో చర్చించిన తర్వాత ప్రవేశపెట్టాలని ప్రభుత్వం యోచిస్తోంది.

## జగన్ క్రెడిట్ చోరీగా మిగిలిపోతారు.. మంత్రి కొండపల్లి సెటైర్లు




**విజయనగరం, జులై 19 :** ప్రపంచంలోనే అత్యాద్భుత విమానాశ్రయాల్లో భోగాపురం ఒకటని ఆంధ్రప్రదేశ్ మంత్రి కొండపల్లి శ్రీనివాసవ్యాఖ్యానించారు. ఎర్ర బస్సు కూడా లేని భోగాపురానికి ఎయిర్ బస్సు ఎందుకని జగన్ రెడ్డి ప్రశ్నించారని ధ్వజమెత్తారు. ఆయన క్రెడిట్ చోరీగా మిగిలిపోతారని ఎద్దేవా చేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ విజయనగరం జిల్లా పర్యటన ఖరారు నేపథ్యంలో ఆయా ఏర్పాట్లకు శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలో భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రాంగణాన్ని మంత్రి కొండపల్లి, ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు, ఎమ్మెల్యే నాగమాధవి, జిల్లా కలెక్టర్ రాంసుం దరరెడ్డి, జిల్లా ఎస్పీ దామోదర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి మాట్లాడారు. భోగాపురం విమానాశ్రయా నిర్మాణ ఖ్యాతి మోదీ, చంద్రబాబు, అశోక్ గజపతి రాజు, రామ్మోహన్ నాయుడుకి దక్కుతుందని తెలిపారు. ఇప్పటికే విశాఖపట్నం, విజయ నగరం, శ్రీకాకుళంలో జాతీయ రహదారులు అందుబాటులోకి వచ్చాయని వెల్లడించారు. ఉత్తరాంధ్ర ప్రగతికి మూలకారకులైన మోదీ, చంద్రబాబు, పవన్ కల్యాణ్‌కు ప్రజల తరుపున కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు.

## ఆర్థిక ప్రణాళికతోనే "సిరి" సంపదలు - మదుపర్ల సందేహాలు నివృత్తి



**తిరుపతి:** తిరుపతిలో జరిగిన సిరి మదుపరుల అవగాహన సదస్సుకు విశేష స్పందన లభించింది. నగరంలోని ఓ హోటల్లో ఈనాడు సిరి ఇన్వెస్టర్స్ క్లబ్, ఆదిత్య బిర్లా సన్ లైఫ్ మ్యూచువల్ ఫండ్ సంయుక్తంగా సదస్సు నిర్వహించాయి. ఈ కార్యక్రమానికి నగరవాసులు భారీగా తరలివచ్చారు. ఈ సదస్సుకు హాజరైన ఆర్థిక నిపుణులు ప్రస్తుత మార్కెట్ పరిస్థితుల్లో పెట్టుబడి అవకాశాలు, క్రమానుగత పెట్టుబడుల ద్వారా ఆర్థిక లక్ష్యాలను చేరుకోవడం, మ్యూచువల్ ఫండ్ల సాయంతో ఆర్థికంగా స్థిరత్వం సాధించడంపై నగరవాసులకు అవగాహన కల్పించారు. భవిష్యత్తు అవసరాలకు తగ్గట్టుగా ప్రతి ఒక్కరూ ఆర్థిక ప్రణాళికలను ఏ విధంగా రచించుకోవాలనే దానిపై పలు సూచనలు చేశారు. పెట్టుబడి అవకాశాలు, మ్యూచువల్ ఫండ్స్‌పై తమకున్న పలు అనుమానాలను నగరవాసులు ఈ సదస్సు ద్వారా నివృత్తి చేసుకున్నారుమదుపర్ల సందేశాలు నివృత్తి: ఏఎంఎఫ్ఐ సర్టిఫైడ్ డిస్ట్రిబ్యూటర్లు శ్రీకాంత్‌రెడ్డి, సురేష్ రాయల్‌తో రాజేంద్ర ప్రత్యేక చర్చా కార్యక్రమం నిర్వహించారు. పెట్టుబడులు మధ్యలో ఉపసంహరించుకోవడం వల్ల కాంపౌండింగ్ వెసులుబాటు లేకుండా పోతుందని, తద్వారా నష్టపోతున్న విధానాన్ని వివరించారు. సెబీ పర్యవేక్షణలోని పెట్టుబడుల భద్రత, అసెట్ అలకేషన్ తదితర అంశాల గురించి విశ్లేషిస్తూ పలువురు మదుపర్ల సందేహాలను నివృత్తి చేశారు. 68 శాతం పెరుగుదల: తిరుపతిలో ప్రతినెలా మదుపర్లు రూ.55 కోట్లు మ్యూచువల్ ఫండ్లలో పెట్టుబడిగా పెడుతున్నారని ఆదిత్యబిర్లా సన్‌లైఫ్ ఏఎంసీ లిమిటెడ్ ఇన్వెస్టర్ ఎడ్యుకేషన్ డిస్ట్రిబ్యూషన్ డెవలప్‌మెంట్ హెడ్ సిద్ధార్థ దమానీ తెలిపారు. ప్రస్తుతం ఇక్కడి నుంచి రూ.7,050 కోట్ల పెట్టుబడులు వివిధ ఫండ్‌లలో కొనసాగుతున్నాయని వెల్లడించారు. రాష్ట్రంలో తిరుపతి 5వ స్థానంలో ఉందన్నారు. గతేడాది కంటే 68 శాతం పెట్టుబడుల వాటా పెరిగినట్లు ఆయన ప్రకటించారు. దేశీయ మార్కెట్ పురోగమిస్తున్నందున మ్యూచువల్ ఫండ్‌లలో పెట్టుబడులు స్థిరంగా వృద్ధి చెందుతాయని చెప్పారు. "వివిధ వయసుల వారు ఆర్థికంగా స్థిరపడటానికి ఏయే పద్ధతుల్లో పెట్టుబడులు పెట్టాలనే అంశంపై సదస్సులో కూలంకషంగా చర్చించాం. లాంగ్ టర్మ్, మీడియం టర్మ్, షార్ట్ టర్మ్ లక్ష్యాలను ఎలా నిర్దేశించుకోవాలి? వాటి సాధనకు మ్యూచువల్ ఫండ్లు ఏ విధంగా ఉపయోగపడతాయనే విషయాలపై తిరుపతి వాసులకు పూర్తి అవగాహన కల్పించాం. ఈ కార్యక్రమానికి స్థానికుల నుంచి అనూహ్య స్పందన లభించింది. పెద్ద సంఖ్యలో హాజరైన వారికి ఉన్న ఆర్థికపరమైన సందేహాలను అడిగి నివృత్తి చేసుకున్నారు" - సురేష్ రాయల్, మ్యూచువల్ ఫండ్ డిస్ట్రిబ్యూటర్15 ఏళ్ల కిందట ఓ సినిమాని రూ.20 టిక్కెట్‌తో బాల్కనీలో కూర్చొని చూసేవాళ్లం. కానీ ఇప్పుడు అదే సినిమా మళ్లీ విడుదలైతే రూ.300 పెట్టి చూడాల్సి వస్తోందని ఆదిత్య బిర్లా సన్‌లైఫ్ ఏఎంసీ లిమిటెడ్ ఇన్వెస్టర్ ఎడ్యుకేషన్, డిస్ట్రిబ్యూషన్ డెవలప్‌మెంట్ జోనల్ మేనేజర్ రాజేంద్ర అన్నారు. డబ్బుకు కొనుగోలుశక్తి తగ్గిపోయినందున ఎక్కువ డబ్బుపెట్టి సేవలు పొందాల్సి వస్తోందన్నారు. మన కొనుగోలుశక్తి పెంచుకోవడానికి పెట్టుబడులే శరణ్యమని తెలిపారు. మన డబ్బు మన కోసం పనిచేస్తేనే ఎదుగుదల సాధ్యమని మదుపర్లకు వివరించారు. 20 ఏళ్లలో అవసరాలు, ఖర్చులను దృష్టిలో ఉంచుకుని క్రమబద్ధమైన పెట్టుబడులు దీర్ఘకాలం పెట్టినప్పుడే లక్ష్యాన్ని అందుకోగలమని రాజేంద్ర వివరించారు.

## మళ్లీ 'కరోనా' కలకలం పెరుగుతోన్న కేసులు దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులు జాగ్రత్త పడాల్సిందే



కరోనా మహమ్మారి మరోసారి విజృంభిస్తోంది. ఏపీ, కర్ణాటక, కేరళ రాష్ట్రాల్లో కేసుల సంఖ్య పెరుగుతోంది. ఈ నేపథ్యంలో దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు ఉన్నవారు అప్రమత్తంగా ఉండాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. కరోనా లక్షణాలతో ఏపీలో నలుగురు మృతి చెందినట్లు అధికారులు ప్రకటించారు. వారంతా దీర్ఘకాలిక వ్యాధులతో బాధ పడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ క్రమంలో మధుమేహం, దీర్ఘకాలంగా స్టెరాయిడ్లు తీసుకుంటున్న వారు, క్యాన్సర్‌కు చికిత్స తీసుకుంటున్న రోగులు, ఆస్తమా, సీవోపీడీ వంటి వాటితో బాధపడుతున్న వారు మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, పిల్లలు, వృద్ధులు, గర్భిణుల విషయంలో కూడా అప్రమత్తంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. ఇదిలా ఉండగా, ప్రస్తుతం కనిపిస్తున్న వైరస్ వేరియంట్‌ను గుర్తించేందుకు శాంపిళ్లను పుణె ల్యాబ్‌కు పంపారు. అయితే దీని గురించి పెద్దగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్యులు చెబుతున్నారు. కరోనా ఎండెమిక్ స్థాయిలో ఉండటం వల్ల వ్యాప్తి కూడా తక్కువగా ఉంటుందన్నారు. అప్రమత్తత అవసరం : 'తాజాగా రాష్ట్రాల్లో కరోనా కేసులు నెమ్మదిగా పెరుగుతున్నాయి. కానీ తెలంగాణలో మాత్రం ఇప్పటి వరకు ఎలాంటి కేసు నమోదు కాలేదు. గాంధీలో భారీ సంఖ్యలో రోగులకు చికిత్స చేసిన అపార అనుభవం ఉంది. ఒకవేళ కేసులు పెరిగితే ఉస్మానియా, గాంధీ ఆసుపత్రుల్లో ప్రత్యేక ఏర్పాట్లు ఉంటాయి. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారిపై కరోనా ఎక్కువ ప్రభావం చూపుతుంది. ఇలాంటి వారు గుంపుల్లోకి వెళితే మాస్క్ ధరించడం తప్పనిసరి' అని ఉస్మానియా మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రాజారావు తెలిపారు. 'చేతి శుభ్రత పాటించాలి. ఎక్కువ మంది గుమిగూడే చోటుకు వెళ్లకూడదు. అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు వాయిదా వేసుకోవడం మంచిది. ఏడాదికి ఒకసారి ఫ్లూ, న్యూమోకోకల్ వ్యాక్సిన్లు తీసుకోవాలి. ఇక చిన్న పిల్లలు, వృద్ధులు తప్పకుండా ఈ టీకాలు తీసుకోవడం ద్వారా కరోనా నుంచి రక్షణ ఉంటుంద'ని జాగ్రత్తలు సూచించారు. మరిన్ని జాగ్రత్తలు :రోజూ కనీసం 45 నిమిషాల పాటు వ్యాయామం చేయాలి. సరైన నిద్ర, నీళ్లు తాగడం, ఒత్తిడి తగ్గించుకోవడం, సమతుల ఆహారంతో వ్యాధి నిరోధక శక్తి తగ్గకుండా చూసుకోవాలి. తీవ్రమైన జ్వరం, నొప్పులు, కడుపులో నొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, శరీరంలో ఆక్సిజన్ శాతం తగ్గడం లాంటి లక్షణాలు ఉంటే మాత్రం నిర్లక్ష్యం చేయకుండా ఆసుపత్రిలో చేర్పించాలి. ఆర్ఎఫ్.5 వేరియంట్‌తో కొత్త కేసులు : ఏపీలో జూన్ 26 నుంచి జులై 16 వరకు నాలుగు జిల్లాల్లో 12 కొవిడ్? కేసులు నమోదైనట్లు ఆ రాష్ట్ర వైద్యారోగ్య శాఖ ప్రకటించిన విషయం తెలిసిందే. వేర్వేరు ప్రాంతాల్లో కొవిడ్? కేసులు వెలుగు చూశాయని, ఒకే చోట గుంపుగా బయటపడలేదని స్పష్టం చేసింది. జీనోమ్ సీక్వెన్సింగ్ కోసం పుణె ల్యాబ్‌కు నమూనాలు పంపించగా, వాటిలో నాలుగింటి ఫలితాలు శనివారం వెల్లడయ్యాయి. దానిలో ఒమిక్రాన్ ఆర్ఎఫ్.5 వేరియంట్‌ను గుర్తించినట్లు అధికారులు పేర్కొన్నారు. సింగపూర్, ఆగ్నేయా యా దేశాల్లో ఈ ఆర్ఎఫ్.5 కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచించారు.

## ఇచ్చిన మాట నిలబెట్టుకున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్



**అమరావతి, జులై 19:** బల్లగరువు పర్యటనలో ఇచ్చిన హామీని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నిలబెట్టుకున్నారు. ఇటీవల బల్లగరువు పర్యటన సందర్భంగా గ్రామ ప్రజలకు ఇచ్చిన హామీని కార్యరూపంలోకి తీసుకొచ్చారు. ఉపాధి హామీ నిధులను సమర్థవంతంగా వినియోగిస్తూ గ్రామంలో సుమారు కోటి రూపాయల విలువైన పలు అభివృద్ధి పనులను పూర్తి చేయించారు. గ్రామ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తూ అంగన్వాడీ కేంద్రాల నిర్మాణం, తాగునీటి వసతులు, సీసీ రోడ్ల నిర్మాణం వంటి పనులను పూర్తి చేయించారు. గ్రామంలోని చిన్నారులు, మహిళల విజ్ఞప్తి మేరకు రూ.55 లక్షల వ్యయంతో మూడు కొత్త అంగన్వాడీ భవనాలను నిర్మించారు. అలాగే తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారంగా బోరు ఏర్పాటు చేసి, నీటి సరఫరా కోసం పైప్‌లైన్లను నిర్మించారు. గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణంతో రవాణా సౌకర్యాలు కూడా మెరుగుపడ్డాయి. గిరిజన ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పవన్ కల్యాణ్ తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనతో పాటు గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

## మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం కుటుంబంపై భూ ఆక్రమణ కేసు



**శ్రీకాకుళం, జులై 19:** వైసీపీ నేత, ఏపీ అసెంబ్లీ మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాంతోపాటు ఆయన కుటుంబ సభ్యులపై శ్రీకాకుళం రూరల్ పోలీస్ స్టేషన్‌లో పోలీసులు నమోదు చేశారు. సీతారాం, ఆయన సతీమణి వాణితోపాటు వారి కుమారుడు చిరంజీవి నాగ్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. చాపురంలోని సత్యసాయినగ ర్‌లో రూ. 4 కోట్ల విలువైన భూమిని సీతారాం కుటుంబం నకిలీ పత్రాలతో రిజిస్ట్రేషన్ చేయిం చుకుందంటూ జులై 15వ తేదీన పోలీసులకు ఫిర్యాదు అందింది. బాధితుడి ఫిర్యాదు ఆధార ంగా వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఇప్పటి వరకు 8 మందిని పోలీ సులు అరెస్ట్ చేశారు. ఈ ప్రాంతంలో గతంలో సబ్ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహించిన అరుణపై కూడా పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే ఆ కుటుంబం రిజిస్ట్రేషన్ చేయించుకున్న భూమి యజమాని గోవింరాజులు. అతడి పేరిట 900 గజాల స్థలం ఉంది. ఆయన బతికి ఉండగానే.. మరణ ధ్రువీకరణ పత్రాలు సృష్టించి.. ఆమదాలవలసలో భూమిని తమ్మినేని సీతారాం కుటుంబం రిజిస్ట్రేషన్ చేయించుకుంది. ఈ నేపథ్యంలో గోవిందరాజులు అల్లుడు కనకలిం గేశ్వరరావు పోలీసులను ఆశ్రయించాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అందులోభాగంగా తమ్మినేని సీతారాం ఫ్యామిలీపై కేసు నమోదు చేశారు.

## పోలవరం ప్రాజెక్టు పూర్తికి - 43 అంశాలతో చెక్ లిస్ట్



**పోలవరం:** పోలవరం ప్రాజెక్టును 2027 మార్చికి పూర్తిచేసే లక్ష్యంగా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈ నేపథ్యంలోనే అధికారులు సూక్ష్మస్థాయి ప్రణాళిక సిద్ధం చేశారు. ఇందులో భాగంగా మొత్తం 43 అంశాలను గుర్తించారు. వీటి పూర్తికి ఇంకా 8 నెలలే గడువుంది. వీటిలో ప్రధాన డ్యాం గ్యాప్ 1, గ్యాప్ 2 పూర్తిచేయడంలో ఇంకా వివిధ దశలు ఉన్నాయి. డిజైన్లు, అవసరమైన మెటీరియల్ సమీకరణ, స్పిల్ వే సుందరీకరణ, ఎడమ, కుడి కాలువలతో అనుసంధాన పనులు, పోలవరం స్పిల్ వేకు సమాంతరంగా ఎడమ, కుడి గట్టులను కలిపేలా ఐకానిక్ వంతెన, కేబుల్ వంతెన నిర్మించాలి. దీంతోపాటు కుడి, ఎడమ కాలువల అనుసంధాన పనులు, ఆ రెండు కాలువల్లో మిగిలి ఉన్న పనులు సహా మొత్తం 43 అంశాలను సూక్ష్మ ప్రణాళికలో పొందుపరిచారు. ప్రధాన డ్యాంలో డిజైన్ల పెండింగ్ అంశాల నుంచి అన్నింటికీ స్థానం కల్పించారు. ఇందులో ప్రధాన డ్యాంతో పాటు అనుబంధ పనుల ప్రణాళిక ఈ విధంగా ఉంది. వీటిలో గ్యాప్ 1, గ్యాప్ 2 డ్యాంల నిర్మాణం పూర్తిచేయడమే అన్నింటికన్నా ముఖ్యమైన లక్ష్యంగా పెట్టుకున్నారు. గ్యాప్ 2 డ్యాంలో కుడి డ్యాం అబెట్‌మెంట్ పనులకు డిజైన్లు సమర్పించారు. జులై నెలాఖరుకు వీటికి అనుమతులు వస్తాయని భావిస్తున్నారు. ఇదే డ్యాంకు సంబంధించి ప్రస్తుతం ం23.32 మీటర్ల స్థాయి వరకే అనుమతులు లభించాయి. ఆపైన ం53.32 మీటర్ల వరకు డిజైన్లను కేంద్ర జలసంఘానికి సమర్పించారు. ఈ నెలలో వీటి అనుమతులు వస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు. మరోవైపు గ్యాప్ 2 ప్రధాన డ్యాంలో 80 మీటర్ల చైనేజి నుంచి 1450 మీటర్ల చైనేజి వరకు పనుల తీరుపై అధికారులు సంతృప్తిగా ఉన్నారు. ప్రస్తుతం ం17 మీటర్ల స్థాయి నుంచి ం23.32 మీటర్ల ఎత్తు వరకు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. జులై నెలాఖరుకు గ్యాప్ 2 డ్యాం మొత్తం ఈ స్థాయికి తీసుకొచ్చి ం53.32 మీటర్ల ఎత్తుకు పనులు మొదలు పెట్టాలి. ం23 మీటర్ల స్థాయికి పనులు పూర్తయితే గోదావరి సీపేజీ నీటి నుంచి కూడా పనులకు ఇబ్బంది లేకుండా మిగిలిన పై భాగం సులభంగా చేసుకోవచ్చునేది ఉద్దేశం. గ్యాప్ 1 డ్యాం నిర్మాణం ం33 మీటర్ల వరకు పూర్తయింది. ఆ పై నుంచి ం53.32 మీటర్ల వరకు పనులు చేపట్టారు. ఇది 2027 మార్చి నాటికి పూర్తిచేయాలనేది లక్ష్యం. మరోవైపు ప్రధాన డ్యాం గ్యాప్ 1, 2 పూర్తిచేసేందుకు ఇంకా మెటీరియల్ అవసరం. అంటే 8.75 లక్షల క్యూబిక్ మీటర్ల మేర మట్టి మొత్తమ్మీద అవసరం అనుకుంటే ఇప్పటివరకు 2.66 లక్షల క్యూబిక్ మీటర్లు వినియోగించారు. 2.54 లక్షల క్యూబిక్ మీటర్లు డ్యాం వద్ద సిద్ధంగా ఉంది. కావాల్సిన మట్టిలో జులై నెలాఖరుకు మరో 1.50 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి సమీకరిస్తారు. 2027 జనవరి నాటికి 2.05 లక్షల క్యూబిక్ మీటర్లు సిద్ధం చేయనున్నారు. 49.20 లక్షల క్యూబిక్ మీటర్ల రాయి అవసరం. ఇప్పటివరకు 8.70 లక్షల క్యూబిక్ మీటర్లు వినియోగించారు. 13.10 లక్షల క్యూబిక్ మీటర్లు డ్యాం క్షేత్రం వద్ద సిద్ధంగా ఉంది. 2026 డిసెంబర్ నాటికి దశలవారీగా మిగిలిన రాయి కూడా సమీకరిస్తారు. గేట్ల ఆపరేషన్ షెడ్యూల్ : పోలవరం ప్రాజెక్టు ప్రారంభించే సమయానికి గేట్ల ఆపరేషన్ షెడ్యూల్ సిద్ధంగా ఉంచుకోవాలి. ఐఐటీ రూర్కీ నిపుణులు ఈ ప్రణాళికను ప్రిపేర్ చేస్తున్నారు. 2026 డిసెంబర్‌కు సిద్ధం చేయాలనేది లక్ష్యం. మరోవైపు గ్యాంట్రీ, గేట్లకు సంబంధించి పెండింగ్ పనులు కొనసాగుతున్నాయి. ఈ సంవత్సరం చివరికి పూర్తిచేస్తారు. గేట్ల నిర్వహణకు స్కాడా వ్యవస్థతో పాటు కంట్రోల్ రూం ఏర్పాటు పనులూ సాగుతున్నాయి. అప్రోచ్ ఛానల్, స్పిల్ ఛానల్ పెండింగ్ పనులతో పాటు పైడిపాక కొండవద్ద గ్యాప్‌ను పూడ్చేయాలని భావిస్తున్నారు. ఈ అంశం పోలవరం ప్రాజెక్టు అథారిటీ పరిశీలనలో ఉంది.

## రాయలసీమకు అసలైన ముద్దుబిడ్డ ఎన్టీ రామారావు



**కర్నూలు, జులై 19:** రాయలసీమ ఉద్యమం చచ్చేది కాదని.. రోజురోజుకూ బలపడుతూనే ఉంటుందని టీడీపీ నేత, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి స్పష్టం చేశారు. రాయలసీమ కోసం ప్రాణాలు ఇవ్వడానికైనా తాను సిద్ధమని అన్నారు. నేడు రాయలసీమ ముద్దుబిడ్డపై పోటీ జరుగుతోందని తెలిపారు. రాయలసీమకు అసలైన ముద్దుబిడ్డ ఎన్టీ రామారావు అని ఆయన గుర్తు చేశారు. ఆదివారం కర్నూలులోని టీజీవీ కళాక్షేత్రంలో స్థానిక ప్రముఖ రచయిత పత్తి ఓబులయ్య రచించిన 'సీమ రైతు కన్నీటి వేత' పుస్తకాన్ని మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్‌తో కలిసి బైరెడ్డి రాజశేఖరరెడ్డి ఆవిష్కరించారు. అనంతరం బైరెడ్డి రాజశేఖరరెడ్డి మాట్లాడుతూ.. రాయలసీమ ప్రాంతంలోని సంస్కృతిని కొందరు పాడు చేస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. రాయలసీమకు న్యాయం జరిగేంత వరకు ఉద్యమం ఆగదన్నారు. రాయలసీమలో పుట్టడం తన అదృష్టమని చెప్పారు. రాయలసీమలో చారిత్రాత్మక నేపథ్యం ఉన్న చాలా గ్రామాల పేర్లు మారాయని పేర్కొన్నారు. వాటి పేర్ల మార్చాలని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడుకు ఆయన విజ్ఞప్తి చేశారు. రాయల సీమలో అపారమైన సహజ సంపద, విలువైన ఖనిజాలతోపాటు పవిత్రమైన నదులు కూడా ఉన్నాయని వివరించారు. రాయలసీమకు అన్యాయం జరిగినప్పుడు తాను, టీజీ వెంకటేశ్ గళాన్ని వినిపిస్తామని అన్నారు. ఆసియాలోనే అత్యంత వెనుకబడిన ప్రాంతం రాయలసీమ అని వివరించారు. రాయలసీమ అనేది సెంటిమెంటల్ ఇష్యూ అని తెలిపారు. ఏదో ఓ రోజు రాయలసీమ డిమాండ్ పెరుగుతుందని జోస్యం చెప్పారు. టీజీ వెంకటేష్ తాను ఒకే వేదికపైకి రావడం గొప్ప విషయమని పేర్కొన్నారు. తాము రాయలసీమ నినాదం చేస్తున్నామని.. ఇది ఎంతవరకు వెళ్తుందో తెలియదని అన్నారు. రాయలసీమపై ప్రేమ అభిమానాన్ని ఇద్దరం ప్రజల్లోకి తీసుకెళ్లామని బైరెడ్డి రాజశేఖరరెడ్డి వివరించారు.

## అయోధ్య -- కాశీ దివ్య దర్శన యాత్ర తొలి విడతను ప్రారంభించాం

**అనకాపల్లి జిల్లా, జులై 19 :** అయోధ్య -- కాశీ దివ్య దర్శన యాత్ర తొలి విడతను ప్రారంభించామని అనకాపల్లి జిల్లా ఎంపీ సీఎం రమేశ్ (వ్యాఖ్యానించారు. అనకాపల్లి పార్లమెంట్ నుంచి సుమారు 1600 మందిని దివ్యదర్శన యాత్రకు తీసుకెళ్తున్నామని పేర్కొన్నారు. భారతదేశ చరిత్రలో ఒక నియోజకవర్గం నుంచి దివ్య దర్శన యాత్రకు తీసుకెళ్లడం ఇదే మొదటిసారని వెల్లడించారు. తనకు ఈ అవకాశం దక్కడం సంతోషంగా ఉందని చెప్పుకొచ్చారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సొంత నిధులతో దివ్య దర్శన యాత్రకు తీసుకెళ్తున్నామని వివరించారు. భక్తులకు ఉచిత ప్రయాణంతో పాటు వసతి, దర్శనం కల్పిస్తున్నామని ఎంపీ రమేశ్ తెలిపారు. అనకాపల్లి పార్లమెంట్ నుంచి భవిష్యత్తులో మరెన్నో దివ్య దర్శన యాత్రలు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ సహాయం, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చొరవతో ఏపీ అభివృద్ధి బాటలో ముందుకెళ్తుందని చెప్పారు. అనకాపల్లి జిల్లా శరవేగంగా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. అనేక పరిశ్రమలు అనకాపల్లికి వస్తున్నాయని ఎంపీ రమేశ్ పేర్కొన్నారు.

నీలగిరి ఎక్స్‌ప్రెస్
సోమవారం,
జూలై 20, 2026



# హిట్‌మ్యాన్‌కు అండగా నిలిచిన టీమ్ మేనేజ్‌మెంట్.




టీమిండియా స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించబోతున్నాడంటూ గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో, క్రీడా వర్గాలలో విపరీతంగా ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా ప్రతిష్టాత్మక లార్డ్స్ మైదానంలో జరగబోయే మ్యాచ్‌తో రోహిత్ తన సుదీర్ఘ కెరీర్‌కు ముగింపు పలకబోతున్నాడనే వార్తలు అభిమానులను తీవ్ర ఆందోళనకు గురిచేశాయి. అయితే ఈ ఊహాగానాలకు బీసీసీఐ శనివారం ఒక అధికారిక ప్రకటనతో పూర్తిగా అడ్డుకట్ట వేసింది. మీడియాలో వస్తున్న వార్తలన్నీ కేవలం పుకార్లేనని వాటిలో ఎలాంటి వాస్తవం లేదని బోర్డు తేల్చిచెప్పింది. హిట్‌మ్యాన్ ఫ్యాన్స్‌కు అదిరిపోయే గుడ్ న్యూస్ఈ రిటైర్మెంట్ పుకార్లపై బీసీసీఐ సెక్రటరీ దేవజిత్ సైకియా స్పందిస్తూ స్పష్టతనిచ్చారు. లార్డ్స్ స్టేడియంలో రోహిత్ శర్మ తన కెరీర్‌లో చివరి మ్యాచ్ ఆడబోతున్నాడనే విషయంపై బోర్డు అంతర్గతంగా ఎలాంటి చర్చలు జరపలేదని ఆయన స్పష్టం చేశారు. అవన్నీ సోషల్ మీడియా సృష్టించిన అబద్ధాలని కొట్టిపారేశారు. టీమిండియా భవిష్యత్తు ప్రణాళికల్లో రోహిత్ శర్మ ఇప్పటికీ అత్యంత కీలకమైన భాగమని, జట్టు వ్యూహాల్లో ఉన్నంత కాలం అతను అంతర్జాతీయ క్రికెట్‌లో కొనసాగుతూనే ఉంటాడని సైకియా తేల్చిచెప్పారు. దీంతో హిట్‌మ్యాన్ అభిమానులు ఊపిరి పీల్చుకున్నారు. ఇంగ్లాండ్ సిరీస్‌లో నెమ్మది ంచిన రోహిత్ బ్యాటింగ్బీసీసీఐ రిటైర్మెంట్ వార్తలను ఖండించిన మరుసటి రోజే టీమిండియా బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ కూడా కెప్టెన్ రోహిత్‌కు పూర్తి మద్దతుగా నిలిచారు. ప్రస్తుతం ఇంగ్లాండ్‌తో జరుగుతున్న సిరీస్‌లో రోహిత్ ఆశించిన స్థాయిలో రాణించలేకపో తున్నాడు. మొదటి రెండు ఇన్నింగ్స్‌లలో కలిపి అతను కేవలం 37 పరుగులు మాత్రమే చేయగలిగాడు. మొదటి మ్యాచ్‌లో 21 బంతులు ఎదుర్కొని 11 పరుగులు చేయగా, రెండో మ్యాచ్‌లో 47 బంతుల్లో 26 పరుగులు మాత్రమే చేశాడు. పరుగులు తక్కువగా చేయడమే కాకుండా, ఈ సిరీస్‌లో అతని స్ట్రైక్ రేట్ కేవలం 54 గా ఉండటం క్రీడా విశ్లేషకులను సైతం ఆశ్చర్యానికి గురిచేస్తోంది.

కెప్టెన్ వెనక అండగా నిలిచిన టీమ్ మేనేజ్‌మెంట్రోహిత్ శర్మ ప్రస్తుత బ్యాటింగ్ ఫామ్‌పై విమర్శలు వస్తున్నప్పటికీ, బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ మాత్రం హిట్‌మ్యాన్‌పై పూర్తి నమ్మకాన్ని వ్యక్తంచేశారు. క్రికెట్‌లో కొత్త బంతితో ఇన్నింగ్స్ ప్రారంభించి, ప్రత్యర్థి బౌలర్లను ఎదుర్కోవడం ఏ బ్యాటర్‌కైనా అంత రోహిత్ శర్మకు అంతర్జాతీయ క్రికెట్‌లో అపారమైన అనుభవం ఉందని, గతంలో కూడా ఇలాంటి ఎన్నో క్లిష్ట పరిస్థితులను ఫామ్

# ఛీ.. ఇదేం వరల్డ్ కప్ ఫార్మాట్! ఐసీసీపై కెప్టెన్ల మండిపాటు



2027 వన్డే వరల్డ్ కప్ కోసం ప్రకటించిన కొత్త ఫార్మాట్‌పై అంతర్జాతీయ క్రికెట్ వర్గాల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. ముఖ్యంగా అసోసియేట్ దేశాల కెప్టెన్లు, పలువురు అంతర్జాతీయ ఆటగాళ్లు ఈ ఫార్మాట్ చిన్న జట్ల అవకాశాలను గణనీయంగా తగ్గిస్తోందని ఆరోపిస్తున్నారు. ప్రపంచ క్రికెటర్ల సంఘం (ఔజూా) ద్వారా తమ అభిప్రాయాలను వెల్లడించిన వారు, ప్రపంచ క్రికెట్ అభివృద్ధి లక్ష్యాలకు ఈ నిర్ణయం విరుద్ధమని పేర్కొన్నారు. ఐసీసీ ఆమోదించిన కొత్త ఫార్మాట్ ప్రకారం.. అర్హత సాధించిన జట్లలో అత్యల్ప ర్యాంకులో ఉన్న మూడు జట్లు ముందుగా ప్రత్యేక సూపర్ సిరీస్ ఆడాల్సి ఉంటుంది. ఆ సిరీస్‌లో విజేతగా నిలిచిన ఒకే ఒక్క జట్టుకు మాత్రమే ప్రధాన 12 జట్ల ప్రపంచకప్‌లో స్థానం లభిస్తుంది. అనంతరం టోర్నమెంట్ సూపర్-7 దశలోకి ప్రవేశిస్తుంది. ఈ మార్పు వల్ల అసోసియేట్ దేశాలకు ప్రపంచకప్‌లో పోటీ పడే అవకాశాలు మరింత కష్టతరమవుతాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నెదర్లాండ్స్ కెప్టెన్ స్కాట్ ఎడ్వర్డ్స్ ఈ నిర్ణయాన్ని అత్యంత నిరాశపరిచేదిగా అభివర్ణించారు. ఒక దేశం ప్రపంచకప్‌కు అర్హత సాధించడానికి సంవత్సరాల పాటు ప్రణాళిక, పెట్టుబడి, కృషి చేస్తుందని, చివరకు అవకాశాలను తగ్గించే విధంగా నిబంధనలు మార్చడం సరైంది కాదన్నారు. ప్రపంచ క్రికెట్‌ను విస్తరించాలని ఐసీసీ చెబుతుంటే, చిన్న దేశాలకు ప్రపంచ వేదికపై అవకాశాలను తగ్గించడం ఆ లక్ష్యానికి విరుద్ధమని వ్యాఖ్యానించారు. ప్రపంచ క్రికెట్ నిజంగా అభివృద్ధి చెందాలంటే అవకాశాలు తగ్గించడం కాకుండా పెంచాలని ఆయన స్పష్టం చేశారు.నమీబియా కెప్టెన్ గెర్హార్డ్ ఎరాస్మస్ మాట్లాడుతూ.. అసోసియేట్ దేశాల ఆటగాళ్లకు వన్డే ప్రపంచకప్ అనేది కేవలం ఒక టోర్నమెంట్ కాదని, వారి కెరీర్‌లకు కేంద్రబిందువని అన్నారు. అత్యున్నత స్థాయిలో పోటీ పడే అవకాశం లభిస్తేనే చిన్న దేశాల్లో క్రికెట్ మరింత అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. ఐర్లాండ్ కెప్టెన్ పాల్ స్టిర్లింగ్ కూడా అసోసియేట్ దేశాలు ప్రపంచ స్థాయి టోర్నమెంట్లకు ప్రత్యేక ఆకర్షణ తీసుకొస్తాయని అన్నారు. ఇటీవల జరిగిన ఫుట్‌బాల్ ప్రపంచకప్‌లో చిన్న

# భారత్ తరపున టీ20ల్లో అరంగేట్రం చేసిన టాప్ 5

అత్యంత పిన్న వయస్కులైన ఆటగాళ్లు వీరే




ఐపీఎల్ ఎంతో మంది యువ ఆటగాళ్లకు టీమిండియా తరఫున అంతర్జాతీయ టీ20ల్లో ఆడేందుకు అద్భుతమైన అవకాశాలను కల్పించింది. అయితే బ్లూ జెర్సీ వేసుకుని తన మొదటి మ్యాచ్ ఆడకముందే సోషల్ మీడియా నుంచి క్రికెట్ పండితుల వరకు అందరి దృష్టిని ఆకర్షించిన వండర్ కిడ్ ఎవరైనా ఉన్నారా అంటే.. దానికి సమాధానం ఒక్కరే, తనే వైభవ్ సూర్యవంశీ. ఎప్పుడెప్పుడా అని అందరూ ఎదురుచూస్తున్న ఈ 15 ఏళ్ల యువ బ్యాటింగ్ సంచలనం ఎట్టకేలకు అంతర్జాతీయ క్రికెట్‌లోకి గ్రాండ్ ఎంట్రీ ఇచ్చాడు. ఇటీవల జరిగిన ఐపీఎల్ 2026 సీజన్ లో తన అద్భుతమైన ఆటతీరుతో దుమ్మురేపినందుకు గాను, ఐర్లాండ్, ఇంగ్లాండ్ పర్యటనలకు వెళ్లే భారత టీ20 జట్టులో ఈ చిన్నారికి చోటు లభించింది. సరికొత్త చరిత్ర సృష్టించిన వైభవ్ సూర్యవంశీ ఖచ్చితంగా 15 సంవత్సరాల 99 రోజుల వయస్సులోనే వైభవ్ సూర్యవంశీ టీమిండియా తరఫున టీ20 ఇంటర్నేషనల్స్ ఆడి, భారతదేశం తరఫున ఈ ఫార్మాట్‌లో ఆడిన అత్యంత పిన్న వయస్కుడిగా రికార్డులకెక్కాడు. 2026, జూలై 4న ఇంగ్లాండ్‌లోని ఓల్డ్ ట్రాఫోర్డ్ వేదికగా జరిగిన మ్యాచ్ ద్వారా ఆయన ఈ చారిత్రాత్మక అరంగేట్రం చేశాడు. ఈ క్రమంలో పురుషుల క్రికెట్‌తో పాటు ఓవరాల్ జాతీయ రికార్డులను కూడా వైభవ్ తిరగరాశాడు. అన్ని ఫార్మాట్లలో కలిపి అత్యంత పిన్న వయసులోనే అంతర్జాతీయ క్రికెట్ లోకి అడుగుపెట్టిన పురుష ఆటగాడిగా మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ పేరిట ఉన్న 36 ఏళ్ల నాటి రికార్డును ఈ బీహార్ కుర్రాడు బద్దలు కొట్టడం విశేషం. అయితే, తన తొలి మ్యాచ్ లో వైభవ్ సాధారణ ఆరంభాన్ని మాత్రమే అందుకున్నాడు. ఇంగ్లాండ్‌తో జరిగిన ఈ రెండో టీ20 మ్యాచ్‌లో 10 బంతులు ఎదుర్కొన్న వైభవ్ 14 పరుగులు చేశాడు. ఈ చిన్న ఇన్నింగ్స్‌లో రెండు భారీ సిక్సర్లు బాది తన పవర్ ఏంటో చూపించినప్పటికీ, ఆ తర్వాత క్రీజ్ వదిలి ముందుకు వచ్చి షాట్ ఆడబోయి స్టంప్ అవుట్‌గా వెనుదిరిగాడు. భారత్ తరఫున టీ20ల్లో అరంగేట్రం చేసిన టాప్ 5 అత్యంత పిన్న వయస్కులు వీళ్లేభారత క్రికెట్ చరిత్రలో ఇప్పటివరకు అత్యంత తక్కువ వయసులోనే

# ఏటీఎం పిన్‌లో కేవలం నాలుగు నెంబర్లు మాత్రమే ఎందుకుంటాయి..?



బ్యాంక్ అకౌంట్ కలిగి ఉన్న ప్రతీఒక్కరికీ తప్పనిసరిగా ఏటీఎం కార్డు అనేది ఉంటుంది. అత్యవసరంగా నగదు అవసరమైనప్పుడు సమీపంలోని ఏటీఎంలకు వెళ్లి సులువుగా డెబిట్ కార్డ్ ద్వారా విత్ డ్రా చేసుకుంటాం. ఇక బ్యాలెన్స్ చెకింగ్, నిధులు బదిలీ లాంటివి కూడా ఏటీఎం యంత్రాల ద్వారా చెక్ చేసుకోవచ్చు. ఇక నగదు డిపాజిట్ చేసేందుకు ప్రత్యేక క్యాష్ డిపాజిట్ మిషన్లు ఉంటాయి. డెబిట్ కార్డు ఉపయోగించి మన అకౌంట్లో సులువుగా డబ్బులు జమ చేయవచ్చు. అయితే ఏటీఎం కార్డు పిన్ నెంబర్ చూస్తే కేవలం నాలుగు నెంబర్లు మాత్రమే ఉంటుంది. నాలుగు నెంబర్లు మాత్రమే ఉండటానికి రీజన్ ఏంటి? దీని వెనుక ఉన్న సీక్రెట్ ఏంటి? అనే విషయాలు తెలుసుకుందాం.

ఏటీఎం ఎవరు అభివృద్ధి చేశారు..?

స్కాట్లాండ్‌కు చెందిన జాన్ షెపర్డ్ బారన్ ప్రపంచంలో తొలిసారిగా ఏటీఎంను అభివృద్ధి చేశారు. 1967 జూన్ 27న లండన్‌లోని ఎన్‌ఫీల్డ్ ప్రాంతంలో ఉన్న బార్‌క్లేస్ బ్యాంక్‌లో తొలి ఏటీఎంను తయారుచేశారు. ఒకరోజుబ్యాంకు మూసి ఉండటంతో ఆయన డబ్బులు తీసుకోలేకపోయారు. ఒకరోజు చాక్లెట్లు అమ్మే ఒక వెండింగ్ మెషీన్‌ను చూశారు. దీంతో అప్పుడు దాని తరహాలోనే పనిచేస్తే ఏటీఎం మెషీన్ ఆలోచన వచ్చింది. ఆ తర్వాత కొన్నిరోజులు కష్టపడి షెపర్డ్ బారన్ ాువీ మెషీన్ తయారుచేశాడు. ఆ తర్వాత సెక్యూరిటీ కోసం ఓ ్రా×చీ నెంబర్‌ను క్రియేట్ చేశాడు. షెపర్డ్ బారన్ సంఖ్యలు ఎంత ఎక్కువగా ఉంటే్రా×చీ అంత బలంగా ఉంటుందని అనుకున్నాడు. దీనిని గుర్తు పెట్టుకోవడం కష్టంగా ఉంటుంది గనుక మోసాలు జరగవని భావించాడు.

నాలుగు అంకెల పిన్ నెంబర్ ఎందుకు..?

ఒకరోజు తన భార్య కారోలిన్‌కు షెపర్డ్ బారన్ ఆరు అంకెల పిన్ నెంబర్ చెప్పాడు. కానీ ఆమె గుర్తించుకోలేకపోయింది. కేవలం నాలుగు అంకెలు మాత్రమే గుర్తుంచుకున్న ఆమె.. ఆ తర్వాత రెండు నెంబర్లను చెప్పలేకపోయింది. ఇది గమనించిన ఆయన.. పిన్ నంబర్‌ను 4 అంకెలుగా మార్చాడు. షెపర్డ్ బారన్ తీసుకున్న ఈ నిర్ణయం బ్యాంకింగ్ రంగానికి ఎంతో విలువైనదిగా మారింది. ప్రపంచవ్యాప్తంగా ఏటీఎం యంత్రాలకు నాలుగు అంకెల పిన్ నెంబర్ ఉపయోగిస్తున్నారు. అయితే నాలుగు అంకెల పిన్ నెంబర్ వల్ల మోసాలు జరిగే అవకాశం ఉన్నప్పటికీ.. గుర్తుంచుకోవడానికి సులభంగా ఉంటుంది. అయితే ఏటీఎంలో మూడుసార్లు తప్పు పిన్ నమోదు చేస్తే ఆటోమేటిక్‌గా కార్డు బ్లాక్ అవుతుంది. అందువల్ల నాలుగు అంకెల పిన్ సురక్షితమైనదిగా పరిగణించబడుతుంది. నాలుగు అంకెల పిన్ నెంబర్ వెనుక ఉన్న అసలు రీజన్ ఇదేనని చెప్పవచ్చు.

# ఆదాయపు పన్ను సెక్షన్ 245 నోటీసు ఎందుకు వస్తుంది? మీ రీఫండ్ ఆగిపోతుందా?




మీకు ఆదాయపు పన్ను చట్టం, 1961లోని సెక్షన్ 245 కింద నోటీసు అందినట్లయితే మీరు తప్పనిసరిగా ఏదైనా తప్పు చేశారని దాని అర్థం కాదు. వాస్తవానికి గత ఆర్థిక సంవత్సరం పన్ను బకాయిలను సర్దుబాటు చేయడానికి, ఆదాయపు పన్ను శాఖ మీ ప్రస్తుత సంవత్సరపు పన్ను వాపసు నుండి కొంత డబ్బును తగ్గించాలని కోరుకుంటోందని మాత్రమే ఈ సమాచారం సూచిస్తుంది. అందుకే ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఈ నోటీసును ఎప్పుడు, ఎందుకు జారీ చేస్తారు? దానికి ఎలా స్పందించాలి అనే విషయాలను సిఏ సంతోష్ మిశ్రా సులభంగా వివరించారు. ఈ నోటీసు ఏమిటి? ఇది ఎందుకు వస్తుంది?

ప్రస్తుత అసెస్మెంట్ సంవత్సరానికి మీకు రీఫండ్ రాబోతోందని, కానీ అంతకుముందు ఏదేని ఆర్థిక సంవత్సరం నుండి మీకు చెల్లించని పన్ను బకాయిలు కూడా ఉన్నాయని డిపార్ట్‌మెంట్‌కు తెలిసినప్పుడు, సెక్షన్ 245 కింద ఈ నోటీసు జారీ చేస్తారు. సిఏ సంతోష్ మిశ్రా ఒక ఉదాహరణతో వివరిస్తున్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను మీకు రూ. 12,000 రీఫండ్ రావాల్సి ఉందనుకుందాం . కానీ, 2022-23 ఆర్థిక సంవత్సరంలో ట్యాక్స్ క్రెడిట్స్‌లో తేడా రావడం వల్ల లేదా పన్ను చెల్లింపులో డిఫాల్ట్ అవ్వడం వల్ల, మీరు రూ. 8,000 పన్ను బకాయి పడ్డారు. అటువంటి సందర్భంలో ఈ బకాయి మొత్తాన్ని మీ రీఫండ్ నుండి తీసివేయడానికి డిపార్ట్‌మెంట్ సెక్షన్ 245 కింద ఒక ప్రతిపాదనను పంపుతుంది. ఫలితంగా మీకు రూ. 12,000కు బదులుగా కేవలం రూ. 4,000 నికర రీఫండ్ మాత్రమే లభిస్తుంది. అసలు బంగారం ధర ఇంకా తగ్గుతుందా? పెరుగుతుందా? తాజా రేట్ల వివరాలుఅలాగే ఈ సర్దుబాటు చేసే ముందు మీకు ముందుగానే తెలియజేయడం శాఖకు తప్పనిసరి. సాధారణంగా పన్ను చెల్లింపుదారులు ఈ నోటీసు అందిన 30 రోజులలోపు స్పందించాల్సి ఉంటుంది. ఈ వ్యవధిలోగా ఎటువంటి స్పందన రాకపోతే శాఖ ఎటువంటి ఆటంకం లేకుండా మీ వాపసు మొత్తాన్ని సర్దుబాటు చేయగలదని అన్నారు. మీ బకాయి పన్నును ఎక్కడ తనిఖీ చేసుకోవాలి?

మీరు ఎంత పన్ను చెల్లించాలో తెలుసుకోవాలనుకుంటే, పూర్తి సమాచారం ఆదాయపు పన్ను ఇ-ఫైలింగ్ పోర్టల్‌లో అందుబాటులో ఉంది. ముందుగా పోర్టల్‌లో మీ ఖాతాకు లాగిన్ అవ్వండి. ఆ తర్వాత, 'పెండింగ్ యాక్షన్స్' ఎంపికకు వెళ్లండి.

'బకాయి ఉన్న డిమాండ్‌కు ప్రతిస్పందన'పై క్లిక్ చేయండి. మీకు బకాయి ఉన్న అన్ని పన్ను డిమాండ్‌ల జాబితా కనిపిస్తుంది.

ఇక్కడ నుండి మీరు పాత, కొత్త సెక్షన్ 245 నోటీసులను చూడవచ్చు లేదా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

# బంగారం ధరల్లో ఊహించని మార్పులు



గత కొంత కాలం నుంచి బంగారం ధరల్లో ఊహించని మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఇటీవల రికార్డు స్థాయిలో దూసుకెళ్లిన పసిడి ధరలు.. తగ్గినట్లే తగ్గి మళ్లీ పెరుగుతున్నాయి.. ఇరాన్ -- అమెరికా యుద్ధం, అంతర్జాతీయంగా పలు ప్రాంతాల్లో చోటుచేసుకున్న ఉద్రిక్త పరిస్థితులతో బంగారం, వెండి ధరల్లో మార్పులు చోటుచేసుకుంటున్నాయని బులియన్ మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. తాజాగా బంగారం ధరలు స్థిరంగా కొనసాగుతున్నాయి. ఇదిలాఉంటే.. శనివారం ఒక్కరోజే పది గ్రాముల స్వచ్ఛమైన బంగారంపై రూ. 760 మేర ధర పెరిగింది. జులై 19 ఆదివారం పలు వెబ్‌సైట్లలో నమోదైన ధరల ఆధారంగా ఉదయం 6 గంటల వరకు దేశీయంగా బంగారం, వెండి ధరలు ఈ కింది విధంగా ఉన్నాయి. 24 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాముల ధర రూ. 1,43,290 గా ఉంది.

22 క్యారెట్ల పసిడి రేటు 10 గ్రాముల ధర రూ. 1,31,350 గా ఉంది. వెండి కిలో ధర రూ. 2,30,000 లు గా కొనసాగుతోంది.

అయితే.. ప్రాంతా వారీగా బంగారం, వెండి ధరల్లో వ్యాత్యాసం ఉంటుంది.

ప్రధాన నగరాల్లో బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయంటే. హైదరాబాద్‌లో గోల్డ్ 24 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ. 1,43,290, 22 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ. 1,31,350 గా ఉంది. వెండి కిలో ధర రూ. 2,35,000 ఉంది. విజయవాడ, విశాఖపట్నంలో 24 క్యారెట్ల పసిడి 10 గ్రాముల ధర రూ. 1,43,290, 22 క్యారెట్ల గోల్డ్ 10గ్రాముల ధర రూ. 1,31,350 ఉంది. వెండి కిలో ధర రూ. 2,39,900 ఉంది. ఢిల్లీలో 24 క్యారెట్ల గోల్డ్ 10 గ్రాముల ధర రూ. 1,43,440, 22 క్యారెట్ల ధర రూ. 1,31,450 గా ఉంది. వెండి కిలో ధర రూ. 2,30,000 ఉంది. ముంబైలో 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ. 1,43,290, 22 క్యారెట్ల ధర రూ. 1,31,350 గా ఉంది. వెండి కిలో ధర రూ. 2,30,000 లుగా ఉంది. చెన్నైలో 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ. 143,290, 22 క్యారెట్ల ధర రూ. 1,31,350 ఉంది. వెండి కిలో ధర రూ. 2,35,000 ఉంది. బెంగళూరులో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ. 1,43,290, 22 క్యారెట్ల ధర రూ. 1,31,350 ఉంది. వెండి కిలో ధర రూ. 2,30,000 లుగా ఉంది.

కాగా.. బంగారం, వెండి ధరలు అన్ని నగరాల్లో ఒకే విధంగా ఉండవు.. స్థానిక డిమాండ్, సరఫరా, అలాగే రాష్ట్ర పన్నులు, తదితర అంశాల ప్రకారం ఎప్పటికప్పుడు మారుతుంటాయి.. అందుకే అన్ని ప్రధాన నగరాల్లో కూడా ధరల్లో వ్యత్యాసాలు ఉంటాయి. ఒకవేళ మీకు బంగారం, వెండి ధరల లేటెస్ట్ అప్‌డేట్ గురించి తెలుసుకోవాలంటే ఈ మొబైల్ నెంబర్‌కు 8955664433కు మిస్డ్ కాల్ ఇవ్వవచ్చు.

సోమవారం,
జూలై 20, 2026
నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక



## చరణ్ సినిమా కోసం సుకుమార్ మాస్టర్ ప్లాన్.



రామ్ చరణ్ ఇటీవల నటించిన పెద్ది సినిమా భారీ వసూళ్లతో సక్సెస్ అందుకుంది. దీంతో సుకుమార్ డైరెక్షన్‌లో రానున్న చిత్రంపై అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. ఈ క్రమంలో కథను మలుపు తిప్పే ఒక ప్రత్యేకమైన పాత్ర కోసం చిత్ర యూనిట్ స్టార్ హీరోయిన్‌ను సంప్రదించినట్టు వార్తలు వస్తున్నాయి.భారీ అంచనాలుచిత్ర పరిశ్రమలో కొన్ని కాంబినేషన్లకు ఉండే క్రేజ్ అంతా ఇంతా కాదు. గతంలో టాలీవుడ్‌ను షేక్ చేసిన 'రంగస్థలం' కాంబో రామ్ చరణ్, సుకుమార్ మళ్లీ కలిసి సినిమా చేస్తున్న 'ఆర్‌సీ17'పై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. సుకుమార్ సినిమాల్లోని క్యారెక్టరైజేషన్లు ఎంత బలంగా ఉంటాయో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. కేవలం హీరో హీరోయిన్ల క్యారెక్టర్లకే పరిమితం కాకుండా, కథను నడిపించే ఇతర పాత్రలను కూడా ఎంతో పవర్‌ఫుల్‌గా తీర్చిదిద్దుతారు. ఇప్పుడు 'ఆర్‌సీ17' విషయంలోనూ అదే మేజిక్ చేస్తారని అభిమానులు భావిస్తున్నారు.పవర్‌ఫుల్ రోల్‌లో..ప్రస్తుతం సినీ వర్గాల సమాచారం ప్రకారం.. ఈ చిత్రంలో ఒక కీలకమైన, కథను మలుపు తిప్పే పాత్ర కోసం లేడీ సూపర్ స్టార్ నయనతారను ఎంపిక చేసినట్లుగా ప్రచారం సాగుతోంది. ఇందులో ఆమె సాధారణ పాత్రలో కాకుండా, విలక్షణమైన శైలితో పవర్‌ఫుల్ రోల్‌లో మెరవనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన స్క్రిప్ట్ వర్క్ పూర్తయినట్లు, దర్శకుడు సుకుమార్ చివరి మార్పుల కోసం అమెరికా వెళ్లినట్లు ఇండస్ట్రీ టాక్. కథలో నయనతార పాత్ర చిత్రణ అద్భుతంగా కుదిరిందని, అందుకే ఆమె అయితేనే ఆ క్యారెక్టర్‌కు పూర్తి న్యాయం జరుగుతుందని చిత్ర బృందం భావిస్తోందట.మెగాస్టార్ తర్వాత..ఇటీవల మెగాస్టార్ చిరంజీవి సరసన నటించి భారీ విజయాన్ని అందుకున్న నయనతార, ఇప్పుడు కొడుకు రామ్ చరణ్ చిత్రంలో ఒక ప్రత్యేక పాత్రకు గ్రీన్ సిగ్నల్ ఇస్తే ఈ సినిమా రేంజ్ పాన్-ఇండియా స్థాయికి చేరడం ఖాయంగా కనిపిస్తోంది. నయనతార కేవలం గ్లామర్ పాత్రల వైపు మొగ్గు చూపరు. కథలో ప్రాధాన్యత ఉండి, తన నటనకు స్కోప్ ఉంటేనే ప్రాజెక్టులకు ఓకే చెప్తారు.

## త్రిష ఆ పని చేస్తే సినిమా సూపర్ హిట్టే.



స్టార్ హీరోయిన్ త్రిష సోషల్ మీడియాలో బాగా వైరల్ అవుతోంది. కోలీవుడ్ స్టార్ హీరోస్ బ్లాక్ బస్టర్ మూవీస్‌లో ఆమె భాగం కావడమే ఇందుకు కారణం. ఇందుకు సంబంధించి ఓ అభిమాని చేసిన పోస్ట్ వైరల్ కాగా... దాన్ని త్రిష కూడా తన ఇన్ స్టా స్టోరీలో షేర్ చేసింది. వివరాల్లోకి వెళితే.. సూర్య హీరోగా నటించిన కరుప్పు (తెలుగులో వీరభద్రుడు) సినిమా బాక్సాఫీస్ ను షేక్ చేస్తోంది. మే 15న రిలీజైన ఈ సినిమా ఇప్పటకే రూ. 250 కోట్లకు పైగా కలెక్షన్లు సాధించింది. అంతేకాదు సూర్య కెరీర్ లోనే బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ గా నిలిచింది. అంతకు ముందు స్టార్ హీరోస్ అజిత్, విజయ్ ల కెరీర్‌లోనేనే అత్యధిక వసూళు సాధించిన మూవీస్‌లో త్రిషనే హీరోయిన్ గా చేసింది. విజయ్, త్రిషల కాంబినేషన్ లో వచ్చిన లియో బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లు సాధించింది. ఇప్పటివరకు విజయ్ కెరీర్ లోనే ఇదే బిగ్గెస్ట్ హిట్. అలాగే అజిత్, త్రిషలు హీరో, హీరోయిన్లుగా నటించిన గుడ్ బ్యాడ్ అగ్లీ కూడా భారీ వసూళ్లను రాబట్టింది. ఇది కూడా అజిత్ కెరీర్ లోనే బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్. ఇప్పుడు కరుప్పు కూడా సూర్య కెరీర్ లోనే బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ గా నిలిచింది. ఇందులో లాయర్‌గా ప్రీతి పాత్రలో త్రిష మెప్పించింది..

## సాయి పల్లవి ఆ సూపర్ హిట్ సినిమాను మిస్ చేసుకుందా



లేడీ పవర్ స్టార్ సాయి పల్లవి.. ఈ అందాల భామలు తెలుగు రాష్ట్రాల్లో ఉన్న క్రేజే వేరు. స్టార్ హీరోలకు సమానంగా ఫ్యాన్ బేస్ సొంతం చేసుకుంది సాయి పల్లవి. ఎన్నో సూపర్ హిట్ సినిమాల్లో నటించి మంచి గుర్తింపు తెచ్చుకుంది ఈ ముద్దుగుమ్మ. స్కిన్ షోకు దూరంగా ఉంటూ ప్రేక్షకుల మనసులను దోచేసింది సాయి పల్లవి. ఇప్పుడున్న హీరోయిన్స్ అందరూ గ్లామర్ షోతో ఆకట్టుకుంటున్నారు.. కానీ సాయి పల్లవి అలాంటి వాటి జోలికి పోకుండా నటనకు ప్రాధాన్యత ఉన్న పాత్రలు చేసుకుంటూ ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. కుర్రాలందరూ సాయి పల్లవి లాంటి లవర్ మనకు ఉండాలని అనుకుంటుంటారు. మలయాళం ప్రేమమ్ సినిమాతో ఎంట్రీ ఇచ్చిన ఈ చిన్నది ఫస్ట్ మూవీతోనే ఓ రేంజ్ ఫాలోయింగ్ సంపాదించుకుంది.అంతకు ముందు పలు చిత్రాల్లో సైడ్ క్యారెక్టర్స్ పోషించింది. ఫిదా సినిమాతో తెలుగు ప్రేక్షకులను పలకరించింది ఈ ముద్దుగుమ్మ.. ఆ తర్వాత బ్యాక్ టూ బ్యాక్ చిత్రాలతో ప్రేక్షకులను అలరించింది. తెలుగుతో పాటు తమిళ్, హిందీ సినిమాల్లో నటిస్తూ ఫుల్ బిజీగా ఉంది సాయి పల్లవి. తెలుగులో చివరగా తండేల్ సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్న ఈ భామ.. ఇప్పుడు హిందీలో రామాయణం చిత్రంలో నటిస్తుంది. ఇందులో రణభీర్ కపూర్ రాముడిగా నటిస్తుండగా.. సీత పాహిందీ సినిమాల్లో నటిస్తూ ఫుల్ బిజీగా ఉంది సాయి తలో సాయి పల్లవి కనిపించనుంది.ఇదిలా ఉంటే సాయి పల్లవి ఓ క్రేజీ సినిమా ఆఫర్ ను మిస్ చేసుకుందని సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతుంది. ఆ సినిమా ఎదో కాదు విజయ్ దేవరకొండ హీరోగా నటించిన డియర్ కామ్రేడ్. విజయ్, రష్మిక జంటగా నటించిన ఈ సినిమా మంచి విజయాన్ని అందుకుంది. ఈ సినిమా చాలా మంది ఫేవరెట్ మూవీ. అయితే ఈ సినిమాలో ముందుగా హీరోయిన్ గా సాయి పల్లవిని ఎంపిక చేశారని గుసగుసలు వినిపిస్తున్నాయి.

## జాతీయ అవార్డుల్లో మెరిసిన తెలుగు సినిమా.




జాతీయ అవార్డుల్లో తెలుగు సినిమా మెరిసింది. ఏకంగా 7 అవార్డులను సాధించింది. ఈ ఏడాది జాతీయ స్థాయిలో తెలుగు చలనచిత్ర పరిశ్రమ తన సత్తా చాటుతూ పలు విభాగాలలో అవార్డులను కైవసం చేసుకుంది. ఈ నేపథ్యంలో యంగ్ టైగర్ ఎన్టీఆర్ విజేతలకు సోషల్ మీడియా వేదికగా అభినందనలు తెలిపారు. జాతీయ స్థాయిలో తెలుగు సినిమా ఇంత అద్భుతంగా రాణించడం చూడటం ఎంతో గర్వంగా ఉందంటూ ఆయన ట్వీట్ చేశారు. "72వ జాతీయ చలనచిత్ర అవార్డుల విజేతలందరికీ నా హృదయపూర్వక అభినందనలు. జాతీయ వేదికపై తెలుగు సినిమా ఇంత అద్భుతంగా రాణించడం చూస్తుంటే ఎంతో గర్వంగా ఉందంటూ" ఎన్టీఆర్ ట్వీట్ చేశారు. చిత్రాల వారీగా అవార్డులు గెలుచుకున్న టీమ్స్ అందరినీ ఆయన పేరుపేరునా అభినందించారు.ఎన్టీఆర్ అభినందనలు అందుకున్న చిత్రాలు ఇవే.బెస్ట్ పాపులర్ మూవీ అవార్డు గెలుచుకున్న కల్కి 2898 ాణ చిత్రానికి గానూ దర్శకుడు నాగ్ అశ్విన్, నిర్మాతలు స్వప్న దత్, ప్రియాంక దత్, చిత్ర బృందానికి తారక్ ప్రత్యేక అభినందనలు తెలిపారు. పుష్ప 2 చిత్రానికి గాను క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్, చిత్ర బృందానికి ఎన్టీఆర్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ చిత్రానికి సుకుమార్ ఉత్తమ స్క్రీన్‌ప్లే అవార్డును దక్కించుకున్నారు. చిన్న చిత్రంగా వచ్చి పెద్ద విజయం సాధించిన కమిటీ కుర్రోళు సినిమా నిర్మించిన నిహారిక కొణిదెల, దర్శకుడు యదు వంశీలతో పాటు పూర్తి చిత్ర యూనిట్‌కు తారక్ శుభాకాంక్షలు అందజేశారు. ఈ చిత్రం ఉత్తమ తెలుగు చిత్రంగా జాతీయ అవార్డును సొంతం చేసుకుంది. ఫీల్ గుడ్ ఎమోషన్స్‌తో అలరించిన 35 చిన్న కథ కాదు చిత్ర బృందం కూడా జాతీయ స్థాయిలో రెండు అవార్డులను గెలుచుకోవడంపై ఎన్టీఆర్ హర్షం వ్యక్తం చేస్తూ అభినందించారు.వెంకీ అట్లూరికి స్పెషల్ విషెస్

## అమ్మ పాదాలను బంగారంతో చేయించి పెట్టుకున్న ఏకైక హీరో.



నటుడు నరేశ్, తన తల్లి, తెలుగు సినిమా చరిత్రలో చెరగని ముద్ర వేసిన ప్రముఖ నటి, దర్శకురాలు విజయ నిర్మల స్మృతిని శాశ్వతంగా నిలిపి ఉంచేందుకు ఒక అపురూపమైన కార్యాన్ని చేపట్టారు. ఆమె మరణానంతరం, తన మిత్రుడు వికాస్ ఇచ్చిన ఆలోచన మేరకు, ఆమె పాదాల మౌల్డ్‌ను సేకరించి బంగారంతో తయారు చేయించారు. ఈ బంగారు పాదాలను తన ఇంట్లో ప్రత్యేకంగా ప్రతిష్ఠించి, నిత్యం పూజిస్తూ, తల్లికి తన ప్రేమను, కృతజ్ఞతను చాటుకుంటున్నారు. నరేశ్ దృష్టిలో ఇవి కేవలం జ్ఞాపకాలు కావు, తన జీవితానికి రెండు బలమైన స్తంభాలు అని అన్నారు. వాటిని ప్రతి ఉదయం దర్శించడం వల్ల తనకు అపరిమితమైన ధైర్యం, ప్రేరణ లభిస్తాయని ఆయన అన్నారు. విజయ నిర్మల కేవలం తన పాదాల ద్వారానే కాకుండా, ఆమె జీవించిన విధానం ద్వారా, ఆమె అలవాట్లు, ఆకాంక్షల ద్వారా కూడా తన ఇంట్లోనే నిత్యం సజీవంగా ఉన్నారని నరేశ్ బలంగా నమ్ముతున్నాని అన్నారు. తన తల్లికి ఇష్టమైన పిల్లితో.. ఆమెకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఆమె మరణానంతరం కూడా ఆ పిల్లి ఆమె ఫోటో కింద పడుకుంటూ, ఆమె గ్లాసులో నీరు తాగేదని, చివరికి మరణించిన తర్వాత ఆమె విగ్రహం వెనుకనే పూడ్చి పెట్టామని నరేశ్ వెల్లడించారు. ఈ అనుభవాలు ఆమె స్ఫూర్తి ఇంట్లో నిండి ఉందని నరేశ్ నమ్మకాన్ని బలపరుస్తాయని తెలిపారు. విజయ నిర్మల కేవలం తన పాదాల ద్వారానే కాకుండా, ఆమె జీవించిన విధానం ద్వారా, ఆమె అలవాట్లు, ఆకాంక్షల ద్వారా కూడా తన ఇంట్లోనే నిత్యం సజీవంగా ఉన్నారని నరేశ్ బలంగా నమ్ముతున్నాని అన్నారు. తన తల్లికి ఇష్టమైన పిల్లితో.. ఆమెకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఆమె మరణానంతరం కూడా ఆ పిల్లి ఆమె ఫోటో కింద పడుకుంటూ, ఆమె గ్లాసులో నీరు తాగేదని, చివరికి మరణించిన తర్వాత ఆమె విగ్రహం వెనుకనే పూడ్చి పెట్టామని నరేశ్ వెల్లడించారు. ఈ అనుభవాలు ఆమె స్ఫూర్తి ఇంట్లో నిండి ఉందని నరేశ్ నమ్మకాన్ని బలపరుస్తాయని తెలిపారు. అందుకే, తన తల్లి జీవించి ఉన్నప్పుడు ఆచరించిన దినచర్యను ఇప్పటికీ అదే విధంగా కొనసాగిస్తున్నానని అన్నారు. ప్రతిరోజూ ఉదయం ఆమెకు బెడ్ కాఫీ, అల్పాహారం (చెన్న మసాలా, పూరి, ఉప్మా వంటివి), మధ్యాహ్న భోజనం, సాయంత్రం కాఫీ, రాత్రి భోజనం ఆమెకు ఇష్టమైన మెనూ ప్రకారమే సిద్ధం చేస్తారు. ఇంట్లో ఆమె వాడిన వస్తువులు, అలంకరణలలో ఎలాంటి మార్పు చేయలేదని, ఆమెకు ఎంతో నచ్చిన మహేశ్ బాబు ఫోటోను కూడా ఆమె సూచన మేరకు అలాగే ఉంచారని నరేశ్ వివరించారు.

## సినిమా ఇండస్ట్రీలో అతనే నా ఫ్రెండ్.. వచ్చే జన్మలో అలా పుట్టాలని ఉంది



ప్రముఖ నటుడు సయాజీ షిండే ప్రస్తుతం సినిమాల స్పీడ్ తగ్గించారు. ఒకప్పుడు ఆయన సినిమాలు వరుసగా విడుదలై ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకునేవి. ఈ మధ్యకాలంలో ఆయన పెద్దగా కనిపించడం లేదు. తెలుగుతో పాటు మరాఠి సినిమాల్లోనూ నటించి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు సాయాజీ షిండే. కాగా గతంలో ఆయన ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. తన సినీ జీవితం, వ్యక్తిగత జీవితం, రాఖీ సినిమా అనుభవాలతో పాటు అనేక ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. హాస్యనటుడు అలీతో తనకున్న సన్నిహిత అనుబంధాన్ని వివరిస్తూ, ఇద్దరి పోరాటాలు, జీవిత అనుభవాలు, కష్టతరమైన రోజులు, ప్రస్తుతం పొందిన స్థానం గురించి తరచుగా మాట్లాడుకునేవారమని తెలిపారు. అలీతో తన కెమిస్ట్రీ ప్రేక్షకులకు ఎప్పుడూ నచ్చేదని షిండే పేర్కొన్నారు.సినీ పరిశ్రమలో పదేళ్లుగా తన పద్ధతుల్లో ఎటువంటి మార్పు రాలేదని సయాజీ షిండే తెలిపారు. ఆయన పనిపైనే పూర్తి ఏకాగ్రతతో ఉంటారని, పార్టీలు, గ్రూపులకు దూరంగా ఉంటారని చెప్పారు. వందకు పైగా చిత్రాలలో నటించినా, ప్రతి షూటింగ్‌లో ఒక విద్యార్థిలా డైరెక్టర్‌ను సన్నివేశం గురించి అడిగి, అసిస్టెంట్‌తో మాట్లాడి, పెన్, ప్యాడ్‌తో డైలాగులు రాసుకుని, వాటిపై పని చేస్తానని వెల్లడించారు. ఇది తన నిబద్ధతకు నిదర్శనమని, దీనివల్లే తాను ఎక్కువ సినిమాల్లో నటించగలిగానని తెలిపారు. సయాజీ షిండే